
ఆంధ్రప్రదేశ్



జనవరి 1968

★

30 పైసలు

ఆంధ్రప్రదేశ్‌ను గురించి...

విస్తీర్ణం	1.06.286 చ. మై.
జిల్లాలు	20
తాలూకాలు	189
గ్రామాలు	28,997
పట్టణాలు, నగరాలు	212
మొత్తం జనసంఖ్య (1961)	359.83 లక్షలు
జన సాంద్రత (1961)	339 చ. మై. 13.
అక్షరాస్యులు (1961)	76.27 లక్షలు
షెడ్యూల్డు కులాలవారు (1961)	49.74 లక్షలు
షెడ్యూల్డు తెగలవారు (1961)	13.24 లక్షలు
నమోదైన కర్మాగారాలు	2,928
విశ్వవిద్యాలయాలు	4
పంచాయతీలు	15,266
పంచాయతీ సమితులు	321
ఆంధ్రప్రదేశ్ నుంచి పార్లమెంటు సభ్యులు	61
విధానసభ సభ్యులు	288
శాసనమండలి సభ్యులు	90

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి 12]　　జనవరి – 1968　　[సంచిక: 3

పౌష్య – మాఘ – 1889 శా.శ

ప్రధాన సంపాదకులు

వి. యస్. రామన్, ఐ. ఎ. యస్.

సంపాదకులు

ఎస్. వి. గోపాలశాస్త్రి

ఈ సంచికలో...

పేజీ

మొదటి అట్ట : పోల్‌వాల్ట్
ఆరవ జాతీయ ఎథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు డిసెంబరులో హైదరాబాదులో జరిగాయి

మూడవ అట్ట : నౌబత్‌పహాడ్ దృశ్యం

నాలుగవ అట్ట : పబ్లిక్‌గార్డెన్స్‌లో పడవ షికారు

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు. సం॥

వీరగంధము

—కవిరాజు త్రిపురనేని

వీరగంధము తెచ్చినారము
వీరుడెవ్వడొ తెల్పుడీ!
పూసి పోదుము, మెడను వైతుము
పూలదండలు భక్తితో!

నడుము గట్టిన తెలుగు బాలుడు
వెనుక తిరుగం డెన్నడున్
బాసయిచ్చిన తెలుగు బాలుడు
పారిపోవం డెన్నడున్

తెనుగు బావుట కన్ను చెదరగ
కొండవీటను నెగిరి నప్పుడు
తెలుగు వారల కత్తి దెబ్బలు
గండికోటను కాచినప్పుడు

ఇదిగొ యున్నది వీర గంధము
మైనలందుము మైనలందుము
శాంతిపర్వము జదువ వచ్చును
శాంతిసమరం బైన పిమ్మట


తెలుగు వారల వేడి నెత్తురు
తుంగభద్రను గలిసినప్పుడు
దూరమందున నున్న సహ్యజ
కత్తి నెత్తురు కడిగి నప్పుడు


తెనుగు నాటిని వీరమాతను
చేసి మాత్రము తిరిగి రమ్మిక
పలు తుపాకులు పలు ఫిరంగులు
దారి కడ్డము రాక తప్పవు

ఇట్టి సందియ మెన్నడేనియు
పుట్టలేదు రవంతయున్
ఇట్టి ప్రశ్నల నడుగు వారలు
లేకపోయిరి సుంతయున్

వీరగంధము తెచ్చినారము
వీరుడెవ్వడొ తెల్పుడీ!
పూసి పోదుము మెడను వైతుము
పూలదండలు భక్తితో!

[రచన 1929 ఉప్పుసత్యాగ్రహ సమయంలో, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు నాయకత్వము వహించిన దళమునకు వీడ్కోలు సందర్భంగా]





పునరంకితులమవుదాం

జనవరి ఇరవైఆరు రిపబ్లిక్ దినం. ప్రజల పండుగ దినం. పద్దెనిమిదేళ్ళక్రిందట ఆరోజుననే భారత ప్రజలు సర్వసత్తాక ప్రజాస్వామిక దేశంగా తమ దేశాన్ని రూపొందించుకుని, భారతప్రజలందరికీ న్యాయాన్ని, సాంఘికజీవితాన్ని, ఆర్థిక, రాజకీయ సమానతనూ అందజేసేందుకు ముక్తకంఠంతో నిర్ణయించుకున్నారు. అందువల్ల న్యాయం అంతటా వెల్లివిరిసేందుకు ఎవరికివారు ఆత్మసంశోధన చేసుకోవడం యీనాడు ఎంతయినా అవసరం.

మన నిత్యజీవితంలో భిన్నభిన్న రంగాలలో యితరులతో మనం వ్యవహరించే ప్రతి విషయంలోనూ నిష్కల్మషంగానూ, స్వార్థరహితంగానూ వుండాలి. మనలో చాలామందికి న్యాయబద్ధమైన ప్రవర్తన, గుణగణాలు లేవని ఎప్పుడూ ఎవరో వొకరు అంటూనే వున్నారు, దీనివల్ల ప్రజాస్వామ్యం ఎంతమాత్రమూ పటిష్ఠవంతం కాజాలదు. పైగా ప్రజాస్వామ్యమే కూకటి వేళ్ళతో నిర్మూలింపబడగలిగే ప్రమాదంవుంది. అందుచేత యీలోపాన్ని తొలగించడానికి మనమంతా కలిసికట్టుగా కృషిచేయాలి.

మనమంతా, మనఉనికికే ప్రమాదం వాటిల్ల జేసే, మనుగడనేవిషపూరితంచేసే సంఘవిద్రోహ ధోరణులను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. విచ్ఛిన్నతా ధోరణులను ప్రభుత్వం తప్పక అణచి వేస్తుంది. అయితే ప్రభుత్వంతోపాటు ప్రజలున్నూ తోడ్పడాలి. సత్యవంతమైన జీవితాన్ని, నిస్వార్థపూరితమైనజీవితాన్ని గడిపే ఆలోచన ప్రతిఒక్కరిలోనూ కలిగి ప్రతిఒక్కరూ అందుకు ముందుకు రావాలి.

మహాత్మాగాంధీజీ మనకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారు, నెహ్రూజీ ప్రజాస్వామ్యాన్ని అందించారు. పటేల్ సమైక్యతను దృఢపరిచారు. భారతదేశచరిత్ర ఎప్పుడైనా జాజ్వల్యమానంగా వికసించిందంటే అది కంటకావృత మార్గాన్ని అధిగమించినప్పుడే. ఈదేశం ఎప్పుడూ విధితో పోటీపడుతూ ఎదురొడ్డినిలిచి ముందుకు అడుగువేస్తున్నది.

రిపబ్లిక్ దినాన్ని మనం మనహృదయాలలో ప్రతిష్ఠించుకోవలసిన రోజు. దేశానికంతటికీ ఆరోజు పండుగ. అందరికీ ఆనంద దినం. పద్దెనిమిదేళ్ళ క్రిందట మనం చేసిన ప్రతిజ్ఞలకు, నిర్ణయాలకు పునరంకితులం కావలసిన దినం.



కేంద్రంలో

మన ప్రధాని

ఈనాడు ప్రపంచంలోని అగ్రశ్రేణి నాయకులలో శ్రీమతి ఇందిరా గాంధీ ఒకరు. ప్రపంచ మంతటిలోకీ పెద్దదైన ప్రజా స్వామిక వ్యవస్థకు ఆమె ప్రధానమంత్రి.

భారత స్వాతంత్ర్య సంగ్రామాల ప్రభావాలను తమలో ప్రతిఫలింప జేసుకున్న శ్రీమతి ఇందిరాగాంధీని గూర్చి చెప్పవలసి నది ఎంతయినావున్నది. ఆమె మాట్లాడే ధోరణిలోనే ఒక ప్రత్యేకత వున్నది. వివిధ రంగాలలో ఆమె అతి సమర్థవంతంగా ప్రతిభావ్యుత్పత్తులను ప్రదర్శించారు. 1959లో కాంగ్రెస్ అధ్యక్షపీఠాన్ని అధిరోహించి అతి చాకచక్యంగా ఆ పదవిని నిర్వహించారు. వాస్తవిక రాజకీయ దృక్పథంతో, ముందుచూపుతో ఆమె వెనకటి బొంబాయి రాష్ట్రాన్ని భాషాప్రాతిపదిక మీద విభజించవలసిన అవసరాన్ని గుర్తించారు.

వ్యవస్థాగత కృషి, పరిపాలనా దక్షతలలో ఆమెకు ఆమే సాటి. 1955 నుండి ఆమె కాంగ్రెసుపార్టీ సభ్యురాలు. 1955 నుండి కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యురాలు. అంతేకాదు కాంగ్రెసు పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్రపార్లమెంటరీ బోర్డులతోకూడా ఆమెకు సన్నిహిత సంబంధంవుంది. కాంగ్రెసు మహిళా విభాగానికి అధ్యక్షురాలు. మహిళా కాంగ్రెసు వ్యవస్థాపకులలో ఆమె కూడ ఒకరు. గతంలో ఆమె శాసన సభ్యుల సదస్సులను, కాంగ్రెసు సభ్యులయిన మహిళా కార్యకర్తల శిబిరాలను నిర్వహించారు. 1947 నుంచి ప్రతి పెద్ద ఎన్నికలోనూ కాంగ్రెసును గూర్చి విశేషంగా ప్రచారం చేశారు. దేశంలోని మారుమూలల్లోనూ, వెనుకబడిన ప్రాంతాలలోనూ పర్యటించారు.

దేశ స్వాతంత్ర్య పోరాటకాలంలో పదమూడు మాసాల పాటు కారాగారవాసం అనుభవించారు.

అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. భారతీయ శిశు సంక్షేమ మండలి అధ్యక్షురాలుగా, శిశు సంక్షేమానికి సంబంధించిన అంతరాతీయ సమాఖ్య ఉపాధ్యక్షురాలుగా, జాతీయ సమైక్యతా సంఘం అధ్యక్షురాలుగా, యునెస్కో ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యురాలుగా, విద్యా విషయిక కేంద్ర సలహాసంఘం సభ్యురాలుగా, బాల సహయోగ్ సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలుగా శ్రీమతి ఇందిరా గాంధీ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో సన్నిహిత సంబంధం కలిగి ప్రజాహిత కార్య క్రమాలలో అవిరళ కృషి గావించారు.

ఒకసారి శ్రీమతి ఇందిరాగాంధీ అన్నారు "దేశం చాలా తొందరలోవుంది. కాలాన్ని వ్యర్థపర్చలేము". ఢిల్లీ వారపత్రిక ఒకదానికి ఇంటర్వ్యూ యిస్తూ ఒకసారి ఆమె అన్నారు. "ఉత్సాహంతో పని చేసే వాళ్ళంటే నాకుయిష్టం. ఈవిధంగా కాంగ్రెసుతో కలిసి పనిచేస్తూ ... ప్రజల్లో అధిక సంఖ్యాకులు నిర్మాణాత్మక కృషిలో నిజంగా భాగస్వాములైనారు."...

1917 నవంబరు 19న శ్రీమతి ఇందిరాగాంధీ జన్మించారు. అక్టోబరు విప్లవ సమయంలో జన్మించిన ఈమె చిన్ననాటనే రాజకీయాల వైపు ఆకర్షితు లయ్యారు. అలహాబాదులోని వీరి పూర్వీకుల గృహం 'ఆనంద భవన్' స్వాతంత్ర్యానికి పూర్వం రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా వుంటూ వచ్చింది. యిరవై ఒకటవయేట ఆమె కాంగ్రెసులో ప్రవేశించారు. వరుసగా మూడు తరాలపాటు మోతీలాల్ నెహ్రూ, జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీలు_ భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించిన ఘనత నెహ్రూ కుటుంబానికే దక్కింది.

శ్రీమతి ఇందిరాగాంధీ దృఢమైన చిత్తవృత్తిగల వ్యక్తి. దేశానికి నాయకత్వం వహించి రెండుఏళ్ళుకూడా కాకముందే తన నాయకత్వ ప్రతిభా సామర్థ్యాలపై ప్రజలకు అపార విశ్వాసాలను కలిగించారు. ఆమె ప్రజలలోకి వెళ్ళి ప్రజల సమస్యలను అవగాహన చేసుకునే ప్రజా రథసారథి.

ప్రధాని తాము ఎప్పుడూ సరైన రాజకీయ ధోరణులనే అనుసరించి సరియైన కార్య క్రమాలనే చేపట్టి కోట్లాది దేశ ప్రజల విశ్వాసాన్ని, అంగీకారాన్ని చూరగొంటూ వుంటారు.

మన ఉపప్రధాని



"తాను పీడింపబడకుండా ఉండేందుకై ప్రతివ్యక్తీ తగినంత వివేకాన్ని, ధైర్యాన్ని కలిగివున్నప్పుడు సరైన సమాజం దానంతటది ఏర్పడుతుంది. సాంఘిక న్యాయ వాతావరణము నెలకొని వుండడమే సోషలిస్టు తరహా సమాజలక్ష్యం" అంటారు, ఉప ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్.

శ్రీ దేశాయ్ 1896 ఫిబ్రవరి 29వ తేదీన జన్మించారు. ఆయన జన్మించిన ఏడాదే గాంధీజీ మొట్టమొదటిసారి భారత రాజకీయాలలో ప్రవేశించే వుద్దేశంతో దక్షిణాఫ్రికా నించి తిరిగి వచ్చారు. మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యాక మొరార్జీ బొంబాయివెళ్ళి విల్సన్ కళాశాలలో సైన్సు అభ్యసించారు.


1919లో కళాశాలలో వున్నప్పుడు శ్రీ దేశాయ్ కాంగ్రెసు వాలంటీరుగా పనిచేశారు. అప్పుడే గాంధీజీని బొంబాయిలో చూశారు. మహాత్మాగాంధీ ప్రారంభించిన అనేక శాసనోల్లంఘనాలలో పాల్గొని నాలుగుసార్లు శ్రీ దేశాయ్ కారాగారవాసం అనుభవించారు. మొత్తం ఆయన పదేళ్లు జైలు జీవితం గడిపారు.

1937లో బ్రిటిష్‌ప్రభుత్వం భారత దేశానికి ప్రాంతీయ అధికారాన్ని యిచ్చినప్పుడు కాంగ్రెసు ఎన్నికల్లో గెలిచింది. అప్పుడు శ్రీ దేశాయ్ బొంబాయి ప్రభుత్వమున రెవిన్యూమంత్రిగా ఎన్నికయ్యారు. ఆ ప్రభుత్వం 1939లో రాజీనామా యిచ్చేవరకు ఆయన ఆ పదవిలోనే వున్నారు. ఆ కొద్దికాలంలోనూ ఆయన పోలీసుశాఖను పునర్వ్యవస్థీకరించి, కౌలుదారీ రైతుల స్థితిగతులను మెరుగుపరిచే చట్టాన్నిచేసి సమర్థుడైన పరిపాలకునిగా నిరూపించుకున్నారు. 1946లో శ్రీ దేశాయ్ బొంబాయి రాష్ట్రానికి హోం, పోలీసు శాఖల మంత్రిగా ఉండేవారు. ఆరేళ్ళ తర్వాత బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అనేక భూసంస్కరణలను అమలు పరిచారు. సమర్థనీయుడైన పరిపాలకుడిగా వ్యవహరించారు. ప్రజల బాధల బరువులను తొలగించడంలోనే సామర్థ్యము, శక్తి వెల్లడవుతాయన్నది ఆయన రాజకీయ సిద్ధాంతం.

1958లో శ్రీ దేశాయ్ కేంద్ర ఆర్థిక మంత్రిగా నియుక్తులయ్యారు. ఆనాటినుండి అప్పుడప్పుడు కొద్దికాలం మినహా మన దేశ ఆర్థిక వనరులను అత్యంత శక్తిసామర్థ్యాలతో నిర్వహించారు. ఆర్థికశాస్త్ర విషయాలలో వారి ప్రతిభ అపారమైనది. ఒక సందర్భంలో వారు యిలా అన్నారు. "ఈదేశంనుంచి దారిద్ర్యాన్ని మనం పారద్రోలాలి. ప్రతివ్యక్తికీ సంతృప్తికరమైన ఉపాధిని అందించాలి. ప్రతివ్యక్తికీ సంతృప్తికరమైన జీవన ప్రమాణాన్ని కల్పించాలి. ప్రయోజనకరమైన జీవితాన్ని గడపాలంటే మరో రెండువందల యేళ్ళపాటు వేచివుండే ఓపిక తొందరైన శాతం ప్రజలకు లేదు. అందుచేత అనవరతము మనం శ్రమించి, మన ఉత్పత్తులను మరింత ఎక్కువగా చేసుకుంటూ దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధిచేసి జీవన ప్రమాణం మెరుగుపరిచేవిధంగా మన ప్రణాళికలను రూపొందించుకోవలసిన అవసరం ఎంతయినా వుంది."

రాష్ట్రంలో

మన ముఖ్యమంత్రి



ఆంధ్ర రాజకీయాలలో గుంటూరు జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం వుంది. దేశభక్త కొండావెంకటప్పయ్యపంతులు, ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రివంటి నాయకులను గుంటూరుమండలం మనకు ప్రసాదించింది. పల్నాటి అటవీ సత్యాగ్రహం, రెండవ బార్డోలీగా పేరుకెక్కిన పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం శ్రీ బ్రహ్మానందరెడ్డిని ఉత్తేజపరచినవి. రాజకీయాల్లో ప్రవేశించిన కొద్దిసంవత్సరాలకే సుమారు యిరవైతొమ్మిదేళ్ళక్రితం గుంటూరు జిల్లాలో బాధ్యతగల పదవిని చేపట్టి ఆనాటినుండి తన శక్తి వంచనలేకుండా ప్రజా శ్రేయస్సుకై ఆయన కృషి చేస్తూ వున్నారు. (తరువాయి 8వ పుటలో)

మన జాతీయజెండా నిర్మాత

శ్రీ పింగళి వెంకయ్య

—పి. రాజేశ్వరరావు

జాతికి ముందునిలిచే మార్గదర్శకుల జీవితాలకు ఒక లక్ష్యమూ, ఒక ప్రత్యేకతా ఎప్పుడూ వుంటూనే వుంటాయి. ఇతరుల జీవితాల్లో, కేవలం బ్రతకాలనే ఆరాటం మాత్రమే వుంటుంది. జీవన సాగరంలోని ఆటుపోటు లనదగిన కీర్తి శిఖరాలను అందుకోవాలన్న ఆశగానీ, పరాజయం సిద్ధిస్తుందన్న నిరాశా, భయాలుగానీ మార్గదర్శకుల్ని దరిజేరవు. తమది అని చెప్పుకునేందుకు వారికేమీ వుండదు. కాని వారికి సంబంధించనిదంటూ ఏమీ లేదు. చరిత్ర వెలుగులోకి రాకుండానే చరిత్రను సృష్టిస్తారువారు. వారు పునాది రాళ్ళవంటివారు. బయటికి కనిపించకుండానే బ్రహ్మాండమైన నిర్మాణాన్ని తమ భుజస్కంధాలమీద నిర్మిస్తారు. ప్రపంచానికి అపూర్వమైన చరిత్ర సౌధాన్ని కానుకగా ప్రసాదిస్తారు. వారి జీవితాలు బాధామయ దర్పణాలు, త్యాగ చరిత నిలయాలు. మన జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్యగారు అట్టివారిలో ఒకరు. అక్షరాలా ఆయన మార్గదర్శి.

ఏ దేశంలోనైనా జాతీయ జెండా జాతీయ సమైక్యతకు చిహ్నం. జాతి లక్ష్యాలకు, ఆదర్శాలకు అది దర్పణం. దృష్టిమాత్రం చేతనే ప్రభావితం చేయగల బలమైన ఆకర్షణ దానికి వున్నది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పోరాట కాలంలో జాతీయజెండా దేశభక్తులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ యిస్తూవుంటుంది. విదేశీ పాలకుల జెండా ప్రజలకు ఎప్పటికప్పుడు తమ బానిసత్వాన్నీ, సిగ్గుపడవలసిన స్థితినీ జ్ఞప్తికితెస్తూ వుంటుంది.

తొలిసారిగా భారతదేశం వెలుపల జర్మనీలో సోషల్ డెమొక్రాట్ల సమావేశంలో భారత జాతీయ జెండాను ఎగురవేసిన ఘనత కామా అనే పార్శీ వనితకు దక్కినప్పటికీ ఆ జెండాకు నిర్మాణాత్మకమైన, అర్థవంతమైన ఒక సంపూర్ణ ఆకృతిని యిచ్చిన గౌరవం శ్రీ పింగళి వెంకయ్యగారిదే. ఈ యిద్దరికీ కూడా సరైన గుర్తింపు రానేలేదు. కామాసతి దేశబహిష్కరణ కారణంగా యూరపులో వుండవలసి వచ్చింది. 1933లో శారీరకంగా ఆమె ఆరోగ్యం బాగా క్షీణించి మానసికంగా కూడా దాదాపు పిచ్చెక్కినట్టిస్థితిలో వుండగా భారత దేశానికి తిరిగి రావడానికి బ్రిటిష్ పాలకులు అంగీకరించారు. అందువల్ల, ఎవరికీ ఆమెను గూర్చి తెలియకముందే ఆమె మరణించారు. కొంతకాలం క్రిందట ఆమె శతజయంతి జరిగిన సందర్భంలో ఆమె సంస్మరణగా తపాళ బిళ్ళను విడుదలచేసేవరకు ఆమెనుగూర్చి ఎవరికీ ఏమంతగా తెలియదు. పింగళి వెంకయ్యగారుకూడా దారిద్ర్యంతో బాధపడి గుర్తింపు లేకుండానే మరణించారు. వారి జీవితంనుండి వర్తమానతరం నేర్చుకోవలసినది ఎంతో వుంది.

పింగళి వెంకయ్యగారు కృష్ణా జిల్లాలోని భట్ల పెనుమర్రు గ్రామంలో 1878 ఆగస్టు 2వ తేదీన జన్మించారు. వీరి తండ్రి హనుమంతరాయుడుగారు గ్రామకరణంగా పనిచేసేవారు. పింగళి కుటుంబంవారు అనాదిగా యుద్ధ వీరులుగా ప్రసిద్ధికెక్కారు. ఈ యింటి పేరువారు నిజానికి మహారాష్ట్ర దేశానికిచెందినవారు. ఝాన్సీరాణీ లక్ష్మీబాయి తండ్రిగారైన పింగళి మారోపంత్ ఛత్రపతిశివాజీవద్ద సైన్యాధ్యక్షుడుగావుండేవాడు. పింగళి మాదన్న హైదరాబాదు నిజామువద్ద సర్వసైన్యాధిపతిగా వుండేవాడు. పింగళి వెంకయ్యగారు మచిలీపట్టణంలో ఉన్నత పాఠశాల విద్యను పూర్తిచేశాక 1897లో దక్షిణాఫ్రికాకు వెళ్ళి బోయిర్ యుద్ధంలో పాల్గొన్నారు. దక్షిణాఫ్రికాలో గాంధీజీ, పోలక్‌లను కలుసుకున్నారు. తిరిగి స్వదేశానికి వస్తూ వారు అరబ్, పర్షియా, ఆఫ్గనిస్తాన్ దేశాలను సందర్శించారు. భారత దేశంలో కొంతకాలంపాటు ప్లేగు ఇన్‌స్పెక్టరుగా పనిచేసి ఆ పిమ్మట సింహళంవెళ్ళి కొలంబో సిటీ కళాశాలనుంచి రాజకీయాలు, అర్థశాస్త్రం అభిమాన విషయాలుగా సీనియర్ కేంబ్రిడ్జి పరీక్షలో వుత్తీర్ణులయ్యారు. భారత దేశానికి తిరిగివచ్చి రైల్వే శాఖలో ఉద్యోగంలో చేరారు.

జపాను వెంకయ్య

అయితే డబ్బు సంపాదనలో వారికి ఆసక్తి లేదు. జ్ఞాన ధన సంపాదనకే వారి మనసు ఉవ్విళ్లూరుతుండేది. లాలా లజపతిరాయ్ సహచరుడు లాలా హన్స్‌రాజ్ లాహోరులో దయానంద ఆంగ్ల వైదిక్ కళాశాలను స్థాపించినట్లు తెలుసుకుని వెంకయ్యగారు అక్కడికి వెళ్ళి ఆ విద్యా సంస్థలో చేరారు. అప్పట్లోనే జపాను, రష్యామీద విజయం సాధించింది. ఈ సంఘటనను ఆసియా చరిత్రలోనే ఒక మలుపుగా డీన్ ఇంగే అభివర్ణించాడు. లాలా హన్స్‌రాజ్ తమ కళాశాలలో జపాను భాషను బోధించడానికి ప్రొఫెసర్ గోటేను జపాను నించి రప్పించాడు. వెంకయ్యగారు అక్కడ సంస్కృతం, ఉర్దూ, జపాను భాషలను నేర్చుకున్నారు. అప్పటినుంచీ ఆయన జపాను వెంకయ్యగారుగా ప్రసిద్ధికెక్కారు.

పింగళి వెంకయ్యగారిని జాతీయోద్యమం బాగా ఆకర్షించింది. 1906 లో కలకత్తాలో దాదాభాయ్ నౌరోజీ అధ్యక్షతన జరిగిన ఇరవై రెండవ అఖిల భారత జాతీయ కాంగ్రెసు సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ కలకత్తా సమావేశంలో తాను కేవలం వాలంటీరును మాత్రమేననీ, శ్రీ వెంకయ్య విషయ నిర్ణాయకసభలో గౌరవ సభ్యులనీ డా. రాజేంద్ర ప్రసాద్ ఒకసారి తెలియజేశారు. ఆ సమావేశానికి హాజరైన అనంతరం ప్రతి యేడాది కాంగ్రెసు సమావేశాలలో పాల్గొని ఆయుధాల చట్టాన్ని విమర్శిస్తూ మాట్లాడేవారు. రావల్‌పిండి, ఢిల్లీ, కాశీ, అలహాబాదులలో అయిదేళ్ళకు పైగా వుండి అక్కడి విప్లవ ఉద్యమ నాయకులతో సన్నిహిత పరిచయం ఏర్పరచుకున్నారు. భారత దేశాన్ని మిలిటరీ దేశంగా చూడాలని ఆయన ఆకాంక్షించేవారు. యువకులకు శరీరదారుఢ్యానికి సంబంధించిన శిక్షణ యిస్తుండేవారు. ఆ రోజుల్లో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులలో ప్రయోగాలు చేస్తున్న మునగాల రాజాగారితో సన్నిహితులుగా మెలిగేవారు. పుగాకు, చెరకు, పొడుగురకం కాంబోడియా ప్రత్తిని వాణిజ్య పరంగా పెద్దయెత్తున పండించడంలో వెంకయ్యగారు విజయం సాధించారు. వ్యవసాయంమీద ప్రామాణిక గ్రంథాన్నొకదానిని రచించారు. లండన్‌లోని రాయల్ అగ్రికల్చరల్ సొసైటీ సభ్యులయ్యారు.

మచిలీపట్టణంలోని ఆంధ్రజాతీయ కళాశాలలో ఆచార్య పీఠాన్ని అధిష్ఠించవలసిందిగా 1911 లో వారికి వచ్చిన ఆహ్వానాన్ని ఆయన మన్నించి 1919 వరకు అక్కడ పనిచేశారు. కాకతాళీయంగా భూగర్భశాస్త్రాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. భారత దేశంలో వజ్రాల గనుల త్రవ్వకం అన్న అంశంమీద చక్కటి ప్రజ్ఞను సంపాదించి ఆ విషయంలో పరిశోధనలు కొనసాగించారు.

వజ్రాల పరిశోధన

మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాలలో కూడా చదివి గనుల త్రవ్వకం, భూగర్భశాస్త్రాలలో డిప్లమో పుచ్చుకున్నారు. భారతప్రభుత్వం ప్రకటించే గనుల త్రవ్వకం పరిశీలనా నివేదికలలో తరచు వెంకయ్యగారి పరిశోధనలనుగూర్చి, అభిప్రాయాలనుగూర్చి పేర్కొంటూ, వాటితో ఏకీభావాన్ని ప్రకటించడం జరుగుతుండేది. భారత ప్రభుత్వం ప్రచురించే జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ రిసర్చ్' వీరి విజయాలను శ్లాఘించింది. వజ్రాలు ఎలా ఏర్పడతాయో దానికి సంబంధించి ఆయన వ్రాసిన గ్రంథం ఈ రంగంలో ఒకగొప్ప గ్రంథం. 1944 వరకు వీరు తమ పరిశోధనాకృషిని కొనసాగిస్తూనే వచ్చారు కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన భూగర్భ, ఖనిజ విషయాలశాఖ ఆచార్యుడు పాల్ ఎఫ్. కేర్, వెంకయ్య గారి కృషిని అమితంగా శ్లాఘించాడు.

వెంకయ్యగారు చక్కటి వక్త. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, జపాను భాషలలో చెయ్యితిరిగిన రచయిత. బహుముఖ ప్రతిభాశాలి ఆయన. హిందూ, లీడర్, ట్రిబ్యూన్, మోడర్న్ రివ్యూ వంటి ప్రసిద్ధ ఆంగ్లపత్రికలలో వీరి వ్యాసాలు తరచు ప్రచురితమవుతుండేవి. బాల్, పాల్, లాల్ అని పిలవబడిన బాలగంగాధరతిలక్, బిపిన్‌చంద్ర పాల్, లాలా లజపతిరాయ్‌గార్లకు ఆయన విశ్వాసనీయుడైన శిష్యుడు. డాక్టర్ అనీబెసెంటు ప్రారంభించిన హోంరూలు ఉద్యమంలో ముఖ్యమైన పాత్ర వహించారు. బిపిన్‌చంద్రపాల్ ఒకసారి వెంకయ్యగారినిగూర్చి చక్కటివక్తగా, రచయితగా పేర్కొంటూ యిలా అన్నారు—

“వెంకయ్య ఆవేశపూరిత పలుకులు నిజంగా లావాలాగే నిప్పులు కురిపిస్తాయి. ఆయన కంఠం, సరిగ్గా చెప్పాలంటే, శంఖారావమే. వారి రచనలు చరణకోల చురకలు. ఆయన చిత్తశుద్ధి అమోఘము. నిజాయితీ అగణితము. అందుకే ఏ శత్రువును ఉద్దేశించైనా ఆయన ఏమైనా అంటే ఆ వ్యక్తికి నిజంగా తల తిరిగినంత పనౌతుంది”

1912లో రచించిన 'సన్‌యట్ సేన్ జీవితం' అను వీరి ఆంగ్ల గ్రంథం ప్రపంచ మేధావులనేకుల్ని ఆకర్షించింది. 'ఆసియా నాయకునికి భారతదేశంనుంచి వచ్చిన తొలి అభినందన' గా లండన్ నుంచి వెలువడే 'ది టైమ్స్' యీ పుస్తకాన్ని ప్రస్తుతించింది.

ముందుచూపు

అందులో దలైలామా భారతదేశానికి పారిపోయివచ్చి ఆశ్రయం కోరడం, చైనా భారతదేశంమీద దురాక్రమణకు పూనుకోవడం జరగవచ్చునన్న భవిష్యత్తును గురించి వూహించిన విషయాలు వున్నాయి. దీనిని బట్టి ఆయన, ముందుచూపు భవిష్యత్ సంఘటనలను పసిగట్టగల సూక్ష్మదృష్టి, నిశిత పరిశీలన గల వారని అర్థమౌతుంది. ఆ పుస్తకాన్ని ఆయన ఇంగ్లాండులోని స్వేచ్ఛాప్రియులైన ప్రజలకు అంకితం చేయడం ఎంతైనా సమంజసమైనది. సన్‌యట్ సేన్ లండన్‌లోని ఒక వీధిలోంచి వెళ్ళుతుండగా ఆ రోజుల్లో చైనాను పాలిస్తున్న మంచూ వంశ ప్రభువుల ఏజంటులు ఆయనను ఎత్తుకొనిపోతే, వారి బారి నుండి సన్‌యట్ సేన్ ప్రాణాలను ఇంగ్లాండులోని స్వేచ్ఛాప్రియులైన ప్రజలు రక్షించారు. వారి స్వేచ్ఛాప్రియత్వానికి హర్షంతో వెంకయ్యగారు తను వ్రాసిన ఆ గ్రంథాన్ని ఆ ప్రజలకు అంకితం చేశారు.

1916 లో వెంకయ్యగారు భారత జాతీయ జెండా సంఘాన్నొకదానిని ప్రారంభించారు. శ్రీ ఉమర్ శోభానీ శ్రీ ఎస్. ఆర్. బొమ్మన్‌జీ వంటి దేశభక్తుల సహకారంతో దానికి భారతదేశమంతటా శాఖలను ఏర్పరిచారు. భారత దేశానికి కావలసిన ఒక జాతీయ జెండా అన్న విషయంమీద వెంకయ్యగారు ఒక గ్రంథాన్ని రచించారు. దీనికి వైస్రాయ్ కార్యనిర్వాహకమండలి సభ్యుడైన సర్ బి. ఎన్. శర్మ ముందుమాట వ్రాశారు. ఈ పుస్తక ప్రచురణకయ్యే ఖర్చు యావత్తు డా॥ సి. పి. రామస్వామి అయ్యర్ భరించారు.

రాట్నంవున్న ఒక జాతియ జెండాను రూపొందించవలసిందిగా 1921 లో గాంధీజీ వెంకయ్యగారిని విజయవాడలో కోరగా ఆయన దానిని మూడుగంటలలోగా రూపొందించారు. గాంధీజీకికూడా అది బాగా నచ్చింది. ఆ విషయాన్ని బహిరంగంగా నే గాంధీజీ ప్రకటించి వెంకయ్యగారిని అభినందించారు.

విప్లవ వాది

గాంధీజీ ప్రారంభించిన అహింసాయుత సత్యాగ్రహ ఉద్యమంలో వెంకయ్యగారికి నమ్మకంలేక 1922 లో ఆయన రాజకీయాలనుంచి నిష్క్రమించారు. ఆయన వెనకటి విప్లవ వాదుల ధోరణిలోనివారు. అభిప్రాయ భేదాలున్నప్పటికీ ఆయన సర్ ఎం. రామచంద్రరావు, సర్ బ్రజేంద్రనాథసీల్, సర్ అసుతోష్ ముఖర్జీ, సర్ పి. సి. రాయ్, డా జె. సి. బోసు, సర్ జాదూనాథ్ శంకర్, డా. రవీంద్రనాథ్ ఠాకూర్, సర్ అలీ ఇమామ్, ఇంకా తదితరులనేకులతో స్నేహసంబంధాలను పరిపాలించుకుంటూనే వుండేవారు. ఆయన నిష్కల్మషమైన జీవితాన్ని గడిపినవ్యక్తి. మతంమీద విశ్వాసంమెండు. గట్టి పట్టుదల, అచంచలమైన విశ్వాసము ఆయన సొమ్ము. ఆయన ఆఖరిసారి బహిరంగ వేదికమీద కనిపించడం 1953 లో డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ అధ్యక్షతన ఆంధ్ర జాతీయ కళాశాల స్వర్ణోత్సవాలు జరిగినప్పుడు. ఆయన మరికొన్ని నెలలకు స్వర్గస్థులవుతారనగా ఆయన అభిమానులు కొందరు రూ. 5000లు సేకరించి బహూకరించి చరమదశలో ఒకరకమైన ఊరటనూ, మనశ్శాంతినీ కల్గించినవారయ్యారు. 1963 జూలై 4వ తేదిన తమ 86వ యేట పింగళి వెంకయ్యగారు స్వర్గస్థులయ్యారు.


పింగళి వెంకయ్యగారు తమ జీవిత సంగ్రామంలో చాలా ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారు. తమ జీవితలక్ష్యాన్ని సమర్థవంతగా పరిపూర్తిచేశారు. ఆయన నిజంగా ధన్యజీవి. ★


మన రథ సారథులు

[5 వ పుట నుండి]

1967 నవంబరునాటికి శ్రీ బ్రహ్మానందరెడ్డి అమాత్య పదవులలో పదకొండేళ్ళ అనుభవాన్ని గడించుకున్నారు. ఆరేళ్ళకు పైగా రాష్ట్రానికి సమర్థులైన ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ముందు చూపుతో దక్షతతో వీరు రూపొందించిన చాలా బడ్జెటులు మిగులు బడ్జెటులే. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వీరు రాష్ట్ర సర్వతో ముఖాభి వృద్ధిని సాధించారు.

వారి మాటల్లోనే వారినిగూర్చి చెప్పాలంటే "ఎవరినీ నొప్పించడం నాలక్ష్యంకాదు. ఇతరుల దృక్పథాన్నీ, ధోరణినీ అవగాహన చేసుకోవాలనే నేను ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను సమస్యలను పరిష్కరించే విషయంలో రాజీమార్గాన్ని అవలంబించడంలో నాకు నమ్మకం ఎక్కువ. రాజకీయంగా వుండే అభిప్రాయ భేదాలవల్ల వ్యక్తిగత స్నేహాలు నాశనం కాగూడదని నా నమ్మకం. మితంగా సంభాషించడం, నెరవేర్చవలసిన పని విషయంలో గట్టిగా పట్టుదల చూపించడం నాబాధ్యతల నిర్వహణలో నేను అవలంబించే విధానాలు."





గుంటూరులో డిసెంబరు 8వ తేదీన జరిగిన అనావృష్టి పరిస్థితుల నివారణ సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

ఆత్యయిక పరిస్థితి రద్దు

1968 జనవరి 10వ తేదీనుంచి ఆత్యయిక పరిస్థితిని రద్దు పరుస్తున్నట్లు న్యూఢిల్లీలో డిసెంబరు 31వ తేదీన అధికారికంగా ప్రకటించారు.

భారత రాజ్యాంగం 352వ సూత్రంలోని (1)వ క్లాజు క్రింద, రాష్ట్రపతి 1962 అక్టోబరు 26వ తేదీన ఆత్యయిక పరిస్థితిని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ నిర్ణయాన్ని గురించి తెలియజేస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకోవలసిందిగా వాటిని కోరడం జరిగింది.

ఆత్యయిక పరిస్థితిని రద్దు పరచడంవల్ల పౌరులకు ప్రాథమిక హక్కులు తిరిగి పూర్తిగా సంక్రమిస్తాయి. 1962 అక్టోబరు 26వ తేదీన ఆత్యయిక పరిస్థితిని ప్రకటించిన వెంటనే జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వు క్రింద రాజ్యాంగంలోని 14, 21వ సూత్రాల వర్తింపును నిలిపివేయడం జరిగింది. శాసనరీత్యా పౌరులందరికీ సమాన ప్రతిపత్తి, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ, నిర్బంధం, డిటెన్షను జరుగకుండా రక్షణ — వీటికి సంబంధించిన హక్కులు జనవరి 10వ తేదీనుంచి పూర్తిగా పునరుద్ధరించబడతాయి.

ఆత్యయిక పరిస్థితి జనవరి 10వ తేదీనుంచి అంతమవుతున్నప్పటికీ భారత రక్షణ చట్టమూ, ఈ చట్టంక్రింద రూపొందించిన నియమ నిబంధనలూ ఆ తేదీనుంచి మరో ఆరు నెలలపాటు అమలులో వుంటాయి. వాటిని ఈ విధంగా కొనసాగించడానికి భారత రక్షణ చట్టంలోనే అవకాశం కల్పించారు.

అనావృష్టి ప్రాంతాలకు సహాయం

రాష్ట్రంలో అనావృష్టికి గురి అయిన ప్రాంతాలలో పల్లం లేక మెట్ట పైర్లకు, దిగుబడి రూపాయిలో నాలుగు అణాలవంతు లేక అంతకు తక్కువ స్థాయిలోవున్న సందర్భాలలో పూర్తి రెమిషను మంజూరు చేయడానికీ దిగుబడి నాలుగు అణాలు—ఆరు అణాల మధ్యవున్న సందర్భాలలో సగం రెమిషను యివ్వడానికీ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం డిసెంబరు 13వ తేదీన నిశ్చయించింది.

అనావృష్టికి గురి అయిన ప్రాంతాలలో భూమి శిస్తు, సెస్సుల బకాయిల వసూళ్ళను వాయిదా వేస్తారు.

ఈ రెమిషనవల్ల రైతులకు రెండుకోట్ల రూపాయలమేరకు సహాయం చేకూరుతుంది. చాలా ఉదారంగా రెమిషన్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది. సాధారణంగా మెట్ట పైర్లకు రెమిషను యివ్వరు.

అనావృష్టికి గురి అయిన ప్రాంతాలు ఇవి :—శ్రీకాకుళం, విశాఖపట్నంజిల్లాలు, తూర్పు గోదావరి జిల్లాలోని మెట్టప్రాంతపు తాలూకాలు, కృష్ణాజిల్లాలోని నూజివీడు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, చింతలపూడి, తాడేపల్లిగూడెం, గుంటూరుజిల్లాలోని నర్సారావుపేట వినుకొండ, పల్నాడు, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు జిల్లాలోని కనిగిరి, పొదిలి, దర్శి, కర్నూలు జిల్లాలోని మార్కాపురం, యెర్రగొండపాలెం అనంతపురం జిల్లాలోని మడకశిర, రాయదుర్గం, హిందుపూర్, ధర్మవరం ; చిత్తూరు, నల్గొండ జిల్లాలలోని కొన్ని భాగాలు.

బావులు త్రవ్వకోవడానికై రూ 2 కోట్ల మేరకు భూమి తనఖా బ్యాంకులద్వారా ఋణాలు లభింపజేయడానికి తలపెట్టారు. ఈ బ్యాంకులద్వారా యిదివరకే తక్కావీ అప్పులు యిచ్చారు. మంత్రివర్గం రూపొందించిన యితర సహాయకచర్యలు ఇవి :— బావుల త్రవ్వకానికిగాను పంచాయతీరాజ్ శాఖ బడ్జెటులో కేటాయించిన రూ. 15 లక్షల మొత్తాన్ని జిల్లాకలెక్టర్లు ఎన్నికచేసే పనుల కొరకు విడుదలచేస్తారు. చక్కెరఫ్యాక్టరీలున్న ప్రాంతా

లలో ఆయా పనులకొరకు చెరకుగడ సెస్సుఫండు నుంచి రూ. 8 లక్షలు ఇస్తారు.

రూ. 33 లక్షల మొత్తాన్ని రెవెన్యూబోర్డుకు లభింపజేస్తారు. రెవెన్యూబోర్డు సభ్యులు, సహాయక కార్యక్రమాలను ప్రారంభించే నిమిత్తం, వివిధప్రాంతాలలో అమలుజరుగుతున్న పనులను సమీక్షిస్తారు. సాధారణపనులను వేగంగా నిర్వహించడానికి తల పెట్టారు. చిన్నతరహా నీటివనరుల కొరకు పబ్లిక్‌వర్క్సుశాఖకు కేటాయించిన రు. 80 లక్షలు, పంచాయతీరాజ్‌శాఖకు ప్రత్యేకించిన రూ. 25 లక్షల మొత్తాలను వినియోగార్థం విడుదల చేస్తారు. ఆర్థికపరిస్థితిదృష్ట్యా పీటి విడుదలపైన నిర్బంధాలు వున్నాయి. అత్యవసరపరిస్థితులలో పనులను చేపట్టడానికి అనుమతి యిస్తాయి.

పొదుపుచర్యలు

పొదుపుచర్యగా సచివాలయం పునర్వ్యవస్థీకరణలో భాగంగా యిద్దరు కార్యదర్శులు, పన్నెండుగురు సంయుక్త కార్యదర్శులు, ఉపకార్యదర్శుల పదవులను రద్దుపరిచారు.

జిల్లా నూతన పరిపాలనావ్యవస్థలో, కలెక్టర్లకు రెవెన్యూ, సివిల్‌సప్లయిల బాధ్యతలను తప్పించడానికై ఐ. ఏ. ఎస్. సీనియర్ టైమ్‌స్కేలుహోదాలో జిల్లా రెవెన్యూఅధికార్లను నియమించడం అవసరమైంది. అదనపు ఖర్చులేకుండా దీనిని నెరవేర్చడం జరిగింది.

జిల్లాబోర్డు సభ్యుల నూతన బాధ్యతలు

రాష్ట్ర అభివృద్ధిమండలి ప్రాంతీయసంఘం సమావేశం డిసెంబరు 16వ తేదీన గుంటూరులో జరిగింది. జిల్లాలలో ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలుపరచడానికై రైతులు, లఘుపరిశ్రమల యజమానుల సహకారాన్ని పొందడానికి మార్గాలను గురించి ఈ సమావేశంలో చర్చించారు. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. టి. రాజు అధ్యక్షతవహించారు.

ఈ సమావేశంలో రూపొందించిన కార్యక్రమం ప్రకారం జిల్లా అభివృద్ధి మండలికిచెందిన యిద్దరు సభ్యులు – జిల్లాపరిషత్తు అధ్యక్షుడు, కలెక్టరు – మూడునెలలకు ఒకపర్యాయము ప్రతి పంచాయతీసమితి సర్వసభ్య సమావేశానికి హాజరవుతారు.

వీరుభయులు సమితిని సందర్శించడానికి పూర్వం, వ్యవసాయశాఖ డిప్యూటీడైరెక్టరు, సహకారసంఘాల డిప్యూటీ రిజిస్ట్రారుతో సహా ఒక అధికార్ల బృందం ఆ సమితికివెళ్ళి యిదివరకే చేపటిన పథకాలను అమలుపరచడానికి సిరమైన ప్రతిపాదనలను గురించి చర్చలు జరుపుతారు. కొత్తపథకాలను సిఫారసుచేస్తారు. అభివృద్ధి మండలిసభ్యులు సర్‌పంచ్‌లతో చర్చలు జరుపుతారు.

భూమి తనఖా బ్యాంకులద్వారా రైతులకు యిస్తున్న దీర్ఘకాలిక ఋణాలపరిస్థితిని ఈ సమావేశంలో సమీక్షించారు. ఆంధ్ర ప్రాంతంలో స్వల్పకాలిక ఋణాలనిమిత్తం కేటాయింపును రూ. 18 కోట్లనుంచి రూ. 30 కోట్లకు పెంచుతారు. ఋణాలపంపిణీ విధానాన్నీ, తనఖాపెట్టే భూములకు విలువకట్టే పద్ధతినీ మార్చు చేయడాన్ని గురించి కూడా ఈ సమావేశంలో చర్చించారు.

రెవెన్యూబోర్డు సభ్యులు యిద్దరు, ప్రణాళిక, వ్యవసాయం, పరిశ్రమలు, పబ్లిక్‌వర్క్సుశాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, 11 జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

నీటిపారుదల పథకాలు

అనావృష్టికి గురి అయిన ప్రాంతాలలో ప్రస్తుతం సాగుతున్న ప్రాజెక్టుపనులను త్వరితంగా అమలుపరచడానికీ, చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టులను కొత్తవాటిని ప్రారంభించడానికిగాను అదనంగా నిధులు కేటాయించడానికీ ప్రభుత్వం నిశ్చయించింది. అనావృష్టి ప్రాంతాలలోని ప్రజలకు ఉపాధులు కల్పించడానికీ, నీటిపారుదల వనరులను పెంపొందించడానికీ ఈ పథకాలు ఉద్దేశించబడినవి.

దుబారా చెయ్యకండి

సరుకు నిలువచేయడంలో చెడు పద్ధతులవలంబించి రైతులు, వర్తకులు, గృహిణులు దుబారా చెయ్యడం ఎందు మనుషుల శరీర పోషణకు అవసరమయ్యే అమూల్యమైన ఆహార పదార్థాలను వృథా చేయడంగానీ, ఎలుకలు పందికొక్కుల పాలుచేయడం గానీ న్యాయంకాదు. జాతి క్షేమం దృష్ట్యా ప్రజలందరూ అనుసరించవలసిన కనీస ధర్మం యిది.

శాసనపర్వం

తెలంగాణాలో ఇనాముల రద్దు

1967వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) ఇనాముల రద్దు చట్టానికి, 1967 సెప్టెంబరు 19వ తేదీన రాష్ట్రపతి ఆమోదం లభించింది. తెలంగాణా ప్రాంతంలో ఇనాములను రద్దు పరచడాన్ని ఈ చట్టం ఉద్దేశిస్తున్నది:

"నియమిత తేదీ" నుంచి యినాములను రద్దుపరిచి యినాము భూములను రైత్వారీ భూములుగా మార్చడానికీ, రైత్వారీ భూములకు వర్తించే శాసనాలనే రద్దుపరచినట్టి యినాము భూములకు కూడా వర్తింపజేయడానికీ, యినామును కలిగివున్న వ్యక్తి, లేక సంస్థకు రైత్వారీ పట్టాదారుకువుండే హక్కులను సంక్రమింపజేయడానికీ ఈ చట్టం మూడవ సెక్షను నిర్దేశిస్తున్నది.

"నియమిత తేదీ నుండి" అంటే ఎప్పటి నుంచో ఈ చట్టం సెక్షను 2 (ఏ)లో నిర్వచించబడింది. సెక్షను 4 మేరకు విచారణ జరిపి ఇనాములను నిర్ధారించే అధికారం తహశీల్దారుకు వుంటుంది. తహశీల్దారు యిచ్చే తీర్పుకు వ్యతిరేకంగా అట్టి తీర్పు వెలువడిన తేదీనుంచి అరవై రోజుల లోపుగా జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోవచ్చు. అప్పీలు చేసుకొనబడని సందర్భంలో తహశీల్దారు యిచ్చే తీర్పు, అలాగే జిల్లాకోర్టు యిచ్చే తీర్పు అంతిమమైనది. తత్సంబంధీకులందరూ దానికి బద్ధులు కావల్సి వుంటుంది.

సంస్థ యాజమాన్యం క్రిందగల కౌలుకు యిచ్చిన భూములకు సరసమైన అద్దెను నిర్ణయించే నిమిత్తం, ఈ చట్టం క్రింద, ప్రభుత్వం నిర్ణీత వ్యక్తులతో ఒక కమిటీని నియమిస్తుంది. కౌలు నియమనిబంధనలను కూడా ఈ కమిటీయే స్థిరీకరించవచ్చు.

ఎవరైనా వ్యక్తి సర్వీసు చేయడంలో విఫలుడైన పక్షంలో అట్టి వ్యక్తిని వైదొలగించడానికిగాను 7వ సెక్షను క్రింద తహశీల్దారుకు దరఖాస్తు దాఖలు చేయవచ్చు. తహశీల్దారు యిచ్చే తీర్పుకు వ్యతిరేకంగా అట్టి తీర్పు వెలువడిన అరవై రోజుల లోపుగా "రెవెన్యూ కోర్టు"కు అప్పీలు చేసుకోవచ్చు. "రెవెన్యూ కోర్టు" అంటే ఆ ప్రాంతానికి సంబంధించిన రెవెన్యూ డివిజినల్ ఆఫీసరు కోర్టు అన్నమాట. సందర్భాన్నిబట్టి తహశీల్దారు లేక రెవెన్యూ కోర్టు యిచ్చే తీర్పు అంతిమమైనది.

ఎనిమిదవ సెక్షను క్రింద, ఈ చట్టం ప్రకారం రైత్వారీ పట్టాపొందిన ప్రతి యినాముదారు లేక సంస్థ రైత్వారీ పట్టా మంజూరైన తేదీనుంచి "జోడీ"కి బదులుగా ప్రభుత్వానికి భూమి శిస్తు చెల్లించవలసి వుంటుంది.

వ్యక్తులకు సమన్లు జారీచేయడం, ప్రమాణం చేయించడం, సాక్ష్యం తీసుకోవడం, పత్రాలను చూపగోరడం మొదలైన విషయాలలో సివిల్ ప్రొసీజర్ కోడ్ (1908) క్రింద కేసు విచారిస్తున్న సివిల్ కోర్టుకు వుండే అధికారాలే ఈ చట్టంక్రింద తహశీల్దారుకు, రెవెన్యూ కోర్టుకు కూడ వుంటాయి. ఈ చట్టంక్రింద గైకొన్న చర్యలను 12వ సెక్షను పరిరక్షిస్తుంది.

ఈ చట్టం మొత్తంమీద వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన మార్పులను ప్రవేశపెట్టి వ్యవసాయ సంస్కరణలకు ఆస్కారం కలుగజేసుందనవచ్చు. సంస్కరణలతో కూడిన యిటువంటి శాసనం రూపొందించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించవలసి వుంది.

—పి. శేషాద్రి

బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

1967వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) కౌలుదారు, వ్యవసాయ భూముల (సవరణ) బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది.

తెలంగాణా ప్రాంతంలో, వ్యవసాయ భూముల బదిలీని క్రమబద్ధం చేయడానికీ, సర్టిఫికెట్లను పొందడానికీ మొదటి చట్టంలో నిర్దుష్టపరచిన గడువును ఒక సంవత్సరంపాటు పొడిగించడాన్ని ఈ బిల్లు నిర్దేశిస్తున్నది. 1950 జూన్ 10వ తేదీ 1961 ఫిబ్రవరి 21వ తేదీలమధ్య జరిగిన మార్పిడీల విషయంలో, 1961 ఫిబ్రవరి 21వ తేదీలోగా అట్టి మార్పు పొందిన వ్యక్తులు క్రమబద్ధపు పత్రాలకొరకు 1964 ఏప్రిల్ 23వ తేదీనుంచి మూడు సంవత్సరాలలోపుగా తహశీల్దారుకు దరఖాస్తు పెట్టుకోవచ్చునని 1950వ సంవత్సరపు మొదటి చట్టం నిర్దేశిస్తున్నది. ఈ కాలపరిమితిని ఒక సంవత్సరంపాటు పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేయబడినాయి. తొలుత యిచ్చిన గడువు యిదివరకే ముగిసింది కాబట్టి ఈ శాసనాన్ని 1967 ఏప్రిల్ మొదటి తేదీ నుంచే వర్తింపజేసే కాలపరిమితిని 1968 మార్చి 31వ తేదీ వరకు పొడిగించారు.

★

ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి

—డా. మారేమండ రామారావు

ఆంధ్రులకు అపారమైన చరిత్ర వున్నది. భారతీయ సంస్కృతీ, చరిత్రలు సరియైన రూపురేఖలు సంతరించుకోవడంలో ఆంధ్రులు ప్రముఖపాత్ర వహించారు. వీరిపేరే వీరు నివసించే ప్రాంతానికీ, మాట్లాడే భాషకు పెట్టుకున్నారు. భౌగోళికంగా ఈ ప్రాంతం అత్యంత ప్రధానమైనది. భాషా విషయకంగా వీరు మాట్లాడే భాష అతి ప్రధానమైనది. వీరిలో అధిక సంఖ్యాకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తున్నారు. అనేకమంది దేశంలోని వివిధ ప్రాంతాలలో విస్తరించి వున్నారు. మరికొంతమంది దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కన్నడ రాష్ట్రాలకు వలస వెళ్ళిపోయారు

ఆంధ్రదేశానికి భారతదేశంలో ఒక ప్రత్యేక విశిష్టతవుంది. అటు ఆర్యులు పాలించిన ఉత్తర దేశానికీ, యిటు ద్రావిడులు ఏలిన దక్షిణ దేశానికీ మధ్యస్తంగా దక్కను భూభాగానికి తూర్పువైపు సగభాగం ఆక్రమించివుంది. ఆర్య, ద్రావిడ సంస్కృతులను రెంటినీ తనలో లీనంచేసుకో గలిగే విధంగా వున్నదేశం ఆంధ్రదేశం. చారిత్రిక కారణాలవల్ల ఈ ఆంధ్రదేశం సర్కారులు, తెలంగాణా, రాయలసీమ అని మూడు ప్రాంతాలుగా విభజింపబడింది. అప్పుడప్పుడు కొంతకాలంపాటు ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకు తీసుకొని రాబడినా ఎక్కువగా ఈ మూడు ప్రాంతాలూ విడివిడిగా ఏలుబడుల క్రింద వుంటూ అభివృద్ధి చెందుతూ వచ్చాయి.

మొట్ట మొదటిసారిగా ఆంధ్రులను గురించి ఐతరేయ బ్రాహ్మణములో ప్రస్తావించబడింది. ఆ తర్వాత రామాయణం, మహాభారతము, పురాణాలలో ప్రస్తావించబడింది. చారిత్రికంగా ఆంధ్రులను గూర్చిన తొలి ప్రస్తావన మనకు మెగస్తనీసు వ్రాసిన 'ఇండికా' అనే గ్రంథంలోనూ, మౌర్య సామ్రాజ్యాధినేత అశోకుని శాసనాలలోనూ కనిపిస్తాయి.

ఆంధ్రుల అసలు చరిత్ర అశోకుని మరణానంతరం ఆరంభమైందని చెప్పవచ్చు. అశోకుని అనంతరం శాతవాహనుడు స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనుడు, ఆంధ్రులు అనబడే ఒకతెగకు నాయకుడు. వీరే ఆంధ్రులుగా చరిత్రలో ప్రసిద్ధికెక్కారు.

శాతవాహన వంశీయులు నాలుగు శతాబ్దాలపాటు పరిపాలన సాగించారు. వీరిసామ్రాజ్య మొత్తం దక్కను భూభాగాన్నంతటినీ విస్తరించి, ఒక్కొక్కప్పుడు అటు ఉత్తర హిమాదేశాన్నీ, ఇటు తమిళనాడును తాకుతూ సువిశాల సామ్రాజ్యంగా భాసిల్లుతూ వచ్చింది. శాతవాహన ప్రభువులు అనేకసార్లు విదేశీ దండయాత్రలను త్రిప్పికొట్టి దేశానికి శాంతి సౌభాగ్యాలను ప్రసాదించారు. కళ, సాహిత్యము, మతము మూడు పూలు ఆరు కాయలుగా వికసించి విస్తరిల్లడానికి వీరు యితోధికంగా తోడ్పడ్డారు.

మూడవ శతాబ్దం ఆరంభంలో శాతవాహనసామ్రాజ్యం పతనం కావడంతో ఆంధ్రులు విడదీయబడ్డారు. తెలంగాణా ప్రాంతం మొదట వాకాటకుల ఆధీనంలోకీ, ఆ తర్వాత బాదామి ప్రభువులయిన మొదటిచాళుక్యుల పాలనక్రిందకూ వెళ్ళిపోయింది. కోస్తాప్రాంతాన్ని ఇక్ష్వాకులు, అనంతరం సాలంకాయనులు, తదనంతరం విష్ణుకుండినులు పరిపాలించారు. మిగిలిన నైరుతి, ఆగ్నేయ ఆంధ్రప్రాంతాలు పల్లవుల ఆధిపత్యంలోకి వచ్చాయి. గోదావరి ప్రాంతాన్ని పదిహేనవ శతాబ్దం వరకూ అనేక చిన్నచిన్న రాజవంశాలు పరిపాలిస్తూవచ్చాయి. పదిహేనవ శతాబంలో తూర్పు గంగులు దీనిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఏడవ శతాబ్దారంభంలో తూర్పుచాళుక్యులు తూర్పుతీరంలో ఒక స్వతంత్రసామ్రాజ్యాన్ని స్థాపించి గోదావరికి దక్షిణానవున్న ప్రాంతాన్నంతటినీ నాలుగు శతాబ్దాలపాటు పరిపాలించారు. రాష్ట్రకూటులు, కడపటి చాళుక్యులు తెలంగాణాను వశపరచుకున్నారు. రాయలసీమను తెలుగుచోళులు, చోళులు, బాణులు, వైదంబులు, దక్షిణాది చోళ చక్రవర్తులు పరిపాలించారు.

కాకతీయ సామ్రాజ్యం

పదకొండవశతాబ్దం ప్రారంభంలో ఆంధ్రదేశం రాజకీయంగా చాలా గజిబిజిగావుండేది. అయితే యీ అరాచక పరిస్థితిలోంచే ఒక గొప్ప సామ్రాజ్యంతలెత్తింది. అదే_కాకతీయసామ్రాజ్యం. ఆంధ్రదేశాన్ని పరిపాలించిన గొప్ప సామ్రాజ్యాలలో ఇది ద్వితీయ స్థానం ఆక్రమిస్తుంది. ఆదిలో కడపటి చాళుక్యులకు సామంతులుగావున్న ఈ కాకతీయులు తెలంగాణాను జయించారు. కాకతీయ సామ్రాజ్యాధీశుడైన గణపతిదేవుడు కోస్తాప్రాంతాన్ని, రాయలసీమను తన ఆధిపత్యంలోకి తెచ్చి సువిశాల సామ్రాజ్యాన్ని

నెలకొల్పి ఆంధ్రులందరినీ ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకు తీసుకొని వచ్చాడు. గణపతిదేవుని కుమార్తె రుద్రాంబ, ఆ తర్వాత మనుమడు ప్రతాపరుద్రదేవుడు ఈ సామ్రాజ్యసింహాసనాన్ని అధిరోహించి పరిపాలన కొనసాగించారు. ప్రతాపరుద్రదేవుని కాలంలోనే ఢిల్లీ సుల్తానుల దండయాత్రలు పెక్కింటిని ఎదుర్కొనవలసివచ్చింది. క్రీ. శ. 1323లో ప్రతాపరుద్రదేవుడు యుద్ధంలో ఓడిపోయి ఖైదీగా పట్టుబడినాడు. ఆయన, ముసల్మానుల దురాక్రమణాలకు హిందువజాతి ప్రతిఘటనలో ప్రముఖుడనిపించుకున్నాడు. కాకతీయుల కాలంలో శిల్పచిత్రకళలు, సాహిత్యం బాగా విస్తరిల్లి సుసంపన్నమై, సుందరమై భాసిల్లాయి. ఆంధ్రదేశం యావత్తూ ఐక్యత, ఘనతలతో సంపదలతో తులతూగింది.

మహమ్మద్ బిన్ తుగ్లక్ దండయాత్రవల్ల కాకతీయ సామ్రాజ్యం పతనం కావడంతో రాజకీయ విచ్ఛిన్నత సంభవించింది. తుగ్లక్ ఆంధ్ర దేశాన్ని జయించి మూర్ఖుడైన నెల్లూరు నించి, వడమట క్విలాన్ వరకు అధికారం విస్తరింపజేసి దానికి ముసల్మాను అధిపతులను నియమించాడు. ఆంధ్రులు వెంటనే రానున్న ఆపదనుగుర్తించి ప్రజా విప్లవాన్ని లేవదీశారు. ప్రతి చోట నాయకులు తల లెత్తారు. ప్రజలను నడిపించారు. ముసల్మానుల ఆధిపత్యంలో నుంచి ఆంధ్రదేశానికి-సర్కారులు, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలకు స్వేచ్ఛ నిచ్చారు. కొండవీటి రెడ్డి రాజ్యము, రాజకొండ వెలమ రాజ్యము, విజయనగర రాజ్యంవంటి అనేక కొత్త రాజ్యాలు నెలకొల్పబడ్డాయి. 1347లో దక్కనుకు పడమటి ప్రాంతంలో బాహమనీ సామ్రాజ్యం పేరుతో ఒక స్వతంత్ర ముసల్మాను రాజ్యం అవతరించి వీటి మధ్య నిలదొక్కుకునే ప్రయత్నాలు చేసింది.

శాంతి, సౌభాగ్యాలు

పదహారవ శతాబ్దం మొదట్లో బాహమనీ రాజ్యంలోంచి అయిదు కొత్త ముసల్మాను రాజ్యాలు అవతరించాయి. కుతుబ్ షాహి సామ్రాజ్యం వాటిలో ఒకటి. ఇది 1510లో గోలకొండ రాజధానిగా చేసుకుని తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించింది. ఆంధ్ర దేశంలో మిగతా భాగాన్ని చాలావరకు తన అధీనంలోకి తీసుకొని రావడంలో ఈ కుతుబ్‌షాహి విజయవంతమయ్యాడు. ఆ ప్రజలలో శాంతి, సౌభాగ్యాల్ని నెలకొల్పాడు. వీరి పరిపాలనలోనే పరాసు, డచ్చి, ఆంగ్లేయ వర్తకులు తూర్పు తీరంలో అనేక ప్రాంతాలతో వర్తక వ్యాపారాల్ని నెలకొల్పుకున్నారు. గోలకొండను ఔరంగజేబు జయించడంతో ఆంధ్రదేశంకూడా మొగలు సామ్రాజ్యం క్రిందకు వచ్చింది.

మొగలు సామ్రాజ్యానికి దక్కనులో నిజాముల్ ముల్కులు సుబేదారులుగా నియమింపబడారు. వీరినే నిజాములు అని కూడా అంటారు. నిజానికి 1723 నుంచి ఆంధ్రదేశాన్ని ఏలిన పరిపాలకులు వీరే. అయితే మూడు శతాబ్దాలుకూడా కాకుండానే అనేక సంఘటనలవల్ల నిజాము, సర్కారు ప్రాంతాల్ని పరాసు వారికి హస్తగతం చేయవలసి వచ్చింది. అయిదేళ్ళు కూడా తిరక్కుండానే ఈ సర్కారుల్ని ఇంగ్లీషువారు బలప్రయోగంతో ఆక్రమించుకున్నారు. పంథొమ్మిదవ శతాబ్దారంభంలో రాయలసీమ ప్రాంతాన్ని ఒకానొక సంధి ప్రకారం నిజాము ఆంగ్లేయులకు ధారాదత్తం చేయవలసి వచ్చింది. ఆంధ్ర దేశంలో అధికభాగం ఆంగ్లేయుల ఆధిపత్యంలోకి రాగా తెలంగాణా మాత్రం ఇటీవల కొంతకాలం క్రితం వరకూ నిజాముల పరిపాలనలోనే వుంటూ వచ్చింది.

ఆంధ్ర ప్రజలు అనేక మతాలను ఉదారంగా ఆదరించి పరిపోషించారు. వైదిక మతం బాగా ప్రాముఖ్యంలో వుండేది. అనేక మంది రాజులు అశ్వమేధ, వాజపేయాది యాగాలను చేస్తుండేవారు. ఆంధ్ర దేశంలో భాగవత సాంప్రదాయాలు బాగా నాటుకొని పోయాయి. తొలి రాజవంశాల వాలామంది రాజులు ఎంతో బాగ నయులుగా, ... వైదిక ధర్మాన్ని పరిరక్షించడంలోనూ, వేద పండితులను ఆదరించడంలోనూ ఒకరికొకరు సమఉజ్జీలనిపించుకున్నారు. నాగార్జునకొండ లోయను విజయపురి రాజధానిగా చేసుకుని మూడవ శతాబ్దం ప్రారంభంలో ఏలిన ఇక్ష్వాకులు హిందూమత పునరుద్ధరణకు కృషి చేశారు. వీరి అనంతర రాజవంశాలు వీరి అడుగు జాడలనే అనుసరించాయి. ఇస్లాము మతం ఆంధ్ర దేశం మీదకు దండెత్తి రావడంతో హిందూ సంస్కృతి, చివరకు హిందూమతమే సమూలంగా నాశనం కానున్న తరుణంలో ఆంధ్రులు ఒక్కసారిగా విజృంభించి ఇస్లాము మతానికి చెలియలి కట్టవేసి, హిందూమత పునరుద్ధరణకు ఉద్యమాన్ని లేవదీశారు. దానితో ఒక కొత్త నగరానికి శంకుస్థాపన జరిగింది. విజయ నగర సామ్రాజ్యం ఆవిర్భవించింది. హిందూ సంస్కృతి, హిందూ మత స్వాతంత్ర్యాల పరిరక్షణకు విజయనగర సామ్రాజ్యం కంకణం కట్టుకుంది.

బౌద్ధ మతం

అశోకుడు బౌద్ధ మత ప్రచారానికి పూనుకోవడానికి పూర్వమే ఆంధ్ర ప్రజల హృదయాలలోకి బౌద్ధమతం ప్రవేశించింది. అంధకులు లేక అంధ్రకులు అనే పేరుతో ప్రత్యేకంగా బౌద్ధ సన్యాసులు ఉండేవారు. ఇంకా అనేక బౌద్ధమత తెగలను గూర్చిన ప్రస్తావన ఆంధ్ర దేశంలోని బౌద్ధ తీరాలలో విశేషంగా కానుపిస్తున్నది. ఆచార్య నాగార్జునుడు ఆంధ్ర దేశంలో వుండి ఈ దేశాన్ని ప్రఖ్యాతం చేశాడు. ఆతని మహాయాన బౌద్ధమతం ఆంధ్ర ప్రజల మీద ఎంతగానో తన ప్రభావాన్ని ప్రసరింప జేసింది. అంతేగాక హీనయాన, వజ్రాయన బౌద్ధమతాలు కూడా ఆంధ్ర దేశంలో వ్రేళ్ళూని నిలిచాయి. ఘంటశాల, భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండలు అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రాలుగా వాసికెక్కాయి.

భారత దేశంలో కళలు, వాస్తుశాస్త్ర విజ్ఞానం బాగా విస్తరిల్లి జాజ్వల్యమానంగా ప్రకాశింపజేయడంలో ఆంధ్రప్రజల పాత్రయింతా అంతాకాదు. స్తూపనిర్మాణంలో నాలుగుఆయక వేదికలను నిర్మించడం, ఇటికల నిర్మాణానికి పాలరాతి ఫలకాలను జతపరచి చక్కటి ఆకృతిని రూపొందించడం ప్రత్యేకంగా ఆంధ్రుల వాస్తుకళాకౌశలమే. వీటివల్లనే స్తూపాలకు ఒక రకమైన అందము, హుందా వచ్చాయని చెప్పవచ్చు. అమరావతిలోని మహాచైత్యానికి నిర్మించిన

పాలరాతి పిట్టగోడ, సాంచీలోని మహా స్తూపంలోని తోరణాలు బౌద్ధ వాస్తునిర్మాణంలో వాటికవేసాటి. సాంచి, అమరావతులలోని శిల్పాలు భారతీయ శిల్పకళ వికాసంలో రెండు యుగాలను సూచిస్తాయి. అమరావతి శిల్ప సంపద నాలుగు శతాబ్దాలపాటు వికసించింది. హృదయగత భావాలను ప్రకటిస్తూ, చక్కటి అవయవాల వొంపులతో, రేఖల నైపుణ్యంతో తీర్చిదిద్దుకుని; పవిత్రమైన ఆరాధనాపూర్వకమైన ఆలోచనలను రేకెత్తిస్తూ వైవిధ్యపూరితమైనది అమరావతిలోని శిల్పసంపద.

విజయపురికిచెందిన ఇక్ష్వాకులు పెద్దపెత్తున దేవాలయాలు నిర్మించే ఉద్యమాన్ని చేపట్టారు. పల్లవులు దీనిని కొనసాగించడమేకాక మరింత అభివృద్ధిపరచారు. విష్ణుకుండినులు గుహాలలో శిల్పాలు చెక్కే బౌద్ధ సంప్రదాయాన్ని అవలంబించి అసంఖ్యాకంగా గుహాలయాలు నిర్మించి హిందూ దేవతలకు అంకితంచేశారు. పల్లవులు ఈ సంప్రదాయాన్ని కూడా అవలంబించి దానిని దక్షిణాదిలో అభివృద్ధిపరిచారు. ఆంధ్రదేశపు ద్విముఖమైన శిల్పనిర్మాణ సంప్రదాయం మహాబలిపురంలోని సుప్రసిద్ధమైన రథాలలో ప్రతిఫలిస్తుంది.

సుందరమైన కట్టడాలు

నగర, వెసర, ద్రావిడ – దేవాలయ నిర్మాణానికి సంబంధించిన ఈ మూడు ప్రధాన వాస్తు శాస్త్ర రీతులూ ఆంధ్రదేశంలో చాళుక్యుల పరిపాలనాకాలంలో ప్రవర్తిల్లాయి. వక్రరేఖావృత్తమైన గోపురంతోనూ, అమలక శిఖరంతోనూ కూడిన వెసర దేవాలయాలు ఆంధ్రదేశంలో మూడు చోట్ల వున్నాయి. కాకతీయులు కడపటి చాళుక్యుల నిర్మాణపద్ధతులను అవలంబించడమేకాక స్వయంగా క్రొత్తరీతులను ప్రవేశపెట్టారు. వారు హన్మకొండ, రామప్ప తదితర ప్రదేశాలలో అనేక సుందర కట్టడాలను నిర్మించారు. మధ్యయుగంలో దక్కన్‌లో హిందూ సంప్రదాయానికిచెందిన శిల్పకౌశలంతాదాత్మ్యం పొందినదనడానికి ఈ దేవాలయాలు నిదర్శనాలు. విజయనగరాన్ని పరిపాలించిన ప్రసిద్ధపాలకులు దేవాలయ నిర్మాణంలో కొత్తపద్ధతిని సృష్టించారు. ఈ అపూర్వపద్ధతిలో నిర్మించిన అద్భుత కట్టడాలు రాయలసీమ జిల్లాలో కనిపిస్తాయి.

కుడ్య చిత్రాలలో కూడా ఆంధ్రులు సుప్రసిద్ధులు. అజంతాలోని పూర్వపు గుహాలలో కనిపించిన అద్భుతమైన కుడ్య చిత్రాలు శాతవాహనుల కాలంనాటివి. ఈ విధంగా రూపొందిన అజంతా పద్ధతి ఏడవ శతాబ్ది చివరివరకు ప్రవర్ధమానం జెందింది. లేపాక్షి, సోంపేటలలోని చక్కని కుడ్య చిత్రాలు ఈ పద్ధతిలో మరో అద్భుత కళా సృష్టిచేశాయి.

భారతీయ సాహిత్యాలకు ఆంధ్రావని చేసిన సేవలు అమోఘమైనవి. అసంఖ్యాకమైనవి. ఆంధ్రచక్రవర్తి హాలుడు కూర్చిన సప్తశతి, శాతవాహన అమాత్యుడు గుణాఢ్యుడు రచించిన బృహత్కథ ప్రాకృత సాహిత్యంలో ఆణిముత్యాలు. విష్ణుకుండిన నృపాలుడు మాధవవర్మ రచించిన జనాశ్రయ ఛందస్సు కాకతీయ ప్రతాపరుద్రదేవుని ఆస్థానకవి విద్యానాథ విరచితమైన ప్రతాపరుద్రయశోభూషణము, అన్నమ భట్టుని తర్కసంగ్రహము, జగన్నాథ పండితుని రసగంగాధరము – ఇవి ఆంధ్ర పండితులు సంస్కృతంలో రచించిన కొన్ని ప్రసిద్ధ గ్రంథాలు. ఇదేవిధంగా కుమారగిరి రెడ్డి వసంత రాజీయము, కాళిదాసు నాటకాలు మూడింటిపైన కాటయవేమ వ్రాసిన వ్యాఖ్యానాలు, పెదకోమటి వేమన రచించిన సాహిత్య రత్నాకరము సంగీత రత్నాకరము, శింగభూపాలుని రసార్ణవ సుధాకరము మొదలైనవికూడా సంస్కృత వాఙ్మయంలో పండితుల, విజ్ఞుల ప్రశస్తి బడిశాయి. ఈ గ్రంథాలన్నీ ఆంధ్రదేశంలోని రచయితలైన ప్రభువులు రచించినవే.

ఉజ్జ్వలమైన యుగం

ఆంధ్ర ప్రజలు తమ ప్రాంతపు చరిత్రలోనే కాక తమ పొరుగు ప్రాంతాల చరిత్రలోకూడా ప్రముఖ పాత్ర వహించారు. ఇద్దరు తెలుగు సోదరులు – హరిహరరాయలు బుక్కరాయలు – కర్నాటక ప్రాంతంలో స్థాపించిన విజయనగర సామ్రాజ్య నగరము రమారమి మూడు శతాబ్దాలపాటు వర్ధిల్లినది. దీని చరిత్ర దక్షిణ భారత దేశంలో గడచిన అత్యంత మహోజ్జ్వలమైన చరిత్రలలో ఒకటి. ఆంధ్ర కవులు, విద్వాంసులు, సైనికయోధులు అనేక మంది దక్షిణ దేశానికి తరలివెళ్ళి విజయనగర చక్రవర్తుల ఆశ్రయాలను పొంది అచ్చట స్థిరపడ్డారు. పెక్కుమంది తెలుగు నాయకులు దాక్షిణాదిలోని వివిధ సంస్థానాలకు పాలకులుగా వున్నారు. సామ్రాజ్యం బలహీనమైపోయిన తరువాత వారు తంజావూరు, మధుర, గింజి, పుదుక్కోట వంటి ప్రత్యేక సంస్థానాలను స్థాపించారు. వారి వారసులు గొప్ప కళాపోషకులు, సాహితీప్రియులు. తంజావూరుకు చెందిన రఘునాథ నాయకులు, విజయరాఘవుడు, మధురకు చెందిన విజయరంగ చొక్కనాథుడు, పుదుక్కోటకు చెందిన రఘునాథుడు మున్నగు పాలకులు ప్రసిద్ధ సాహిత్య గ్రంథాలను రచించారు.

భారతదేశం పెక్కు శతాబ్దాలనుంచి సువిశాల సంస్కృతీ సామ్రాజ్యానికి కేంద్రంగా వున్నది. భారత దేశానికి చెందిన అనేకమంది యోధులు, వర్తకులు, మత ప్రచారకులు దూరతీర దేశాలకు సముద్ర మార్గంగా వెళ్ళి అచ్చట స్థిరపడారు. వారు ఆయా దేశాలకు తమవెంట భారతీయ సంస్కృతినికూడా తీసుకొని వెళ్ళి దానిని స్థానిక సంస్కృతులలో మేళవించి వినూత్న మిశ్రమ సంస్కృతిని రూపొందించారు. ఈ విధంగా సంస్కృతిని విస్తరింపజేసే కృషిలో ఆంధ్రులు ప్రముఖపాత్ర వహించారు. ఆగ్నేయాసియా దేశాలలోని అమరావతి, విజయపురి, సింహపురి, కళింగవంటి పేర్లు ఆంధ్ర దేశంలోని వివిధ స్థలాల పేర్లను పోలినవి. శాతవాహన శకంనాటి శిలా శాసనాలూ, క్రీస్తుశకం తొలి శతాబ్దాలనాటి తెలుగు లిపిలో చెక్కబడిన శిలాశాసనాలూ, అమరావతి పద్ధతి శిల్పాలూ, కోస్తా ఆంధ్రజిల్లాలలో వాటిని పోలిన కంచు విగ్రహాలూ ఈ దేశాలలోని అనేక ప్రదేశాలలో లభించాయి.


★

విద్యుచ్ఛక్తి

శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు

'ఆధునిక దేవాలయం'

పాతాళ గంగ స్నానఘట్టానికి దిగువన సుమారు ఒక మైలు దూరంలో కృష్ణానదికి అడ్డంగా, 'శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టు' అనే ఒక ఆధునిక దేవాలయం నిర్మాణం జరుగుతున్నది. నాగార్జునసాగర్ జలాశయం అగ్రంలో రమణీయమైన లోయ ప్రాంతంలో, ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదుకు 200 కిలోమీటర్ల దూరంలో యిది వుంది.




శ్రీశైలం ఆనకట్ట నమూనా

రోడుమట్టంలో ఆనకట్ట పూర్తి నిడివి 1680 అడుగులు. గరిష్ఠ ఎత్తు సుమారు 470 అడుగులు. కుడి వైపున వున్న విద్యుత్కేంద్రంలో ఒక్కొక్కటి 110 మె.వా.ల చొప్పున ఏడు యూనిట్లను నెలకొల్పుతారు. ప్రస్తుతానికి నాలుగు యూనిట్లను ప్రారంభిస్తారు.

ప్రాచీన దేవాలయం

అనాది కాలం నుంచీ శ్రీశైలక్షేత్రం అన్ని వర్గాల భక్తులనూ అమితంగా ఆకర్షిస్తున్నది. శ్రీ మల్లికార్జునస్వామి, భ్రమరాంబ ఇచ్చట వేంచేసి వున్నారు. ఇచ్చటి జ్యోతిర్లింగం దేశంలోని పన్నెండు ప్రధాన శివలింగాలలో ఒకటి. తనను ఆరాధించిన వారందరికీ—తాపసులు, పాపులు, రాజులు, సామాన్యులు—ఇది వెలుగు ప్రసాదించింది. 9వ శతాబ్దిలో ఆదిశంకరులు సత్యాన్వేషణగావిస్తూ ఈ ఆలయాన్ని సందర్శించినట్లు ప్రతీతి. ఛత్రపతి శివాజీ కూడా ఇచ్చటి దైవాన్ని ఆరాధించాడు. ఈ సందర్భం జ్ఞాపకార్థం ఆయన పశ్చిమ దిక్కున గోపురం నిర్మించాడు. ప్రతి సంవత్సరం వేలాది భక్తులు దూర ప్రదేశాల నుంచి యిక్కడికి వచ్చి శ్రీ మల్లికార్జునస్వామి వారిని దర్శించి తరిస్తుంటారు.



శ్రీశైల మల్లికార్జునాలయం

* * *

పంపుసెట్ల సరఫరా

తరచుగా అనావృష్టికి గురి అయ్యే ప్రాంతాలలోని రైతులకు అద్దెకొనుగోలు పద్ధతిపైన రెండు లక్షల పంపుసెట్లను సరఫరా చేయడానికి రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు పంచవర్ష ప్రణాళిక నొకదానిని రూపొందించినట్లు బోర్డు అధ్యక్షుడు శ్రీ సి. నరసింహం తెలియజేశారు. ఈ విధంగా అయిదు అశ్వశక్తిగల పంపుసెట్లను సరఫరా చేయడం వల్ల పది లక్షల ఎకరాలలో రెండు పంటలకు నీరు లభించగలుగుతుందనీ, యిందువల్ల ఉత్పత్తి చెప్పుకోదగినంతగా పెరుగుతుందనీ ఆయన అన్నారు. లార్సెన్, టబ్రో యింజనీర్ల సదస్సుకు అధ్యక్షత వహిస్తూ ఆయన ఈ విధంగా చెప్పారు.

మన సంపద

గొట్టపు బావులు

వ్యవసాయోత్పత్తిని తీవ్రతరం చేసే ఉద్దేశంతో, అయిదు సంవత్సరాల కాలంలో గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలో 7,500 ఉత్పత్తి గొట్టపు బావులను నిర్మించడానికై సమీకృత ప్రాజెక్టు నొకదానిని రూపొందిస్తున్నారు. ఈ ప్రాంతాలలో ఈకార్యక్రమం విజయవంతంగా అమలు జరగడానికి అవసరమైన అమూల్యమైన శాస్త్రీయ భోగట్టాను సేకరించగలగడానికిగాను రాష్ట్ర ప్రభుత్వం, ఒక సంవత్సర కాలంలో రూ. 18 లక్షల ఖర్చుతో 88 ప్రయోగాత్మక గొట్టపు బావులను తవ్వడానికి ఒక పథకాన్ని మంజూరు చేసింది.

ఈ ప్రయోగాత్మక గొట్టపుబావులు పైన తెలిపిన నాలుగు జిల్లాల్లో భూగర్భంలో లభ్యంకాగల నీటి పరిమాణాన్ని స్వభావాన్ని వెల్లడించే అమూల్యమైన శాస్త్రీయ భోగట్టాను అందించగలుగుతాయి. అంతేగాక— అవసరమైన సందర్భాలలో వీటిని ఉత్పత్తి గొట్టపు బావుల క్రింద మార్చవచ్చుకూడా.

సీ ఐలాండ్ ప్రత్తి సేద్యం

కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టు ప్రాంతంలో సీ ఐలండ్ (ఆంధ్రాసు) రకం ప్రత్తి సేద్యం పెంపొందుతున్నది. ఆ ప్రాంతపు రైతులు ఈ రకాన్ని బాగా అభిమానిస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 600 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రత్తి రకం వేశారు. కొంతమంది రైతులు ఎకరానికి 1,790 కిలోగ్రాములకు పైగా ప్రత్తి పండించారు. అనంతపురం జిల్లాలో తుంగభద్ర ఎగువ కాలువ ప్రాంతంలో కూడా 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ పైరు వేశారు.

ఎమ్మిగనూరుకు చెందిన పురోగామి అయిన రైతు శ్రీయు. ఎం. నరసయ్య, గత సంవత్సరం 1731 కిలోగ్రాముల సీ ఐలండ్ ప్రత్తి పండించి దేశమంతటిలోకి గరిష్ఠ దిగుబడి సాధించారు. ఈ ప్రత్తి రకం పండించడానికి తీవ్రంగా శ్రద్ధ తీసుకోవడం, అధిక పరిమాణంలో ఎరువులు ఉపయోగించడం అవసరమైనప్పటికీ దీనికి మంచి ధర లభిస్తుందికాబట్టి ఈ రకం బాగా లాభసాటియైనది.

ఉపప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్, డిసెంబరు 11వ తేదీన ఎమ్మిగనూరులోని శ్రీ ఎం. పి. గంగప్ప వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన సందర్భంలో ఆయనకు అనేకమంది పురోగాములైన రైతులను పరిచయం చేశారు. శ్రీ ఎం. పి. గంగప్పకు, 1964_65 వ సంవత్సరంలో జి. ఇ. బి. 24 రకం వరిని 3834 కిలోగ్రాములు పండించినందుకుగాను "కృషి పండిట్" బిరుదం లభించింది. ఉపప్రధానికి పరిచయం చేయబడిన రైతులలో శ్రీ బి. గుంటప్ప కూడా వున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకూ కూరగాయలు అమ్ముకోవడం వృత్తిగాగల శ్రీ గుంటప్ప యిప్పుడు సుమారు పదిహేను ఎకరాల భూమికి యజమాని. వ్యవసాయంమీద అతనికి యేటా దాదాపు రూ. 20,000 ల వరకు రాబడి వస్తున్నది. ఆయన శాస్త్రీయమైన పద్ధతుల ద్వారా సంకరజాతి జొన్న, సీ ఐలాండ్ ప్రత్తి పండించారు.

చెరకు ధర పెంపుదల

చక్కెర ఫ్యాక్టరీలకు సరఫరాచేసే చెరకుగడ ధరను టన్నుకు రూ. 110 లకు హెచ్చించడానికి రాష్ట్ర మంత్రివర్గం డిసెంబరు 13వ తేదీన నిర్ణయించింది. ఈ కొత్త ధరను ప్రస్తుత క్రషింగ్ సీజన్‌లో సరఫరా చేసిన చెరకుగడకు కూడా వర్తింపజేస్తారు ప్రభుత్వ, సహకార చక్కెర ఫ్యాక్టరీలలో ఈ రేటును అమలు పరుస్తారు.


ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ యజమాన్యం క్రింద నడుస్తున్న చక్కెర ఫ్యాక్టరీ నిజాంచక్కెర ఫ్యాక్టరీ ఒక్కటే. ఇచ్చట ఎనిమిది సహకార ఫ్యాక్టరీలు, పది ప్రైవేటు ఫ్యాక్టరీలు వున్నాయి. ఫ్యాక్టరీకి సరఫరా చేసిన చెరకు గడకు ధర చెల్లించే విషయంలో ప్రైవేటు ఫ్యాక్టరీలుకూడా యిదే రేటును అనుసరించాలని ప్రభుత్వం అభిలషిస్తున్నది. ఉత్పత్తి వ్యయం, సరఫరా పరిస్థితుల దృష్ట్యా క్రొత్త ధర గిట్టుబాటు అయినది.



శ్రీ మొరార్జీదేశాయ్ డిసెంబరు 11వ తేదీన ఎమ్మిగనూరులో చేనేతసహకార సంఘాన్ని, వ్యవసాయపరిశోధక కేంద్రాన్ని సందర్శించినప్పటి చిత్రాలు

విశాఖపట్నంలో ఎరువుల కర్మాగారం

ప్రపంచంలోని అత్యంత ఆధునికమైన ఎరువుల కర్మాగారాలలో ఒక దానికి డిసెంబరు 10 వ తేదీన విశాఖపట్నంలో ఉపప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ లాంఛన ప్రాయంగా ప్రారంభోత్సవం చేశారు. ప్రైవేటు రంగంతో భారత-అమెరికా దేశాల సంయుక్త ఆధ్వర్యంలో రూ. 48.4 కోట్ల వ్యయంతో నెలకొల్ప బడిన ఈ కోరమాండల్ ఎరువుల కర్మాగారం యేటా 2,60,000 టన్నుల మేలురకం ఎరువులను ఉత్పత్తి చేయగలుగుతుంది. విశాఖపట్నం రేవు ప్రాంతంలో 500 ఎకరాల మేరలో ఈ భారీ కర్మాగారం విస్తరించివుంది.




ఫాస్ఫారిక్ యాసిడ్ యంత్రం

ఎనిమిది సంవత్సరాల కృషి అనంతరం నిర్మితమైన ఈ ప్రాజెక్టును అనకాపల్లి ప్రాంతానికి చెందిన 67 సంవత్సరాల కర్షకుడు శ్రీ గ్రంధి రామమూర్తి చెట్టి ప్రారంభించారు.

కోరమాండల్ కర్మాగారం వంటి కర్మాగారాలు, లేదా దానిని మించిన కర్మాగారాలు కనీసం పదిహేను అయినా దేశానికి అవసరమని కోరమాండల్ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ వాఘన్ సి. వాల్ అన్నారు. దీనిని బట్టి ఈ కర్మాగారం ఆవశ్యకతనూ, ప్రాముఖ్యాన్నీ గ్రహించవచ్చు.

కోరమాండల్ కర్మాగారంలో ఉత్పత్తి జరగడం ఎరువుల దిగుమతులు తగ్గిపోయి తత్ఫలితంగా యేటా రూ. 16 కోట్ల మేరకు ఆదావుందగలదనీ, ఎరువులను ఉపయోగించడంవల్ల రైతులకు అదనంగా రూ. 30 కోట్ల వరకు ఆదాయం చేకూరి వచ్చుననీ



కోరమాండల్ ఎరువుల ఫ్యాక్టరీకి డిసెంబరు 10 వ తేదీన శ్రీ మొరార్జీదేశాయ్ ప్రారంభోత్సవం చేశారు.

అంచనా. అదనంగా పండే ఆహారం సుమారు 80 లక్షల మంది ప్రజలకు లభించ గలుగుతుంది.

ఉపప్రధాని ఈసందర్భంలో ప్రసంగిస్తూ, ఆధునిక వ్యవసాయ విధానాలవల్ల వచ్చే కొన్ని సంవత్సరాల కాలంలో దేశం స్వయం సమృద్ధం కాగలదని ఆశాభావం ప్రకటించారు. వర్షం కురుస్తున్న సమయంలో కర్మాగారానికి ప్రారంభోత్సవం జరిగింది. అది శుభసూచన అని ఉపప్రధాని పేర్కొన్నారు. ప్రైవేటు రంగంలోని ఈ కర్మాగారం రేవు సమీపంలో వుండడం వల్ల, త్వరితంగా పంపిణీ జరపడానికి వసతులు కలిగివుండడం పట్ల ఆయన సంతోషం వెలిబుచ్చారు. కర్మాగారం ఉత్పత్తి ప్రారంభించడానికి పూర్వమే మేనేజిమెంటు దీని విస్తరణ కార్యక్రమాన్నికూడా రూపొందించినది.

దేశానికి ఆపదసమయంలో అమెరికా చేసిన సహాయాన్ని గురించికూడా ఉపప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు. ఎరువులను వినియోగించుకునే ప్రధాన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఆయన అన్నారు. ప్రభుత్వరంగంలో ఎరువుల కర్మాగారాన్ని నెలకొల్ప వలసిన అవసరాన్ని శ్రీ బ్రహ్మానందరెడ్డి నొక్కి చెప్పారు.

గృహిణి

పిలకా గణపతిశాస్త్రి

జరిగినకథ

పార్థసారథికి నాటకాలపిచ్చి. రాఘవ నాట్యకళా మండలి ద్వారా నాటకాలు వేస్తుండేవాడు. నాటకాల పిచ్చిలో పడి అతను సరిగా యింటికే వచ్చేవాడుకాదు. అతని భార్య విజయలక్ష్మి ఎంతగా చెప్పినా అతను వినిపించుకోలేదు. ఒకసారి బావ కృష్ణమూర్తి పెళ్ళికని వెళ్ళి విజయలక్ష్మి నాలుగురోజులపాటైనా వుండకుండా తిరిగి వచ్చేసింది. వాళ్ళ అన్యోన్యానికి ఆమె ఎంతగానో మురిసి పోయింది.

పార్థసారథి చూపిస్తున్న అభిమానం అంతా వట్టి నటన అని గ్రహించడానికి విజయలక్ష్మికెంతో కాలం పట్టలేదు ! ఒకనాడామె ఏదో మాటల సందర్భంలో నాటకాల మూలాన అనవసరమయిన ఖర్చు, లేనిపోని బెడద తప్ప, మరి మిగిలేది ఏది లేదన్నట్టు రవంత విసుక్కుంది. అంతేగాని ఆ మాటలలో చూచాయగా నయినా సరోజ సంగతి ఉట్టంకించలేదు. కాని అంతమాత్రానికే పార్థసారథి ధుమధుమలాడుతూ కసురుకున్నాడు. ఆ పైన అతని ముఖంలో తిరిగి ముభావము, మౌనముద్ర ప్రారంభమయ్యాయి. విజయలక్ష్మి కప్పటికి ఇటీవల భర్త తన యెడల ఒలకబోస్తున్న అభిమానం అంతా వట్టి అభినయమే అని పూర్తిగా స్పష్టపడింది ! సహజమైన అతని ఉదాసీనతకన్న తెచ్చిపెట్టుకున్న ఆ అభినయమే ఆమెకెంతో వ్యథ కలిగించింది. అయినా విజయలక్ష్మి తన మనోవేదన ఆవంతయినా ముఖంమీద వ్యక్తం కానీయలేదు ! ఎప్పటిలాగే నవ్వు ముఖంతోనే అతనితో మాట్లాడింది.

ఆ సంగతులన్ని ఆలోచిస్తున్న సమయంలో విజయలక్ష్మికి కృష్ణమూర్తి దంపతుల అన్యోన్యత, ఆనందము, హాయి జ్ఞప్తికి వచ్చాయి. వారిరువురికి ఒండొరుల యెడల ఆత్మీయత, అనురక్తి ఆమె కెంతయినా ఆశ్చర్యం కలిగించాయి. వారి సామాన్య సంసార పరిస్థితి పరిశీలిస్తే అంతటి ఉల్లాసానికికూడ ఆస్కారం కనబడలేదు. సాధారణ కుటుంబాలన్న తరువాత అనేకమయిన ఇబ్బందులెప్పుడు ఎదురుపడుతూనే ఉంటాయి. కాని సావిత్రిగాని, కృష్ణమూర్తిగాని వాటి మాట ఎన్నడు పట్టించుకున్నట్టే కనబడలేదు. విజయలక్ష్మి భర్త ఇంటలేనప్పుడు పిల్లల నిద్దరిని వెంటబెట్టుకుని చాలాసారులు వాళ్ళ ఇంటికి వెళ్ళింది. ఇల్లు చిన్నదయినా సావిత్రి అది అంతా ఎంతో ఇమ్ముగా సర్దుకొని సర్వదా చక్కగా పరిశుభ్రంగా సరిదిద్దుకొన్నది.

ఎల్లవేళలా కళకళలాడుతూ ఉండే ఆమె ముఖం చూసి విజయలక్ష్మి ఎంతో ముచ్చటపడుతూ ఉండేది. ఆమె అంతగా చక్కనిదని చెప్పడానికి వీలులేదు. అయితే అనాకారి మాత్రం కాదు. సన్నగా సళాకులా ఉంటుంది. రవంత కోలముఖం. చిలిపితనం చిలకరించే గుండ్రనికళ్లు. ఎరుపుపాలెక్కువ కలిసిన చామన చాయ. సావిత్రి అంతగా చదువుకోలేదు. వివాహానికి మునుపే స్కూలు ఫైనలు పూర్తికాకుండానే చదువు సంధ్య లాపివెయ్య వలసి వచ్చింది. వాళ్ళది అంత కలిగి ఉన్న సంసారం కాకపోవడమే దానికొక ప్రధాన కారణం. అయినా విద్యాభ్యాసం మీద సావిత్రి ఆసక్తి తగ్గలేదు. తీరిక సమయాలలో ఎల్లప్పుడు ఏవేవో పత్రికలు పుస్తకాలు చదువుతూనే ఉంటుంది. అయినా ఇంటిపని అంతా తానే చేసుకుంటుంది. ఆఖరకి పొరుగింటి పెరటిలోనించి మంచినీళ్ళు తేవడానికిగాని, అంట్లు చెంబులు తోమడానికి గాని పనిమనిషిని పెట్టుకోలేదు. నల్లపూసలతో గుచ్చుకున్న పుస్తెలతాడు తప్ప ఆమెకిక వేరేన్నగలేవి లేవు. పట్టుమని కట్టుకోవడానికి ఒకమంచి చీరకూడా లేదు. ఇంట్లో వున్నప్పుడు మాసి చిరిగిన చీరలలోనే కాలక్షేపం చేస్తున్నది.

ఇక కృష్ణమూర్తి బావ పరిస్థితి కూడా ఇంచుమించుగా అలాగే ఉన్నది. అంతగా ప్రయత్నించినా అతనికింకా ట్యూషను లెక్కడ కుదరలేదు. చేతికందే జీతంలో కొంతసొమ్ము ప్రతినెల ఇంటికి పంపక తప్పడంలేదు. ఆపైన పాతిక రూపాయల దాకా యింటిఅద్దె చెల్లించుకోవాలి కదా. స్కూలుకు వేసుకోవడానికి వీలయిన రెండు, మూడు జతలు తప్ప అతనికిక వేరే మంచి మసులేవీ లేవు ! అవి అయినా కొంచెం చిరుగుపట్టినట్టు కనబడుతున్నాయి ! జీతం రాళ్లు తప్ప కృష్ణమూర్తికింక వేరొక ఆదాయమేదిలేదు. అతని కుటుంబ పరిస్థితులే అంతటివి ! కావలిస్తే కొంత సొమ్ము అప్పుగా తీసుకు వెళ్ళవలిసినదని ఒకసారి విజయ

లక్ష్మి సావిత్రినెంతో బలవంతపెట్టింది. అయితే ప్రస్తుతాని కవసరం లేదని చెప్పి ఆమె తప్పించుకున్నది. అంతగావస్తే ఇంకొ కప్పుడెప్పుడయినా అడిగి తీసుకు వెళ్ళగలనని చెప్పింది. అయినా ఆ దంపతులెల్లప్పుడు నవ్వుతూ పేలుతూన్నట్టే కనిపిస్తున్నారు! వారిద్దరు ఎంత అదృష్టవంతులు!

ఒండొరుల యెడల ప్రేమానురక్తులే వారి ఉల్లాసానందాల ప్రధాన కారణాలని విజయలక్ష్మి గ్రహించుకున్నది. ఆ ఆలోచన వల్ల ఆమె మనసులోనుండి అప్రయత్నంగా ఒక వేడినిట్టూర్పు వెలు వడింది. భార్యాభర్తలకంతటి అన్యోన్యత ఉన్నప్పుడు ఎంతెంతటి గడ్డుకష్టాలనైనా ఇట్టే నెట్టి వెయ్యవచ్చునని విజయలక్ష్మికి అనిపిం చింది. తన జీవితానికెక్కడ ఏ విధమయిన కొదవ లేదు. భర్త బాగా ఆస్తిపాస్తులున్నవాడు. నలుగురిలోను ఎన్నదగిన అంద గాడు! రత్నాలవంటి పసి పిల్లలు. అన్ని విధాల సుఖపడగలనని అనుకొని అమ్మమ్మ, తల్లి అదే సంబంధం చేసితీరాలని పట్టు పట్టారు. వివాహమయిన తరువాత బంధువులందరు తమరిద్దరినీ చూసి ఈడు జోడు, ఆస్తిపాస్తులు, అంద చందాలు అన్ని చక్కగా అమర్చి పెట్టినట్టున్నాయని ఎంతయినా మురిసిపోయారు.

ఇక తన మాట వేరే చెప్పనే అక్కర లేదు భర్త పెళ్ళి చూపులకని వచ్చినప్పుడు, ఒళ్ళంతా కళ్ళు చేసుకుని అతనికేసి చూసి వల్లమాలిన సిగ్గుతో చిమిడిపోయి నిలువునా కుంచించుకు పోయింది. ఆ సంబంధమే కుదిరితే మరి తనవంటి అదృష్టవంతు రాలుండబోదని మనసు ఎగిరి గంతేసింది! కాని కాపరానికి వచ్చిన ఏడెనిమిది నెలలు మాత్రమే భర్తతో బాటు ఎంతో అన్యో న్యతతో సంతోష సౌఖ్యాలను చవిచూచింది. అంతే! ఆ పైన తన బ్రతుకంతా బాగా అకటావికటంగా తయారయింది. ఆ నాటి కానాటికి భర్త బొత్తిగా ఇంటి పట్టునే ఉండడం లేదు. సాయంత్రా నికి తప్పక తిరిగి వచ్చి వెయ్యగలనని మాట ఇచ్చిన మనిషి ఇంతవరకు ఇంటి ముఖమే పట్టలేదు. తన వివాహం నాటికి నిలవ ఉన్న ఆస్తితో చాలా భాగం అప్పుడే హారతి కర్పూరంలా హరిం చుకు పోయింది. అయ్యో! పిల్లలు బయలుదేరుతున్నారే! ముందు ముందు వాళ్ళ గతేం కావాలి! మరి కుటుంబం సంగతేమిటి? అన్న ఆలోచనే తోచలేదతనికి!

ఆ సమయంలో విజయలక్ష్మి మనస్సులో కృష్ణమూర్తి బావనే వివాహం చేసుకుని ఉంటే ఇంతకన్న ఎక్కువగా సుఖపడి ఉందునన్న ఆలోచన మొలకెత్తక పోలేదు. అతడు సావిత్రిని ఎన్నెన్ని విధాల సంతోష పెడుతున్నాడు! సాయంత్రం స్కూల్లో గంట కొట్టగానే వెంటనే ఇంటికి తిరిగి వచ్చివేస్తున్నాడు. స్వయంగా కుటుంబ వ్యవహారాలన్ని చక్క బెట్టుకుంటున్నాడు. ఇంచుమించుగా ప్రతి దినము భార్యతో కలిసి పార్కు వైపు షికారు వెడుతున్నాడు. అంతేకాదు! ఇంటి పనులలో కూడా శాయశక్తులా సాయపడుతున్నాడు. చదువు కోడానికని స్కూలు లైబ్రరీలోనించి మంచి మంచి నవలలు, కథల పుస్తకాలు తీసుకు వస్తున్నాడు. భార్యచేత ప్రైవేటుగా స్కూలు ఫైనలు పరీక్షకి కట్టించాలని నిశ్చ యించి శ్రద్ధపట్టి చదువు చెబుతున్నాడు. సావిత్రి కూడా ఎంతో ఆసక్తితో చదువు కుంటూంది.

ఏదో ఇంత కలిగిన దానితోనే వారిద్దరు చిలకా గోరింకల్లాగ హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. వారి అన్యోన్యత తలుచు కుంటున్న కొద్ది ఆమె కెంతో ఆనందం కలిగింది. కృష్ణమూర్తిని వివాహమాడి ఉంటే అన్నివిధాల సుఖపడి ఉందునన్న ఆలోచన కూడా క్షణ కాలం మనస్సులో మెదిలింది. అయితే జరిగి పోయిన దానిని గురించి మథనపడినందువల్ల ప్రయోజనమేమీ లేదని తన



మనస్సు అటువంటి ఆలోచనలవైపు పోకుండా దృఢంగా మళ్ళించి వేసుకొన్నది. తమ ఇలవేలుపు అమ్మవారి దయ ఉంటే భర్త ఎప్పటికయినా తన్ను చూడకపోరని తిరిగి ధైర్యం తెచ్చుకుంది. కాని పార్థ సారథి పరిస్థితిని బట్టి చూస్తే ఆమెకంతగా నమ్మకం కలగ లేదు.

క్రమ క్రమంగా నాటకాల వెడదలన్ని తగ్గిపోయి, భర్త బాగా తిన్నబడితే తప్పకుండా కొండకొకసారి వెళ్ళి పిల్లలతో బాటు వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని సహస్రనామ పూజ చేసు కోగలనని చేతులు జోడించి మొక్కుకున్నది. ఇక అప్పటి నుండి ప్రతి శనివారము దీపారాధనకూడా చెయ్యాలని నిశ్చయించుకున్నది. అలాగే ప్రతి శుక్రవారము పొద్దున్న అమ్మవారి పూజ చేసుకుని రాత్రి పచ్చి మంచి నీళ్ళయినా ముట్టకుండా ఉపవాసం చెయ్యాలని కూడా సంకల్పించుకున్నది. ఇంతకి ఆ చల్లని తల్లి ఎలాగు సంక ల్పించుకున్నదో అని ఒక సుదీర్ఘ నిశ్వాసం విడిచి పెట్టింది. చెక్కిళ్ళమీద జారుతున్న వేడి కన్నీరు చీర చెంగుతో తుడిచి వేసుకున్నది.

పార్థసారథి ఆ నాడు కూడా ఇంటికి తిరిగి రాలేదు. అతడు ఏలూరువెళ్ళి అప్పుడే రెండు రోజులయింది. అక్కడికి వెళ్ళినప్పటి నించి భర్త ఆ ఊళ్ళో ఏమి చేస్తున్నట్టు? ఆ నాటకం వ్యవహారం అంతా ఆ కంట్రాక్టరుకే అప్పజెప్పినప్పుడు, స్వయంగా పని కట్టు కుని వెళ్ళి, అక్కడ ఏర్పాటులన్ని అజమాయిషీ చెయ్యవలసి నంతటి అగత్యం ఏమి వచ్చింది? పోనీ అత్యవసరమయిన పని ఏదయినా ఉండి అక్కడ ఆగిపోతే ఒక్క ఉత్తరం ముక్క రాసి పడ వెయ్యవచ్చునే! ఎందుకురాయలేదు! ఎంతగా ఆలోచించినా ఆమెకేమి బోధపడలేదు.

మరునాడు పొద్దున్నే పనిమనిషిని పిలిచి మెల్లగా బుజ్జగించి రంగనాయికి ఇంటికొకసారి వెళ్ళమని ప్రోత్సహించింది. ఆమె అక్క ద్వారా తన భర్త సంగతి, సరోజ సంగతి పరస్పరంగా ఆరాతియ్యవలిసిందని కోరింది. తాను పంపించినట్టు ఆఖరికి ఆమె అక్కకి కూడా తెలియనీయ వద్దని హెచ్చరించింది. భర్త ఎక్కడికి వెళ్ళనో తిన్నగా తెలుసుకునివస్తే పట్టు జాకట్టు ఒకటి బహుమతి ఇవ్వగలనని ఆశ పెట్టింది. చేసే చేసే పని కూడా మానివేసి ఆ పని మనిషి వెంటనే తన ఇంటి దగ్గిరే ఉన్న అక్క దగ్గరికి వెళ్ళి ఆ వ్యవహారంలంతా రాయశక్తులా కూపీ తీసింది.

ఆమె మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ తిరిగి వచ్చి అతిరహస్యంగా తన చెవిని వేసిన సంగతులన్ని విని విజయలక్ష్మి మరి నోట మాటలేక నిలువునా నిరాంత పడింది. పార్థసారథి బయలు దేరిననాడు అదే బండిలో సరోజ కూడా ఏలూరు వెళ్ళింది. బయలుదేరేటప్పుడు తల్లితో అయిదారు రోజులదాక తిరిగి రావడం సాధ్యపడకపోవచ్చునని చెప్పింది! తను పార్థసారథితో కలిసి ప్రయాణం చేస్తున్న సంగతికూడా ఆమె చెవిని వేసింది. సరికొత్త దుస్తులు, కొన్ని వస్తువులు కొనుక్కోవడంకోసం పార్థసారథితో కలిసే ఏలూరు నుంచి మద్రాసు వెడుతున్నట్టుకూడా చెప్పింది. ఆ వ్యవహారంలో అంత గుంభనగా దాచివేయవలసినంతటి పెద్ద రహస్యమేమిలేదు. పనిమనిషి ఆరా తీసినవన్ని అక్షరాల యథార్థాలే అయిఉండవచ్చునని విజయలక్ష్మి నిశ్చయించుకున్నది.

ఆమె కప్పటికి భర్త, అన్నసమయానికి తిరిగి రాకపోవడానికి గల అసలు కారణమేమో మంచు విడిపోయినట్టు విస్పష్టంగా విడిపోయింది. అంతేకాదు. అతడికి నాలుగయిదు రోజులదాకా తిరిగి రాకపోవచ్చుననికూడా తేలిపోయింది. అయితే తనతో ఆనాటి సాయంత్రానికే తిరిగి వస్తానని ఎందుకు చెప్పాలి? బహుశః మొట్టమొదట అలాగే అనుకుని ఉండవచ్చును. కాని తలవని తలంపుగా సరోజకూడా అతనితో బయలుదేరి ఉండవచ్చును. మద్రాసు వెడదామని బలవంతపెట్టి ఉండవచ్చును! లేక భర్తే ఆ నాటికి తిరిగి వస్తున్నానని చెప్పి మభ్యపెట్టి ఉండవచ్చునని విజయలక్ష్మి రవంత సేపు అనుమానించింది.

కాని ఇటీవల తాను దేనికీ అడ్డు చెప్పడంలేదు: అన్నీ వినీవిననట్టు, చూసీ చూడనట్టు మాట్లాడ కూరుకుంటున్నది. అలాంటప్పుడు అంతటి మాయమాటలు చెప్పి మోసగించవలసినంతటి అవసరం ఏమొచ్చింది? బహుశః మద్రాసు ప్రయాణం తలవని తలంపుగా అకస్మాత్తుగా సరోజ బలవంతంమీదనే జరిగి ఉండవచ్చును. ఏది ఏమయితేనేం! ఇద్దరు కలిసి ఒకే బండిలో బయలు దేరారు: బహుశః ఏలూరులో ఒకరోజో రెండురోజులో ఉండి వెంటనే ఇద్దరు అక్కడినించి బయలుదేరి మద్రాసు వెళ్ళిపోయారు. విజయలక్ష్మి కొంత కాలానికి పూర్వం తనొకసారి మద్రాసు తీసుకవెళ్ళవలిసిందని పార్థసారథిని రెండుమూడు మారులుకోరింది. కాని ఇన్నాళ్ళనించి ఆ చిన్న కోరికకూడా ఫలించలేదు. పార్థసారథి అలాగే అన్నాడుగాని చిట్టచివరికది జరగనేలేదు. ఇప్పుడు సరోజతో కలిసి భర్త అక్కడికి వెళ్ళినట్టు వినగానే ఆమె ఎంతో బాధపడింది. ఆ సంగతి తెలుసుకొన్నకొద్ది ఆమె కనుకొలుకుల నుండి కవోష్ణ బాష్పాలదే పనిగా ప్రవహించాయి. లోలోపల పట్టరాని మానసిక వ్యథ చెలరేగింది.

ఆవేళ సాయంత్రం తలనొప్పి, జ్వరము వచ్చినదనిచెప్పి విజయలక్ష్మి అన్నం ముట్టలేదు. వర్ధనమ్మ ఒంటిమీద చెయ్యివేసి చూసి ఆమె చెప్పినమాట నిజమే అని గ్రహించుకున్నది. ఇక అన్నం తినమని బలవంతపెట్టలేదు. కాని కొంచెం కాఫీ అయినా పుచ్చుకోవలసిందని బలవంతపెట్టింది. విజయలక్ష్మి తనకేమి అక్కరలేదని మొట్టమొదట వారించుకుంది. కాని తిరిగి తిరిగి బ్రతిమాలుకుంటున్న అమ్మమ్మమాట కాదనలేక అంటీఅంటనట్టు ఒక్క గుక్కెడు కాఫీ పుచ్చుకుని గ్లాసు తిరిగి బల్లమీద పెట్టివేసింది.

ఆ మరునాడుకూడా ఆ జ్వరం తగ్గలేదు. పైగా అది మరింత ఎక్కువయింది. మాల్లమాలిన దిగులువల్ల, వ్యథవల్ల విజయలక్ష్మికి ఆవిధంగా తలనొప్పి జ్వరము వచ్చిఉండవచ్చునని వర్ధనమ్మ కని పెట్టింది. కాని తానేమి చెయ్యగలదు! డాక్టరు దగ్గరకువెళ్ళి మందు తీసుకువచ్చింది. విజయలక్ష్మి అస్తమానము ఏదో ఆలోచిస్తూ బాగా పరధ్యాన్నంగాఉన్నట్టు కనబడింది, అప్పుడప్పుడు చీర చెంగుతో చెక్కిళ్ళమీద దిగజారుతున్న కన్నీటి బిందువులు తుడిచివేసుకుంటున్నది. అందుచేత వర్ధనమ్మ అనుకోని దుస్సంఘటన ఏదయినా అకస్మాత్తుగా జరిగి ఉండవచ్చునని పసికట్టింది. మనవరాలి పక్కన కూర్చుని నెమ్మదిగా బుజ్జగించి ఆ విధంగా కంట నీరు పెట్టుకోవడాని కేమికారణమని మాటి మాటికి బ్రతిమాలుకుంది.

అయినా విజయలక్ష్మి మరికొంత సేపటివరకు పెదవి కదపలేదు. ఇంకొకపక్కకి తిరిగి పడుకుని నీరసంగా మూలిగింది. కాని అమ్మమ్మ తిరిగి తిరిగి ఎంతో ఆప్యాయంగా అడుగుతున్నప్పుడిక కాదనలేక, అతి కష్టంమీద అణగించివేసుకున్న గద్గదికతో పనిమనిషి ద్వారా తెలిసిన సంగతులన్ని సంగ్రహంగా ఆమె చెవిని వేసింది.

వర్ధనమ్మ ఆ విడ్డూరానికి ఎంతయినా బాధపడింది. చాలవరకు నిజం అయి ఉండవచ్చునని అనుమానించింది. కాని పైపైకి మాత్రం వట్టి అభూత కల్పన అయిఉండవచ్చునని కొట్టి పారవేసి నెమ్మదిగా మనవరాలి నోదార్చింది.

'చూడమ్మా! ఇంతవరకు వచ్చిన తరువాత లేనిపోని అనుమానాలు పెంచుకుని ఊరికే బాధపడితే మాత్రం లాభమేమిటి చెప్పు! ఆవిడ మానాన్న ఆవిడ ఆ బండిలోనే ఎదో పనిమీద ఏలూరో, చెన్నపట్టణమో వెళ్ళిఉంటుంది. అంతేకాని నాకు దీనిలో అనుమానపడడానికేమి కనబడలేదు. అనవసరంగా బెంగపెట్టుకుని బాధపడకమ్మా! నువ్వుకూడా ఇలాగయిపోతే ఇక పిల్ల సంగతి ఎవరు చూస్తారు చెప్పు!... నా మాట విని కాస్త ధైర్యంగా ఉండమ్మా! ఇలాగ ఎడుస్తూ కూర్చుంటే జ్వరంకూడా ఎక్కువవుతుంది...... తలనెప్పి తగ్గిందా? అబ్బా! ఒళ్ళంతా జ్వరంతో పేలిపోతూందే! అన్నట్టు మందు పుచ్చుకున్నావా? ఇదిగో ఈకాస్త మందు తాగు తల్లీ!' అని బ్రతిమాలింది. (సశేషం)

మారుతున్న కాలం-మారవలసిన ధర్మం

— కళ్యాణ సింగ్

కాలచక్రం తిరిగింది. సాంఘిక పరిస్థితులలో మార్పువచ్చింది. ఈనాడు బిడ్డలకోసం సంతానగోపాలవ్రతాలు చేయనక్కర లేదు. అశ్వత్థ ప్రదక్షిణాలు చేయనక్కరలేదు. తీర్థయాత్రలు సేవించ నక్కరలేదు. పెళ్ళి అయి పద్దాది తిరగకుండా బిడ్డ పుట్టడం ఖాయమైపోయింది. ఆతరవాత కూడా సంతానసస్యం పండడం నిరంతరాయంగా సాగిపోతూనేఉంది. అనావృష్టి, అతివృష్టి మొదలైన ఈతిబాధలవల్ల ధాన్యంపంట దెబ్బతినవచ్చు నేమోకాని సంతానపు పంటకు మాత్రం ఎలాంటి ఈతి బాధలూ ఉన్నట్టులేదు.

భూమి మీద మానవుడు అవతరించి పదిలక్షల సంవత్సరాలై ఉంటుందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. మానవుడు వ్యవసాయం చేయడం మొదలు పెట్టింది క్రీస్తుపూర్వం దాదాపు 6000 సంవత్సరాలనాడు. అంతకుముందు ప్రపంచం మొత్తంమీద జనాభా రెండు కోట్లకుమించి ఉండదు. 17వ శతాబ్దం రెండవభాగం వచ్చేటప్పటికి అది 50 కోట్లు అయింది. 1650 నుంచి 1920 వరకూ ప్రపంచజనాభా రెండుసార్లు రెట్టింపు అయింది. గడచిన 32 ఏళ్ళలోనూ ప్రపంచజనాభాకు ఇంకొక 100 కోట్లమంది చేరి ప్రస్తుతం ప్రపంచ జనాభా 400 కోట్లైపోయింది.

మన దేశం సంగతి పరిశీలిద్దాం. 1901 లో 23 కోట్ల 83 లక్షలు ఉండిన మన జనాభా 1921 నాటికి అంటే 20 ఏళ్ళవ్యవధిలో 25 కోట్ల 12 లక్షలు అయింది. మరొక 20 ఏళ్లు దాటి 1941 వచ్చేసరికి అంతకుముందు కంటె 6 కోట్ల 73 లక్షలమంది ఎక్కువయ్యారు. 1961 నాటికి అంటే మరొక 20 సంవత్సరాలలో-మన జనాభా 43 కోట్ల 90 లక్షలకు పెరిగింది. గడచిన ఆరేళ్ళలో దాదాపు ఏడుకోట్ల మంది మేరకు జనాభా పెరిగిపోయింది. ఇప్పుడు మన దేశపు జనాభా 50 కోట్లకు మించిపోయింది. మన జనాభా 50 కోట్లు కావడానికి ఎన్నోవేల సంవత్సరాలు పట్టింది. ప్రస్తుతం పెరుగుతున్న రీతిగా పెరగనిస్తే జనాభా ఇంకొక 30 ఏళ్లు తిరగకుండా రెట్టింపై 100 కోట్లు దాటుతుంది.

కాలచక్రాన్ని ఒక్క నిమిషంపాటు వెనకకి త్రిప్పి చూద్దాం. 1927 వ సంవత్సరం మే 26వ తేదీని ముసోలినీ ఇటాలియన్ ఛేంబర్‌లో అన్నమాటలు ఇవి: '9 కోట్ల జర్మనులతోనూ, 20 కోట్ల స్లావ్‌లతోనూ పోలిస్తే 4 కోట్ల ఇటాలియన్‌లు ఏపాటి? ఏమాత్రమైనా గణ్యతపొందాలంటే ఇటలీదేశం ఈ శతాబ్ది రెండవ భాగం ప్రారంభం అయ్యేనాటికి కనీసం 9కోట్ల జనాభా అవసరం." ఇటలీజనాభా ఆ నాటికే విపరీతంగా ఉంది. ఐతేనేం ఇటలీ రాజకీయాధికారం పెంపొందాలంటే ఇంకా జనాభా ఎక్కువకావాలని ముసోలినీవాదం. జనాభాతో పాటు రాజ్యంకూడా విస్తృతం చేయాలని అతని ఆశయం. ఆనాడు అవివాహితులకూ, తక్కువ మంది సంతానం ఉన్నవారికీ పన్నులు వేశారు. కనీసం ఎనిమిది మంది బిడ్డలున్నవారికి పన్నులలో మినహాయింపులు ఇచ్చి ప్రత్యేక సౌకర్యాలు కలిగించారు.

40 ఏళ్ళ కిందటి ఇటలీదేశపు పరిస్థితి ఈ నాడు మన దేశానికి సరిపడుతుందా? మన దేశానికే కాదు మొత్తం ప్రపంచానికే సరిపడుతుందా? ఆ నాటి ఇటలీదేశపు నాయకులవాదం ఈ నాడు మన దేశానికి కానీ, ఏ ప్రజాస్వామ్య దేశానికి కానీ వర్తిస్తుందా? యుద్ధపిశాచి దాహం తీర్చడానికి పానీయంగా, యుద్ధరాక్షసి ఆకలి తీర్చడానికి ఆహారంగా మానవ రక్తమాంసాలను ఉపయోగించడం కోసమే ఆనాటి నియంతలు తమ దేశాల జనాభాను పెంచడానికి యోచించారు. ఈనాడు దురాక్రమణలు సాగడానికి వీలులేదు. యుద్ధం వస్తే ఎన్నికోట్ల జనాభా వున్నా ప్రయోజనంలేదు. అణ్వస్త్రమారణ హోమంలో మసి కావలసినదే.

కాలం మారింది. ఆనాడు తక్కువమంది సంతానం ఉన్నవారికి రాజకీయ కారణాలవల్ల పన్నులు వేస్తే ఈనాడు ఎక్కువమంది సంతానం గలవారికి మానవతాకారణాలవల్ల పన్నులు వేయవలసివచ్చే పరిస్థితి ఏర్పడింది.

మనదేశంలో రోజుకు 50,000 మంది శిశువులు జన్మిస్తున్నారు. మనిషి ఆరోగ్యంగా, బలంగా ఉండాలంటే రోజు ఒక్కంటికి కనీసం 2,200 కాలరీల ఆహారం అవసరం. మన దేశంలోని ప్రజలు రోజుకు సరాసరి తీసుకునే ఆహారం యొక్క విలువ 1,400 కాలరీలు మాత్రమే. మన జనాభాలో మూడింట రెండువంతులకు 2,200 కాలరీల కనీసపు ఆహారం కూడ దొరకడం లేదు. ఇలాంటప్పుడు రోజుకు అదనంగా 50,000 మందికి ఆహారం సమ కూర్చడం ఎలాగ ?

ఆహారపుకొరత ఒక్కటే తీర్చగలిగితే జనాభా సమస్య తీరిపోదు. ఉండడానికి వసతిమాట ఏమిటి ? సంవత్సరానికి 1 కోటి 80 లక్షల పిల్లలు పుట్టుతూ ఉంటే 60 లక్షల జనం చనిపోతున్నారు. అందుచేత ఏడాదికి 1 కోటి 20 లక్షల జనాభా నికరంగా పెరుగుతూఉంది. ఇప్పటికే దేశంలో పట్టణప్రాంతాలలో నైతేనేం గ్రామీణ ప్రాంతాలలో నైతేనేం దాదాపు 8 కోట్ల ఇళ్ల కొరత ఏర్పడి ఉంది. దీనికితోడు ఏడాదికి నికరంగా పెరుగుతున్న 1 కోటి 20 లక్షల జనానికి గృహవసతి సమకూర్చడం ఎలాగ ? ఈ అదనపు జనాభా కోసం ఏడాదికి 24 లక్షల ఇళ్లు కట్టవలసి ఉంటుంది. ఇన్ని లక్షల ఇళ్లు కట్టడానికి సొమ్ము ఎక్కడి

నుంచి వస్తుంది ? సామగ్రి ఎక్కడి నుంచి వస్తుంది ? అంత సామగ్రి తయారు చేయడానికి ఎంత సాధన సంపత్తి కావలసి వస్తుంది ?

ఇది విజ్ఞానయుగం. మనది ప్రజాస్వామ్యదేశం. సంక్షేమ రాజ్యస్థాపన మనలక్ష్యం మరి పిల్లలందరికీ చదువు చెప్పించాలికదా. ప్రస్తుతం మనదేశంలో 37 లక్షల పాఠశాలలు ఉన్నాయి. ఐనా 6 నుంచి 11 సంవత్సరాల మధ్య వయస్సు గల బడికి పోవలసిన ఈడులో ఉన్నదాదాపు ఆరున్నర కోట్లమంది పిల్లలకు పాఠశాల సౌకర్యాలు లేనే లేవు. ప్రస్తుతావసరాలు తీర్చడానికే మరో 37 లక్షల పాఠశాలలు స్థాపించవలసి ఉంది. మరి సాలీనా 1 కోటి 20 లక్షల సంఖ్యలో ఖచ్చితంగా పెరుగుతున్న జనాభాకు విద్యాసౌకర్యాలు కల్పించడం ఏలాగ?

ఇప్పుడున్న జనాభాకే సరిపోయే వైద్యసౌకర్యాలు. రవాణా సౌకర్యాలు, ఇంకా ఎన్నో విధాలైన ఇతర సౌఖ్యాలూ కొరతగా ఉన్నాయి. మరి ఏటా పెరుగుతున్న జనాభాకు ఈ సౌకర్యాలు కల్పించడం అసాధ్యం కదా.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రణాళికల ద్వారా దేశాభివృద్ధికి కృషి చేస్తునే ఉన్నాం. మనం సాధించిన ఫలితాలు కూడా అల్పమైనవికావు. మన ఆదాయం సగటున ఏడాదికి దాదాపు 4 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది. ఆహారోత్పత్తి 62శాతం పెరిగింది. ఏమి లాభం? జనాభా హెచ్చు పెరిగిపోవడంవల్ల మనిషి ఒక్కటికి రోజుకు 12.8 ఔన్సుల ఆహారం లభిస్తూఉండేదిపోయి ఇప్పుడు 12.4 ఔన్సులే లభిస్తూఉంది. పారిశ్రామిక ఉత్పత్తి నూటికి 150 వంతులు అభివృద్ధి చెందింది. ఐనా ఒకకోటి మంది యువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. విద్యాసౌకర్యాలు మూడురెట్లు హెచ్చాయి. ఐనా దాదాపు 6½ కోట్ల పిల్లలకు ఇంకా పాఠశాల సౌకర్యాలు కల్పించవలసిన హిమాలయం అంత బాధ్యత మిగిలే ఉంది.

ఘట్టకుటీ ప్రభాత న్యాయం అని ఒకటి ఉంది. హాసీలు చెల్లించకుండా ఎగవేద్దామని ఒకడు టోల్ గేట్ తప్పించుకొని పక్కదారులు పట్టి రాత్రి అంతా అడివిలో తిరిగి తిరిగి తెల్లవారే సరికి మళ్ళీ ఆ టోల్ గేట్ దగ్గరకే చేరుకొన్నాడట. హాసీలు చెల్లించక తప్పలేదు. రాత్రి అంతా వృథాగా తిరిగి కాలం పాడై ఒళ్లు అలిసిపోయింది. అదే ఫలితం. ఇదేరీతిగా మనం దారిద్ర్యం అజ్ఞానం, అనారోగ్యం మొదలైన రూపాలలో పన్నులు చెల్లించకుండా ఎగవేద్దామని యోచించి ప్రణాళికలు వేసుకొని అభివృద్ధి సాధిస్తే, విపరీతంగా పెరిగిపోతున్న జనాభా కారణంగా ఆ అభివృద్ధి కాస్తా కొరగాకుండా పోతూఉంది. మళ్ళీ యథాప్రకారం సిద్ధిరస్తు అవుతూ ఉంది. కొన్ని విషయాలలో పూర్వం కంటె కూడా అధ్వాన్న పరిస్థితి ఏర్పడుతూ ఉంది. జనాభా పెరుగుదలకూ, మన ప్రణాళికల విజయానికీ మధ్య నడుస్తున్న పందెం పంచకల్యాణి గుర్రానికీ, పంచరగాడిదకూ మధ్య జరుగుతున్న పందెం లాగ పరిణమిస్తుంది.

జనాభా సమస్య ఇంత తీవ్రరూపం పొందకముందే మన నాయకులు కుటుంబనియంత్రణ అవసరం గుర్తించారు. 1936లో హరిపుర కాంగ్రెస్‌లో అధ్యక్షోపన్యాసం ఇస్తూ నేతాజీ సుభాస్ చంద్రబోస్ జనాభా పెరుగుదల అరికట్టాలని ఉద్బోధించారు. జనసంఖ్యను తగ్గించాలనే విషయంలో గాంధీజీకికూడా భిన్నాభిప్రాయం లేదు. జవహర్‌లాల్ ఎన్నోసార్లు హెచ్చరించారు. మన జనాభా ఉన్నదానిలో సగం మాత్రమే ఉండి ఉంటే మనదేశం ఎంతో ఉన్నతదశ పొంది ఉండేదని. స్వాతంత్ర్యం రాకముందే ఏర్పాటైన నేషనల్ ప్లానింగ్ కమిటీ(జాతీయ ప్రణాళికాసంఘం) కుటుంబ పరిమితి నలుగురు పిల్లలకు మించి ఉండరాదని, బిడ్డకూ బిడ్డకూ మధ్య ఎడం రెండు నుంచి నాలుగు సంవత్సరాల వరకూ ఉండాలని 1948 లో సూచించింది. కుటుంబనియంత్రణకు సంబంధించిన అంతర్జాతీయ మహాసభ 1953లో బొంబాయిలో జరిగినప్పుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా ఈ కార్యక్రమం యొక్క ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పారు.

చూస్తూ చూస్తూ ఈ సమస్య విషమించి పోయింది. "ఇంతింతై వటుడింతయై మరియు తానింతై నభోవీథిపై" అన్నట్లు ఈ సమస్య ఆకాశం అంత ఎత్తయింది ఈనాడు. జనాభా పెరుగుదల మూడుదశలుగా జరిగేటట్లు కనబడుతూ ఉంది. మొదటి దశలో జననాలసంఖ్య, మరణాల సంఖ్యకూడా ఎక్కువగానే ఉంటాయి. అందువల్ల ఆ దశలో నికరంగా పెరిగే జనాభా ఎక్కువగా ఉండదు. రెండవదశలో మరణాలసంఖ్య తగ్గిపోతుంది. జననాల సంఖ్య మాత్రం అలా నిలబడే ఉంటుంది. మన దేశం ప్రస్తుతం ఆ దశలోనే ఉంది. 1951లో వెయ్యి మందిలో 27 మంది చనిపోతూఉండగా, ఇటీవల అభివృద్ధి చెందిన ఆరోగ్య సౌకర్యాల ఫలితంగా ఇప్పుడు మరణాలు వెయ్యిమందిలో 16 చొప్పున ఉన్నాయి. ఈ దశలో జనాభా విపరీతంగా పెరిగిపోతుంది. ఇక మూడవదశలో జననాలసంఖ్య కూడా తగ్గితే జనాభా నికరపు పెరుగుదల చాలా తక్కువగా ఉంటుంది. ఆ దశకు మనం వెళ్లవలసి ఉంది.

గాంధీజీ పరిమిత కుటుంబాల ఆవశ్యకతను గురించి ఖండితంగానే చెప్పేవారు. ఐతే దానికి సాధనం బ్రహ్మచర్యం ఒక్కటే అని అంత ఖచ్చితంగానూ చెప్పేవారు. ఇది సామాన్య మానవులకు సాధ్యమా ? అందరూ సామాన్య మానవులై ఉంటారు. అసామాన్యులైన మహా పురుషులు కోటికి ఏ ఒక్కరో ఉంటారు. భీష్మాచార్యులు, శుకయోగీంద్రులవంటి మహనీయులు ప్రపంచ చరిత్రలో ఎంతమంది ఉన్నారు?

గాలి, నీరు, ఆకులతో ప్రాణం నిలబెట్టుకొనే విశ్వామిత్రుడు పరాశరుడు మొదలైన మునీశ్వరులే సుందరమైన స్త్రీ ముఖపద్మాన్ని చూచి మోహ పరవశులయ్యారే. వరి అన్నం, నెయ్యి, పెరుగు తినే సామాన్య మానవులకు ఇంద్రియ నిగ్రహం ఉంటుందంటే వింధ్య పర్వతం సముద్రాన్ని ఈదినట్లే అంటాడు భర్తృహరి.

ఐతే ఏంచెయ్యాలి ? కొన్ని ప్రాంతాలలోని ఆదివాసులలో పుట్టిన బిడ్డలను చంపివేసే ఆచారం ఉంది. ఆదివాసులలో అన్న మాట ఏమిటి ప్రాచీన కాలంలో గ్రీసులోనూ, రోమ్‌లోనూ కూడా ఈ ఆచారం ఉండేది. మనం ఇప్పుడు ఆ పని చేయ

గలమా? కంసుడు దేవకి సంతానాన్ని చంపినట్లు, గంగ శంతనుని సంతానాన్ని గంగలో పారవేసినట్లు ఈ కాలంలో జరగదు. పైగా కంసుడు బిడ్డల్ని చంపడానికి కారణం ఆ బిడ్డలు తనను చంపుతారనే భయం. గంగ బిడ్డలను చంపడానికి కారణం వసువుల శాపం.

ఆఫ్రికా, పోలినేసియాలాంటి ప్రదేశాలలో ఆదివాసులలో ఒక ఆచారం ఉంది. ఒక బిడ్డ పుట్టిన తరవాత మూడు, నాలుగు ఏళ్ళవరకూ దంపతులు సంసార సుఖానికి దూరంగా ఉండాలనే కట్టుబాటు ఉంది. అనాగరికులని మనం అనుకునే ఆ ఆదివాసులు దాన్ని పాటిస్తూనే ఉన్నారు. కాని నాగరికులమైన మనకు విషయాకర్షణలు విపరీతంగా ఉన్న నాగరిక మనబడుతున్న ఈ ఆధునిక కాలంలో అది మన శక్తికి మించినపని.

మరి ఏమిటి మార్గం? అవసరాన్నిబట్టి శాశ్వతంగా కాని తాత్కాలికంగా కాని జననాన్ని నిరోధించడానికి కొన్ని సాధనలు కనిపెట్టారు. శస్త్రచికిత్స చేయించుకుని కాని, కొన్ని పరికరాలు వాడి కాని జనననిరోధం సాధించవచ్చు.

సంతాన నిరోధం భగవంతుని ఇచ్ఛకు వ్యతిరేకం అని కొందరి అభిప్రాయం. అది పాపం అంటారేమో. సంతానం లేనివారు అది భగవదిచ్ఛ అని ఊరుకోవడంలేదుకదా. సంతానం కావాలని ఎందుకు తాపత్రయ పడుతారు? సంతాన నిరోధం అంటే గర్భస్రావం కాదు. గర్భస్రావం అపాయకరం. అంతేకాక వారు అన్నట్టు పాపకార్యంకూడా. ఎందుకంటే ఒక ప్రాణం తీయడం కనక. గర్భోత్పత్తి కాకుండా ఉంటే ఒక ప్రాణం తీసినట్లు ఎలా అవుతుంది?

అలా నిరోధించడం కూడా ప్రకృతికి అడ్డు తగలడమే అని కొందరి అనుమానం. ప్రాణులను చంపడం ప్రకృతి లక్షణం. ఐతే ఆ చావు సాధ్యమైనంతవరకు కాకుండా మనం ప్రయత్నం చేయడం లేదా? రోగాలు కలిగించడం ప్రకృతి లక్షణం. మరి రోగాలు నివారించడానికీ, అవి వస్తే చికిత్స చేయడానికీ మనం పూనుకోవడం లేదా? వరదలు రావడం ప్రకృతి లక్షణం, ఐతే వరదల బీభత్సం తొలగించుకోడానికి మనం ఆనకట్టలు కట్టుకోవడం లేదూ?

ఈ కృత్రిమ సాధనాలు వాడడం ప్రకృతికి విరుద్ధమేమో అని కొందరి సందేహం. నాగరికత అలవరచుకొన్న మానవుడు పుట్టినది మొదలు చచ్చేవరకూ చేసే పనులు చాలావరకూ అసహజమైనవీ, ప్రకృతికి విరుద్ధమైనవీనూ. బట్టలు కట్టుకోవడం ప్రకృతికి విరుద్ధం. క్షౌరం చేసుకోవడం ప్రకృతికి విరుద్ధం. కార్లూ, ఎలక్ట్రిసిటీ ఉపయోగించడం ప్రకృతికి విరుద్ధం. పడవలో ప్రయాణించడం ప్రకృతికి విరుద్ధం. నిజానికి ఈదుకుంటూ వెళ్ళడం సహజం అనిపించుకొంటుంది. మేధావంతుడైన మానవుడు మొదటినుండి చేస్తూ ఉన్నపని ప్రకృతితో పోరాడడమే.

ఇవన్నీ ధర్మ విరుద్ధాలైన పనులని వాదించడానికి ప్రయత్నించేవారు కొందరు ఉన్నారు. ధర్మం అన్నది దేశకాల పరిస్థితులనుబట్టి మారుతూ ఉంటుంది. ఆడవాళ్ళ సంఖ్య విపరీతంగా పెరిగినప్పుడు ఒక పురుషుడు ముగ్గురు నలుగురు భార్యలను చేసుకోవడం ధర్మం అవుతుంది. లేకపోతే ఆ స్త్రీలకు గతి ఉండదు. స్త్రీ పురుషుల సంఖ్య సమానంగా ఉన్నప్పుడు బహుభర్తృత్వం కాని బహుభార్యాత్వం కాని అధర్మమే అవుతుంది.


ధారణా ద్ధర్మ ఇత్యాహు ర్ధర్మేణ విధృతాః ప్రజాః

అని మనుస్మృతి. ధారణ చేస్తుంది కనక ధర్మం అన్నారు. ధారణం అంటే ధరించడం. ప్రపంచాన్ని ధరించేది ధర్మం. ధారణ అంటే మేర, హద్దు. ప్రపంచాన్ని హద్దు దాటకుండా నడిపించేది ధర్మం. జనాభా హద్దుమీరి దాటిపోతూ ఉంటే దాన్ని అరికట్టకపోతే అది ధర్మం ఎలా అవుతుంది?

యతోభ్యుదయ నిశ్శ్రేయస సిద్ధిః స ధర్మః

దేనివల్ల అభ్యుదయము, మోక్షమూ కలుగుతాయో అది ధర్మం. కుటుంబాలను పరిమితం చేసుకోవడంవల్లనే అభ్యుదయం కలుగుతుంది, దుఃఖాలనుంచి మోక్షం (అంటే విడుదల) కలుగుతుంది. అందుచేత కుటుంబ నియంత్రణం ఈనాటి ధర్మం.

ఇది ధర్మం అని మనం గుర్తిస్తే తరవాత మనం చేయవలసిన పని చాలా సులభమే. కుటుంబ నియంత్రణ కేంద్రాలు ఉన్నాయి. ఆసుపత్రులు ఉన్నాయి. అక్కడ వారు మనకు అనుకూలమైన పద్ధతులు వివరిస్తారు. ఇద్దరు బిడ్డలైతే చాలు. ముగ్గురికి మాత్రం మించకుండా చూచుకోవాలి. ఇది మన కుటుంబాల శ్రేయస్సు. మన దేశంయొక్క శ్రేయస్సు. యావత్ప్రపంచానికీ శ్రేయస్సు. ★



కేంద్ర మంత్రి డా. చెన్నారెడ్డి సెప్టెంబరు 16న మెడ్చల్‌లో కుటుంబ నియంత్రణ శిబిరం ప్రారంభించారు.

యువత - నవత

గాంధీజీ-యువకులు

భారతీయ యువకులంటే గాంధీజీకి ప్రత్యేకంగా ప్రేమాభిమానాలు వుండేవి. యువజనుల భిన్న భిన్న జీవిత రంగాలలో ఆయన ప్రత్యక్షంగా, తలదూర్చి వారికి నిజమైన సహచరుడుగా, సానుభూతి పూర్వకమైన ఉపాధ్యాయుడుగా, సరియైన మార్గదర్శకుడుగా ప్రవర్తించారు.

తమ పౌర జీవితంలో నిత్యమూ ఆయన యువకులను ఉత్తమ జీవితాన్ని, ప్రయోజనకరమైన జీవితాన్ని గడపవలసిందిగా ఉద్బోధించారు. వారితో అన్ని విషయాలను గురించి చర్చించారు.

ఎక్కువగా ఆయన వ్యక్తిత్వ నిర్మాణానికి యువకులు అధిక ప్రాధాన్యత యివ్వడం అవసరమని నొక్కి చెప్పుతూవచ్చారు.

ఏ దేశానికైనా, ఏ వ్యక్తికైనా మొట్టమొదట కావలసినది వ్యక్తిత్వం అన్నారు గాంధీజీ. పుస్తకాలు చదివితేనూ, ఉపాధ్యాయులు చెప్పితేనూ వచ్చేది కాదిది. వ్యక్తి హృదయంలోంచి, అతని జీవితంలోంచి పుట్టుకొని వచ్చేది. అదే వ్యక్తిత్వం. వ్యక్తిత్వ నిర్మాణమే అన్నిటికన్నా ముఖ్యమైనది. అయితే ఆ వ్యక్తిత్వ నిర్మాణం సత్ప్రవర్తన అనే పునాదులమీద జరుగకపోతే చదివిన చదువంతా వృథా అని విద్యార్థులను హెచ్చరించారు గాంధీజీ. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు ప్రాణం అని గాంధీజీ నమ్మారు. విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే వున్నదనికూడా ఆయన విశ్వసించారు. నేటి విద్యార్థులే భావి భారత పౌరులు అన్నారు ఆయన. వారు మంచిని పరిరక్షించే యోధులు. చెడును సంఘ జీవితంనుంచి పారద్రోలే వీరులు.

విద్యార్థులు మనసా వాచా కర్మణా పరిశుద్ధులై వుండాలనీ, నిర్భీతిగా, సత్య సంధులై మెలగాలని ఆయన పేర్కొన్నారు.

ఎట్టి సందర్భంలోనూ అసత్యం పలుకవద్దు. ఎవరి మనసునూ కష్టపెట్టవద్దు. పరోక్షంలోనైనా ఎవరినిగురించీ చెడగా పలకవద్దు. వీటన్నిటినీ మించి నీకు నువ్వే విశ్వాస పాత్రుడుగా వుండడానికి ప్రయత్నించు. అప్పుడు యితరులుకూడా నీ మీ విశ్వాసం చూపుతారు—అన్నారు గాంధీజీ.

సంయమనము, క్రమశిక్షణ—యివే మనిషిని పశువునించి ప్రత్యేకిస్తున్నాయి. తోటి మానవులకు సేవచేయడమే మన జీవిత లక్ష్యం. అలాంటి మనం మన నడవడికను సత్ప్రవర్తనాయుతంగా చేసుకోకపోతే మనం చేసే ఏ పనికీ అర్థంలేదు అని గాంధీజీ ప్రవచించారు.

విద్యార్థులు ఆందోళనల్ని లేవదీయడం గాంధీజీకి సమ్మతం కాదు. "కార్మికుడు సమ్మెచేయడమే చాలా చెడది. విద్యార్థి సమ్మెచేయడం మరీ చెడ్డపని. ఎందుకంటే విద్యార్థులు కార్మికుల కన్న క్రమశిక్షణలో మెలుగుతున్నవారు. వారి కన్న చదువుకున్న వారు. విద్యార్థులు క్రమశిక్షణను విధిగా పాటించవలసినవారు కదా. అందువల్ల క్రమశిక్షణను పాటించవలసిన విద్యార్థులే సమ్మెలు, ఆందోళనలకు పూనుకుంటే వాటి ఫలితాలు చాలా విపరీతంగా. వుంటాయి. వీరి సమ్మెలను, ఆందోళనలను కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే సమర్థించగలం" అన్నారు గాంధీజీ.

"విద్యార్థులకు పార్టీ రాజకీయాలు తగవు. విద్యార్థుల్లో సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కాంగ్రెసువారు అని గ్రూపులులేవు. వారు కేవలం విద్యార్థులు మాత్రమే. విజ్ఞాన సముపార్జనే వారి లక్ష్యం. ఉద్యోగాలు సంపాదించుకోవడానికి కాక విజ్ఞానం సంపాదించుకుని తద్వారా సమాజానికి సేవజేయడమే విద్యార్థుల కర్తవ్యం." అని గాంధీజీ అనేక సందర్భాలలో స్పష్టంచేశారు, కొన్ని రాజకీయ పార్టీలు విద్యార్థులను రాజకీయాల్లోకి లాగడానికి ప్రయత్నిస్తుండడాన్ని ఆయన నిరసించారు.

కార్మిక కళ్యాణం

కార్మికరంగంలో స్నేహవాతావరణం

హైదరాబాదులోని ఆల్విన్ మెటల్ వర్క్స్, హైదరాబాదు ఏస్‌బెస్టాస్ సిమెంట్ ప్రొడక్ట్స్ లి,. లకు సంబంధించిన కార్మిక సంఘాలలో కార్మికుల మధ్య ఏర్పడ్డ విభేదాలను రూపుమాపి స్నేహ వాతావరణాన్ని కల్పించడానికి యిటీవల కొన్ని కొత్త ప్రయత్నాలు జరిగాయి. యూనియన్‌లో వారిలో వారికి తగువులు నెలకొని వుండడంవల్ల మొత్తం ఉత్పత్తే దెబ్బతింటున్నది. పై పెచ్చు అశాంతి పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి. ఈ విషయం ఎంత ఆందోళన కరమైన దంటే ముఖ్యమంత్రి స్వయంగా యీ విషయంలో జోక్యం కలిగించుకుని యూనియన్‌లోని యిరు పక్షాల వారితోను చర్చలు జరిపి, చివరకు ఆ యిరువురి అంగీకారంతో, కార్మిక నాయకుడిని ఎన్నుకునే విషయంలో రహస్యఓటింగు పద్ధతిని అనుసరించాలని నిశ్చయించారు. తదనుగుణంగా హైదరాబాదు ఆల్విన్ మెటల్ వర్క్సు ఆవరణలో 1967 సెప్టెంబరు 5వ తేదీన, హైదరాబాదు ఏస్‌బెస్టాస్ సిమెంట్ ప్రొడక్ట్స్ ఆవరణలో సెప్టెంబరు 23 వ తేదీన రహస్య ఓటింగు జరిపించారు. చాలా ప్రశాంతంగా ఓటింగు జరిగింది. 90 శాతం కార్మికులు వీటిలో పాల్గొన్నారు. లేబర్ కమీషనరు, తదితర అధికార్లు దీనిని నిర్వహించారు. ఎన్నిక ఫలితాలను అదేరోజున ప్రకటించారు.

కార్మిక సంఘంలో అంతర్గత వైషమ్యాలను తొలగించడానికి యీ పద్ధతి చాలా చక్కటి మార్గం. కార్మిక లోకంలో ప్రశాంత పరిస్థితులనూ, స్నేహ వాతావరణాన్నీ నెలకొల్పడానికి భవిష్యత్తులో అనుసరించ దగుమార్గం యిది. బేలట్ పేపర్ల ప్రచురణ, తదితర వాటికయ్యే ఖర్చుల్ని యూనియనే భరించింది. పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, రిటర్నింగ్ అధికారి అంటూ ఒకరిని ఏర్పాటు చేయడంవంటి సహాయాన్ని యజమానులు కల్పించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక పరిస్థితులు

సెప్టెంబరు నెలలో వస్త్రపరిశ్రమలో పనికి హాజరు కాని కార్మికులు 12.52 శాతం, ఇంజనీరింగు పరిశ్రమలో 12.48 శాతం, పొగాకు పరిశ్రమలో 11.93 శాతం, సిమెంటు పరిశ్రమలో 9.61 శాతం, కాగితం పరిశ్రమలో 11.16 శాతం వున్నారు.

ఈ నెలలో 52 పారిశ్రామిక ప్రమాదాలు సంభవించాయి, వీటిలో మరణాలు ఒక్కటీ లేవు.

ఈ నెలలో కార్మికులకు 1,91,268-80 లు నష్టపరిహారంగా చెల్లించడమైనది.

భారత కార్మిక సంఘాల చట్టంక్రింద నమోదు కావడానికై 14 కార్మిక సంఘాలు దరఖాస్తు చేశాయి. 11 సంఘాలను నమోదు చేయడం జరిగింది.

కార్మిక సంక్షేమ కేంద్రాలు

కార్మిక సంక్షేమ కేంద్రాలలో ఏర్పాటు చేయబడిన ఇండోర్ గేమ్‌లకు 15,790 మంది కార్మికులు, అవుట్ డోర్ గేమ్‌లకు 21,227 మంది కార్మికులు హాజరయ్యారు.

టైలరింగ్, కటింగ్ మొదలైన వాటిలో వృత్తి పనుల శిక్షకు రాండ్రు నిర్వహించిన శిక్షణ తరగతులకు 9,030 మంది మహిళలు హాజరయ్యారు. వీరు మొత్తం 6,393 వస్త్రాలను కుట్టారు. వీటివల్ల పరోక్షంగా రూ. 5175.19 రూపాయల మేరకు ఆర్థిక లాభం చేకూరింది.

ఎనిమిది కార్మిక సంక్షేమ కేంద్రాలలో 61 సినిమా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. వీటికి 25,140 మంది కార్మికులు హాజరయ్యారు.

వయోజన విద్యా తరగతులకు ఈ నెలలో 5,732 మంది కార్మికులు హాజరయ్యారు.

కార్మిక సంక్షేమ కేంద్రాలలో ఈ నెలలోకూడా నర్సరీ తరగతులు నిర్వహింప బడ్డాయి, వీటికి 6,230 మంది కార్మికుల పిల్లలు హాజరయ్యారు. ఈ కేంద్రాలలోని పఠనాలయాలకు, గ్రంథాలయాలకు ఈ నెలలో 10,528 మంది కార్మికులు హాజరయ్యారు.

కొద్దిమంది భారతీయులకు ప్రభుత్వోద్యోగాలు చేకూర్చటంతో కోట్లకొలదీ నిరుద్యోగులుగా ఉన్న భారతీయుల సమస్య పరిష్కారం కాదు. ప్రతివ్యక్తికీ ప్రభుత్వోద్యోగం చూపించటం ప్రభుత్వానికి అసాధ్యమైన పని. అర్హతలు లేనివారికి ఉద్యోగాలు యిస్తే దేశం పాడైపోతుంది. ఏదో వృత్తిలో ఉన్నవాళ్లందరూ తమ వృత్తులను సవ్యంగా చేసుకోవాలి. చేసిన పనిమీదనే ఉత్పత్తి ఆధారపడుతుంది కనుక, ఒక దేశ సౌభాగ్యం దానికి గల ఉత్పత్తి శక్తిమీద, సంపదను సవ్యంగా విభజించటంమీద ఆధారపడిఉంటుంది అందుకు వనకు అడ్డుగా ఉన్నవాటిని మనము తొలిగించుకోవాలి.

— జవహర్‌లాల్ నెహ్రూ

మహాభారతము

తెన్నెగంట్యుల లక్ష్మీశాస్త్రి

(సభాపర్వము)

13

మయసభా నిర్మాణము

"నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమం ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥"

భగవంతుడైన నారాయణుని, మనుష్యశ్రేష్ఠుడైన అర్జునుని, సరస్వతీదేవిని, వ్యాసమహామునిని నమస్కరించి మహాభారత (జయ) పఠనము చేయవలెను.

ఖాండవ దహనము తరువాత వైశంపాయన మహాముని జనమేజయ మహారాజునకు తరువాతి భారత కథను చెప్పుటకు ఉపక్రమించెను :—

అర్జునునిచేత ఖాండవ దహనమునుండి రక్షింపబడిన మయాసురుడు సంతుష్టుడై శ్రీకృష్ణుని సన్నిధిలో అర్జునునిగూర్చి యీ విధముగా మరి మరి ప్రార్థించెను;—

మయుడు;— అర్జునా! కోపావిష్టుడై చక్రము చేత సంహరింప బూనిన కృష్ణునినుండి, దహింపబూనిన అగ్నిదేవుని నుండి నన్ను కాపాడితివి. నీకు నేనేమి ప్రత్యుపకారము చేయుదునో చెప్పుము.

అర్జు;— మయా! నీవు ఈవిధముగా నాయెడల కృతజ్ఞత చూపి, నేను చేసిన ఉపకారమునకు పూర్తిగా ప్రత్యుపకారము చేసితివి. నీకు శుభమగుగాక, నీవు వెడలిపొమ్ము. నాపైన ప్రేమయుంచుము. నేను గూడ నీయెడల సర్వదా స్నేహముతో మెలగుచుందును.

మయు:— నీవంటి ఉదార పురుషునకు అర్హమైన మాట చెప్పితివి. కాని, అర్జునా! నేను మిక్కిలి ప్రేమతో నీకొరకు ఏమైన చేయదలచుచున్నాను. నేను దానవుల విశ్వకర్మను. శిల్ప విద్యలో గొప్ప పండితుడను. కనుక నేను నీకొరకు ఏదైన వస్తువును నిర్మించి యీయదలచుచున్నాను.

అర్జు:— మయాసురా! నీవు నాచేత ప్రాణాపాయ సంకటము నుండి రక్షింపబడితివి. కనుక నాకొరకు ఏమైన ప్రత్యుపకారము చేయదలచుచున్నావు. ఇట్టి పరిస్థితిలో నేను నీ నుండి యేపనిగూడ ఆశించగూడదు. కాని, నీ యీ సంకల్పము వ్యర్థమగుటకూడా నాకు యిష్టముగాదు. కావున భగవంతుడగు శ్రీకృష్ణునకు ఏదైన పనిచేసిపెట్టుము. దానివలన నీవు నాకు చేయవలసిన కర్తవ్యముగూడ నెరవేరినట్లుగా భావించెదను.

ఆమాటలు విని మయుడు శ్రీకృష్ణుని ప్రార్థించెను. ఆ భగవంతుడు 'ఇతనిచేత ఏపని చేయించవలెను'. అని ఒక క్షణము యోచించి యిట్లనెను:— "దానవశ్రేష్ఠా! నీకు ఏదైన చేయవలెనని మిక్కిలి అభిలాష యున్నచో ధర్మరాజు వైభవాదులకు తగిన ఉత్తమమైన సభ నొకదానిని నిర్మించి యిమ్ము. నీవు నిర్మించు సభను చూచి దానినిపోలు మరియొక భవనమును నిర్మించుటకు మానవుల కెవరికిని శక్యముకాని సభాభవనమును నిర్మించుము. ఆభవనములో, దేవతలు, రాక్షసులు, మానవులు చేయు శిల్పనిర్మాణ కౌశలము కనపడవలెను." ఆమాటలను అంగీకరించి మయుడు విమానముతో సమానమగు నొక శుభమైన సభాభవనమును ధర్మరాజు కొరకు నిర్మించదలచెను.

తరువాత కృష్ణార్జునులు సభానిర్మాణ వృత్తాంతమును యుధిష్ఠిరునకు తెలిపి మయునకు ఆ మహారాజు దర్శన మిప్పించిరి. యుధిష్ఠిరుడు మిగుల సంతసించి మయాసురుని సత్కరించెను. మయుడు సంతుష్టుడై మంచి శుభ ముహూర్తమున సభానిర్మాణమునకు పూనుకొనెను. అన్ని ఋతువుల వాతావరణమునకు నివాస యోగ్యముగా నుండు భవనమును నిర్మించుటకుగాను పదివేల మూరల వెడల్పు, పదివేల మూరల పొడవుగల భూమిని కొలిపించి ఆ చోట సభాభవన నిర్మాణమును ప్రారంభించెను.

శ్రీకృష్ణుడు ఖాండవప్రస్థ పురమునందు సుఖముగా కొన్నాళ్లు నివసించి పాండవులను వీడ్కొని ద్వారకాపురికి పోవుటకు తలపెట్టెను. ధర్మరాజునకు, మేనత్తయగు కుంతీదేవికి నమస్కరించి, చెల్లెలు సుభద్రను, ద్రౌపదిని సమాదరించి, ధౌమ్యాచార్యులకు నమస్కరించి, భీమాదులను ఆలింగన పూర్వకముగా ఆదరించి బయలుదేరెను. ఆయన రథముపైన యుధిష్ఠిరుడు ఎక్కి సారథియగు దారుకుని ప్రక్కకు జరిపి తాను సారథ్యము

చేయదొడగెను. అర్జునుడు స్వర్ణదండముగల చామరమును వీచెను. ఆవిధముగానే యితర పాండవులు, ఋత్విక్కులు, పౌరులు కృష్ణుని అనుసరించి పోయిరి. అప్పుడు ప్రియ శిష్యులతో చుట్టబడిన గురువువలె శ్రీకృష్ణుడు రథమునందు శోభిల్లెను. ఈవిధముగా అర్ధయోజన దూరము పోయిన తరువాత శ్రీకృష్ణుడు వారినందరిని తిరిగి పొండని చెప్పి వీడ్కొని, తిరిగి వచ్చెదనని వారితో చెప్పి వెడలిపోయెను. పాండవులు కనుచూపు మేరవరకు శ్రీకృష్ణుని చూచుచు నిల్చబడి తిరిగిపోయిరి. కాని వారి మనస్సులు మాత్రము శ్రీకృష్ణుని అనుసరించియే పోయెను. కృష్ణుడు ద్వారకాపు నిచేరుకొనెను.

ఇంద్రప్రస్థపురమునందు మయుడుసర్వరత్న విభూషితమైన సభను ధర్మరాజు కొరకు నిర్మించెను. 'నేనొక చోటికి పోయి తిరిగి త్వరగానే వచ్చెదను, ఆజ్ఞ నిమ్ము' అని మయుడు అర్జునుని కోరెను. తానుపోవు స్థలముయొక్క విశేషము నీవిధముగా మయుడు అర్జునకు చెప్పెను:—

"పూర్వ కాలమునందు రాక్షసులు కైలాస పర్వతమునకు ఉత్తర దిశలోనున్న మైనాక పర్వతమునందు యజ్ఞమును చేయదలచు చుండిరి. అప్పుడు నేను విచిత్రము, రమణీయమునైన యొకరత్న భాండమును తయారు చేసియుంటిని. ఆ భాండమును బిందు సరస్సు సమీపమునందున్న వృషపర్వుడను రాక్షస రాజు యొక్క సభలో ఉంచి యుంటిని. ఇప్పుడు అది అక్కడనే యుండినచో దానిని తీసికొని వచ్చెదను. దానితోనే యీ సభా నిర్మాణమును పూర్తి చేసెదను. ఇది గాక, బిందు సరస్సునందు మనస్సునకు ఆనందమును కలిగించునట్టి సర్వరత్న విభూషితమైన యొక ఉగ్రమైన గదయున్నది. వృషపర్వుడు ఆ గదతో శత్రు సంహారమును చేసి అచ్చటనే దానిని ఉంచి యుండునని తలచెదను. ఆ గద, ఒక లక్షగదిలతో సమానము. శత్రు సంహారకమగు ఆ గద భీమసేనునకు అర్హమై యున్నది. నీకు గాండీవము వలెనే అతనికి ఆ గద సమస్త శత్రు సంహారమునందు మిగుల నుపయోగ పడగలదు. అచ్చటనే వరుణ దేవునియొక్క 'దేవదత్తము' అను శంఖముగూడ నున్నది, ధాని ధ్వని చాల పెద్దది. అట్టి శంఖమునుగూడ తెచ్చి నీ కిచ్చెదను."

అని చెప్పి మయాసురుడు అచటి నుండి ఈశాన్య దిక్కునకు ప్రయాణమై వెడలెను. అక్కడ కైలాసమునకు ఉత్తరముగా నున్న మైనాక పర్వతమును చేరెను. ఆ పర్వతమునకు బంగారపు శృంగములుగలవు. అచ్చట రమ్యమైన బిందు సరస్సు గలదు. ఆ సరస్సునందే పూర్వము భగీరథుడు గంగానది దర్శనము కొరకు అనేక సంవత్సరములు ఘోరమైన తపస్సు చేయుచు నుండెను. అచ్చటనే పూర్వము బ్రహ్మదేవుడు నూరు యజ్ఞములు భూతతృప్తికై చేసెను. ఇంద్రుడు గూడ యజ్ఞములు చేసి యిచట కార్య సిద్ధి నందెను. అక్కడ భూత పతియైన పరమ శివుడు నివసించి యుండెను. సహస్రయుగములు గడచిన తరువాత అక్కడ నర నారాయణులు, బ్రహ్మ, యముడు మొదలగువారు యజ్ఞానుష్ఠానమును చేసెదరు. అట్టి బిందు సరస్సు కడకు పోయి మయాసురుడు రత్నభాండమును, గదను, శంఖమును, సభా నిర్మాణమునకు ఆవశ్యకములగు స్ఫటికమణిద్రవ్యములను తీసికొనెను. వాటిని వృషపర్వుని కింకరులు కాపాడు చుండిరి. వారి నందరిని తొలగించి మయుడా సర్వద్రవ్యములను గ్రహించెను. వాటిని తెచ్చి అసమానమైన సభను ధర్మరాజు కొరకు నిర్మించుటకు ప్రారంభించెను. ఆ గదను భీమసేనున కిచ్చెను. దేవదత్త శంఖమును అర్జునునకిచ్చెను.

ఆ సభలో బంగారపు చెట్లు నిర్మించెను. ఆ సభా తేజస్సు సూర్యునితేజస్సునుగూడ తిరస్కరించు చుండెను. మూడు లోకములలోగూడ దానికి ఈడైన సభ లేకుండెను. ఆ సభను మయుని యాజ్ఞచేత ఎనిమిది వేల కింకరులు అను రాక్షసులు కాపాడుచుండిరి. ఆ సభా మధ్యమునందు మయుడొక కమల పుష్కరిణిని నిర్మించెను. అందులో మయుడు ఇంద్ర నీల మణిమయ పత్రములు గలిగి, వివిధ మణులచే నిర్మితములగు కాడలు కలిగి అందముగా వికసించు చున్న కమలములను నిర్మించి యుంచెను. అనేక పక్షులను, కమలములను, తాబేళ్లను, చేపలను బంగారముతో నిర్మించి సజీవములాయన్నంత మనోహరముగా నుంచెను. స్ఫటికమణిసోపానములు నిర్మించెను. పంకరహితమైన స్వచ్ఛజలములు అందు సర్వదాఉండునట్లు చేసెను. అంతమనోహరముగా నున్న ఆసరస్సును కొందరు రాజులు చూచికూడ అది కొలను అని తెలియక దానిలో పడునట్లు ఉండెను. ఆసభ చుట్టున్న వివిధ పుష్పఫల శోభితములైన వృక్షములు ఉండెను. హంసాదులగు జలచరములచే శోభిల్లుచుండెను. ఆ భవనముపైనుండి వీచుగాలి పాండవులను తృప్తిపరచు చుండెను. ఇట్లు మనోహరము, అద్భుతమునగు సభను మయుడు పదునాల్గునెలలలో నిర్మించి ధర్మరాజునకు సమర్పించెను.

సభానిర్మాణానంతరము మయుడు అర్జునునితో నిట్లనెను:— "ఈ సభా భవనముపైన ఒక ధ్వజము ఉండును. దాని యగ్రభాగమునందు సమస్త భూతములు, కింకరులు అను రాక్షసులు ఉందురు. నీవు ధనుష్టంకారమును చేసినప్పుడు ఆ భూతములుగూడ మేఘములవలె గర్జించగలవు. అగ్నిదేవుని యీ రథము, దివ్యములగు శ్వేతాశ్వములు, వానరచిహ్నముతో గూడిన యీ ధ్వజము ఇవన్నియు నా మాయచేత నిర్మితములై యున్నవి. ఈధ్వజము సర్వదా అగ్నిజ్వాలవలె ఊర్ధ్వభాగమునకే యెగురుచు ప్రకాశించుచుండును. యుద్ధములోనిది యెప్పుడుగూడ క్రిందకు వాలదు." అని చెప్పి మయుడు అర్జునుని ఆలింగనము చేసికొని వాటిని అతనికి ఇచ్చి అతనిని వీడ్కొని యథేష్టముగా పోయెను.

తరువాత ఆ సభాభవనములో ధర్మరాజు సపరివారముగా ప్రవేశించి గొప్ప ఉత్సవములు బ్రాహ్మణ భోజనములు చేసెను. వారికి వస్త్రములు, ధనధాన్యములు, మణికనకములు ఇచ్చి సత్కరించెను. ఈ విధముగా చేసి ఆ సభలో ధర్మరాజు తమ్ములతో ఇంద్రుడు ఇంద్ర భవనమునందువలె నివసించునుండెను. ఆ సభలో అసిత-దేవలాదులైన అనేక మునులు వివిధ విచిత్ర కథలను చెప్పుచు, ముంజకేతువు మొదలైనరాజులు, కాలకేయాదులైన రాక్షసులు సహాయముచేయుచు పాండవులను కొలుచుచునుండిరి. ఆ సభలోనే అర్జునుని ఆశ్రయించి అనేక రాజపుత్రులు,

యదువృష్ణినందనులు ధనుర్విద్యను నేర్చుకొనుచుండిరి. ఇరువది యేడుగురు చిత్రసేనాదులైన గంధర్వులు పాండవులను ఉపాసించుచు నుండిరి. తుంబురునితోగూడ అనేక కిన్నరులు గీత వాద్యములతో గానములు, నృత్యములు సలుపుచు పాండవులను ఆనందపరచుచుండిరి. దేవతలు బ్రహ్మనువలె ధర్మరాజును సేవించుచు వారందరు నాసభా భవనములో నుండిరి.

ఒకనాడు ఆ సభా భవనములో సపరివారముగా ధర్మరాజు కొలువుదీరి యున్నప్పుడు అక్కడికి నారద మహాముని వచ్చెను.

సర్వవేద వేదాంగ పారగుడును, చతుర్వర్గ తత్వవేత్తయు సమస్తలోక రహస్య విదుడునగు నారద మహాముని సమస్త లోకములను జూచుచు మయసభకు వచ్చెను. మంగళాశీర్వాదములచేత పాండవులను ఆశీర్వదించెను. నారదునకు ధర్మరాజు తమ్ములతో నమస్కరించి ప్రత్యుత్థానముచేసి అతనిని యథావిధిగా అర్ఘ్యపాద్యాదులతో పూజించెను. పూజితుడైన నారదుడు మిగుల సంతుష్టుడై ఈ క్రిందివిధముగా ధర్మరాజును ప్రశ్నించెను.

"మీ ధనము నీవు చేయు ధర్మకార్యములకు సరిపోవునా? నీయిచ్ఛానుసారముగా సుఖములు నీకు కలుగుచున్నవా? పూర్వుల ధర్మమార్గమునందు సంచరించుచుంటివా? ధర్మము, అర్థము ఈ రెండును ఒండొంటికి సహకారములుగా ఉపయోగించుచుంటివా? ధర్మార్థకామములను సక్రమముగా సేవించుచుంటివా? నీరాజ్యమందలి ధనవంతులు దుర్వ్యసనములకు లోనుగాకుండ చూచుచుంటివా? నీ మంత్రులు, సేవకులు, నీ రహస్యములను శత్రువులకు తెలుపకుండ కాపాడుచుండిరా? మీ ప్రజలలో మిత్రులెవరు? ఉదాసీనులెవరు? శత్రువులెవరు? కనిపెట్టుచుంటివా? మీకు విశ్వసనీయులు, వయోవృద్ధులు, నిష్కపటులు, ఉత్తమకులజులు, నీయందు అనురాగము కలవారునైన మంత్రులు ఉన్నారా? మంచి మంత్రులవలననే రాజ్య కార్య నిర్వహణము రాజ్యరక్షణము కలుగును గదా! అసమయములో నిద్రించకుండ సుసమయమునందు మేల్కొనుచుంటివికదా! అనేక మూర్ఖులను వదలి ఒక పండితునైన ఆదరించుచుంటివా? పండితులేకదా సంకటకాలమునందు సహాయము చేయుదురు. మంచి మంత్రులు, మంచి విద్వాంసులు, రాజ్యమును, సంపదలను కూర్తురు. నీకు సత్కుల సంజాతుడైన పురోహితుడున్నాడా? ఈ రాజ్యమునందు విద్య గరపువారు సమస్త శాస్త్రజ్ఞులు, సత్కుల సంజాతులు ఉన్నారా? నీకు మంచి సేనాపతి ఉన్నాడా? సైనికులకు వేతనములను బత్తెములను సకాలమునకు ఇచ్చుచుంటివా? అట్లు ఇవ్వకున్నచో నీకు నీరాజ్యములోనివారు గొప్పముప్పును చేకూర్తురు. నీ హితముకోరినవారి కుటుంబమును కాపాడుచుంటివా? నీ చేత జయింపబడి, నీ శరణువేడిన శత్రువును కాపాడుచుంటివా? ప్రజలను తల్లిదండ్రులవలె కాపాడుచుంటివా? శత్రు రాజ్యములో ముఖ్యులను ధనముచేత మభ్యపరచుచుంటివా? నీవు ఇంద్రియ జయమును సాధించి జితేంద్రియులుకాని శత్రువులను జయించుచుంటివా? నీ ధనములలో నీవ్యయమునకు పోగా మిగిలిన దానిని కాపాడుచుంటివా? పేదతనమును అనుభవించుచున్న బంధువులను, ప్రజలను, విద్వాంసులను కాపాడుచుంటివా? ఉద్యోగులు సక్రమముగా పనిచేయుచున్నారా? నీ హితముగోరి శ్రద్ధగా సామర్థ్యముతో పనిచేయు ఉద్యోగులను ఉద్యోగమునుండి తొలగింపకుంటివికదా! అర్హతానర్హతలనుబట్టి వ్యక్తులకు పనులను ఒప్పగించుచుంటివికదా! నీ రాజ్యములో రైతులు సంతుష్టులుగా నున్నారా? వారికి బత్తెములు వేతనములు ఇచ్చుచున్నావా? అనుకూలమైన వడ్డీలతో వారికి అప్పులను ఇచ్చుచుంటివికదా! నీరాజ్యమునందు, కృషి, గోరక్షణము, వ్యాపారము చక్కగ సాగుచున్నవా? ప్రతి గ్రామమునందును సమర్థులు, బుద్ధిమంతులునైన ఐదుగురు పంచాయతీ సంఘముగా చేరి ప్రజాహిత కార్యములను చేయు నేర్పాటు చేసితివా? నగర రక్షణము, గ్రామముల రక్షణములపైననే ఆధారపడి యుండును కనుక గ్రామ రక్షణమును సక్రమముగా జరుపుచుంటివా? సరిహద్దు గ్రామములవారు నీకు సరిగా పన్నులను చెల్లించుచుండిరా? స్త్రీలకు రహస్యములు వెలిబుచ్చకుంటివి కదా! ప్రజల కష్టములను తెలిసికూడ వాటిని దూరముచేయక నీవు భోగలాలసుడవై అంతఃపురములో సుఖముగా శయనించకుంటివి కదా! రాత్రినాలుగవ జామున మేల్కొని ధర్మమును, అర్థమును చింతించుచుంటివికదా! సకాలమున కొలువు దీరియుండి ప్రజల మొరలను వినుచుంటివికదా! నీ శరీర రక్షకులను సరియైన వారిని నియుక్తుల గావించుకుంటివా?. దుష్టశిక్షణము, శిష్టరక్షణము సరిగా జరుపుచుంటివా! ఔషధములను సేవించి శరీర రోగములను పోగొట్టుకొనుచుంటివికదా! వృద్ధసేవనము చేయుచుంటివికదా? హితులైన మంచివైద్యులను చేకూర్చుకొంటివా? శత్రువులకు లోబడి నీకు అపకారము చేయుచున్న నీ ప్రజలను విడిచిపెట్టుచుంటివికదా! సామంత రాజులు నీ కొరకు ప్రాణముల నర్పించువారుగా నున్నారా? సమస్తవిద్యలను, విద్యావంతులైన బ్రాహ్మణులను ఆదరించుచుంటివా? నీ పూర్వుల సద్ధర్మమును నీ వాచరించుచుంటివికదా ! దేవతలను, దేవాలయములను సేవించుచుంటివా? క్రోధ, శోకములకు లోను కాకుంటివి కదా ! నీ బుద్ధి ధర్మకార్యములందే లగ్నమై యున్నదికదా! ఇట్టి గుణముల చేకూడినవాని రాజ్యము ఎన్నటికిని నశించదు. అట్టి రాజు పరిపూర్ణముగా సుఖించును.

దుష్టబుద్ధిగల నీ మంత్రులు సజ్జనులపై నేరములను మోపి వారలను హింసించరుకదా! ధనలోభముచేత దొంగలను, అపకారులను, నీ మంత్రులు విడిచిపుచ్చరుకదా! నీవు నాస్తికతను, అసత్యమును, క్రోధమును, పొరపాటును, సోమరితనమును, ఇంద్రియలోలత్వమును, మూర్ఖుల సమావేశమును విడిచి రహస్య రక్షణములు చేయుచు నీ రాజ్యమునందు మంగళకరమైన ఉత్సవములను చేయుచుంటివికదా! పై గుణములుగల రాజు యొక్క రాజ్యము గట్టిగా నిలుచును. నీ వేదములు, ధనము, స్త్రీలు, శాస్త్రజ్ఞానము, సఫలములుగనున్నవా" అని నారదుడు ప్రశ్నించెను. అది విని యుధిష్ఠిరుడు నారదునితో నిట్లనెను:— "వేదములు, ధనము, స్త్రీలు, శాస్త్రము, జ్ఞానము, సఫలములు, ఎట్లగును? మహాత్మా! తెలుపుము," అన నారదుడు ఇట్లు బదులు చెప్పెను:—

యజ్ఞహోమాదులచేత వేదములు, దానభోగములచేత ధనములు, రతి మరియు పుత్ర ప్రాప్తిచేత భార్యలు, శీలము, సదాచారముచేత శాస్త్రజ్ఞానము సఫలములగును.

నారదుడు మరల ఈ క్రింది విధముగా ధర్మరాజును ప్రశ్నించుట కారంభించెను:– సేకరించు నీ యుద్యోగులు ఇతర దేశములనుండి వచ్చిన వ్యాపారులను ధనలోభముచేత విడిచి పుచ్చుటలేదు కదా! నీ వస్తువులను సరియైన వెలకు విక్రయించి ధనములను నీ వ్యాపారులు నీకు ఇచ్చుచుండిరా? వృద్ధులనుండి ధర్మమును, అర్థశాస్త్రమునుండి అర్థతంత్రమును తెలిసి కొనుచుంటివా? నీవు ఇతరుల ఉపకారమును కనిపెట్టి వారిని ప్రశంసించి నిండు సభలో సత్కరించుచుంటివా? అగ్నిభయము, సర్పభయము రోగభయము, రాక్షస భయమున్ను లేకుండ రాష్ట్రమును కాపాడుచుంటివికదా! అంధులను, మూకులను, కుంటివారిని, అంగవికలులను దిక్కులేని అనాథులను, సన్యాసులను నీ రాష్ట్రమునందు తండ్రివలె నీవు కాపాడుచుంటివా? నిద్ర, సోమరితనము, భయము, క్రూరత్వము, జాగుచేయుట ఈ ఆరు దోషములను విడిచి మెలగుచుంటివికదా! అని ప్రశ్నించెను

నారదుని ప్రశ్నములను విని ధర్మరాజు ఆ మునీశ్వరునకు సమస్కరించి "మహాత్మా! నీ ఉపదేశముల ప్రకారమే మెలగుచుండెదను. మీరు చేసిన ఈ ఉపదేశముచేత నాబుద్ధికి మిగుల వికాసము ఏర్పడెను" అని చెప్పెను. ఆ మాటలువిని నారదుడు సంతుష్టుడై "ఈ విధముగ మెలగుచు నాలుగు జాతులవారిని రక్షించుచునుండు రాజు ఈ లోకమునందు సమస్త సుఖములను అనుభవించి పరలోకమునందు ఇంద్రవైభవమును అనుభవించగలడు," అని చెప్పెను.

నారదమహాముని యుపదేశములను విని యుధిష్ఠిరుడు 'మహాత్మా! మీరు చెప్పిన ధర్మములన్నియు యథాశక్తిగా మే మనుష్ఠించుచుండెదము. పూర్వరాజులు అనుసరించిన ధర్మమార్గమునే మేముగూడ అవలంబించ దలచుచున్నాము. కాని, అది మాకుసాధ్యమా! అని మాత్రము సంశయించుచుంటిని. మహాత్మా మీరు సమస్తలోకములో సంచరించుచుందురు. ఇప్పుడు మేము మయునిచేత నిర్మింపజేసిన సభవంటి సభనుగాని, దీనికంటెమించిన సభనుగాని యేలోకమునందైనను చూచితిరా?" అని ప్రశ్నించెను. దానికి నారదుడిట్లు బదులుచెప్పెను:–" నీవు నిర్మింపజేసినట్టి మణిమయమైన యీసభవంటి సభను మనుష్యలోకములో నెక్కడను నేను చూడలేదు. నీవు వినదలచినచో సమస్తలోక పాలుర సభలను గూర్చి వర్ణించి చెప్పెదను. వినుము." ఆమాటవిని యుధిష్ఠిరుడు, 'మహాత్మా! ఆసభలు ఏద్రవ్యములచేత ఎట్లు నిర్మింపబడినవో చెప్పుడు. వినుటకు కౌతూహలముగల వారమైయున్నాము." అని యడిగెను. ఆమాటకు నారదుడు క్రమముగా నిట్లు ఇంద్రాదుల సభలను వర్ణింప దొడగెను:–

ఇంద్ర సభావర్ణనము

విశ్వకర్మ ఇంద్రునకు మిక్కిలి ప్రకాశవంతమైన యొక సభను నిర్మించి యిచ్చెను. అది నూటయేబది యోజనముల పొడవు, నూరుయోజనముల వెడల్పు, ఐదు యోజనముల యెత్తు గలిగియున్నది. అది యెప్పుడును ప్రాతబడదు. అందులో నివసించువారికి ముసలితనము, రోగములురావు. అనేక పుష్పఫల వృక్షములచేత చుట్టబడి సుందరముగా నుండును. అక్కడ దేవేంద్రుడు శచీదేవితో సమస్తదేవగణములచేత సేవింపబడుచునుండును. అచట దేవర్షి, రాజర్షి, బ్రహ్మర్షిగణములు సర్వదా సన్నిహితులై యుందురు. నృత్యగీతములు చేయుచు అప్సరస్త్రీలు సేవించుచుందురు. ఏమంజూలచేత అలంకృతమైన ఇంద్ర సభను చూచినాను.

యమ సభావర్ణనము

యమసభనుగూడ విశ్వకర్మయే నిర్మించెను. అదిగూడ చాల వైశాల్యము, ఎత్తు, పొడవుగలదియై మిక్కిలి ప్రకాశించుచుండును. అక్కడ శోకము, ముసలితనము, ఆకలిదప్పులు, దైన్యము, శ్రమ యివియేవియు నుండవు మిక్కిలి అనుకూలముగ నుండును. కోరినవస్తువులన్నియు నచట సులభములు. అనేక రాజులు, ఋషులు యమరాజును సేవించుచునుందురు. చాల కాలము తపస్సుచేసి విశ్వకర్మ ఆసభను నిర్మించెను.

వరుణ సభావర్ణనము

వరుణ సభగూడ యమసభవలె విశాలమై విరాజిల్లుచుండును వరుణుడు జలదేవతగనుక ఆయిల్లు నీటిలోపలనిర్మింపబడెను. అన్ని సౌకర్యములు వైభవములు అచ్చటగలవు. వివిధవర్ణములు గల లతలు శోభిల్లుచుండును. ఆసభ శీతోష్ణములకు అనుకూలమై సుఖస్పర్శగలదిగనుండును. అందు వరుణుడు వారుణీదేవితో దివ్య భూషణాంబరములను ధరించియుండును. జలరాజైన వరుణుని అనేక సర్పరాజులు, రాక్షసరాజులు సేవించుచుందురు. అనేక సముద్రములు, మహానదులు, ఉపనదులు, గీతవాద్యములతో గంధర్వులు, అప్సరసలు, మహామంత్రి సునాభుడు వరుణుని సేవించుచుందురు.

కుబేర సభావర్ణనము

కుబేర సభగూడ పూర్వసభలవలె వైశాల్యముగలదై యున్నది. కైలాస శిఖరమువలె భాసురమై భాసిల్లుచుండును. అనేక గుహ్యకులు, యక్షులు ఆయక్షేశ్వరుని సేవించుచుందురు. విచిత్రాభరణాంబరభూషితుడై కుబేరుడా సభలో స్త్రీసహస్రములచేత విహరించుచునుండును. అనేక దేవాంగనలు నృత్యగీతములచేత అతనికి వినోదమును గలిగించుచుందురు. సర్వదా లక్ష్మియచట తాండవమాడుచుండును. భగవంతుడైన పరమశివుడు సమస్తభూత గణ సంఘములతో నచటనుండును. శంఖుడు, పద్ముడు అనువారు నవనిధులతో సర్వదా ఆసభలో కుబేరుని సేవించుచుందురు.

(సశేషము)

స్వతంత్ర భారతదేశంలో

మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలు

మహిళలు, బాలల విషయంలో అవసరమైన మేరకు సరియైన శ్రద్ధవహించనిదే నిజమైన, సుస్థిరమైన శ్రేయో రాజ్యస్థాపన సాధ్యం కాదు. మహిళా, శిశు సంక్షేమం దేశ పునర్నిర్మాణానికి, జాతి ఔన్నత్య సాధనకూ ప్రాతిపదిక. కనుకనే ఈ విషయం మన రాజ్యాంగచట్టంలో సముంగా గుర్తించడం జరిగింది.

భారత రాజ్యాంగ చట్టం ఉపోద్ఘాతంలో దేశంలో పౌరులందరికీకూడా సాంఘిక, ఆర్థిక న్యాయం, సమానత్వం సాధించడం జరుగుతుందనీ, అందరికీ సమానావకాశాలు కల్పిస్తారనీ, వ్యక్తిగత గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలుగనీయరనీ స్పష్టీకరించబడింది. కాగా ప్రభుత్వ విధానం తాలూకు ఆదేశ సూత్రాలలో మహిళలు, బాలలు, సంఘంలో ఇతర బలహీన వర్గాల ప్రజలకు రక్షణకల్పించేందుకు ప్రత్యేకమైన శ్రద్ధవహించడం జరుగుతుందని తెలియచేయబడింది.

స్వాతంత్ర్య భానూదయానికి చాలా ముందుగానే దేశంలో రాజకీయ స్వాతంత్ర్య సాధనకు పూర్వం తప్పనిసరిగా, అనివార్యంగా స్త్రీ స్వాతంత్ర్యం సాధించాలనీ, తద్వారా సంఘసంస్కరణకు పూనుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని గుర్తించడం జరిగింది. ఈ రంగంలో ప్రారంభంలో అత్యంత ప్రతికూల పరిస్థితులలో రాజా రామమోహన్‌రాయ్, కేశవచంద్రశేన్, పండిత రామాభాయ్ ప్రభృతులు అపూర్వమైన కృషిచేసి ముందుతరాల వారికి మార్గదర్శకులయ్యారు. భారత స్త్రీ స్వాతంత్ర్యోద్యమానికి గాంధీమహాత్ముడు ప్రాణంపోశారు. ఆయన ఈ ఉద్యమానికి నూతనోత్సాహం కల్పించారు. స్వాతంత్ర్య సముపార్జనకై సమాయత్తమై ఆయన పూరించిన శంఖారావం భారత ప్రజల హృదయాంతరాళాలలో మారుమ్రోగింది. ఆయన పిలుపు అందుకొని అనేకమంది భారత మహిళలు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడానికి సన్నద్ధులయ్యారు. మరికొందరు జాతి పునర్నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించడానికి పూనుకొన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే దేశ విభజన ఫలితంగా సర్వస్వం కోల్పోయి పాకిస్తాన్‌నుంచి కట్టుబట్టలతో కాందిశీకులుగా వచ్చిన అభాగ్య స్త్రీలకు పునరావాసం కల్పించడంతోపాటు దేశంలో స్త్రీలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించడానికి సంబంధించిన బృహత్తరమైన సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. యావద్భారత జాతి పునరుజ్జీవనం భారతీయ మహిళాజన పునరుజ్జీవనంతో ముడిపడి ఉన్నదని గుర్తించడం జరిగింది.

ఈ సమస్య మూలకారణాలు తెలుసుకొని పరిష్కారానికి పూనుకోవాలని నిర్ణయించబడింది. ప్రథమ పంచవర్ష ప్రణాళికారంభంలో ఈ రంగంలో స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ సహాయ సహకారాలతో ప్రముఖమైన పాత్రవహించాలని ఉద్దేశించబడింది. స్వచ్ఛంద సంస్థల వనరులు పరిమితంగా ఉండడం చేత వివిధానేక సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వమే స్వయంగా అమలు జరపవలసి ఉన్నదనికూడా గుర్తించడం జరిగింది. వివిధ కార్యక్రమాల నిమిత్తం ప్రథమ ప్రణాళికా కాలంలో స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థలకు సహాయక గ్రాంట్ల క్రింద రూ.4 కోట్లు మొత్తం మంజూరు చేశారు. ప్రథమ ప్రణాళికా కాలంలో దేశంలో ప్రతి జిల్లాలోనూ సంక్షేమ విస్తరణ పథకాలు ప్రారంభించారు. ఆయా సంస్థలకు కేంద్రప్రభుత్వం కేంద్ర సాంఘిక సంక్షేమ మండలిద్వారా సహాయం అందచేసింది. 660 మహిళా సంక్షేమ సంస్థలు, 691 శిశుసంక్షేమ సంస్థలు, అశక్తులైన వారికోసం, మాజీ నేరస్థులకోసం ఏర్పాటైన 150 సంస్థలు, ఇతర సంక్షేమ సంస్థలు ఈ విధంగా కేంద్రంనుంచి ఆర్థికసహాయం సంపాదించాయి. తర్వాత ద్వితీయ ప్రణాళికా కాలంలో సాంఘిక, సంక్షేమ కార్యక్రమాలకు రూ. 15 కోట్లు కేటాయించారు.

ప్రథమ ప్రణాళికా కాలంలో ఈ రంగంలో కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సంఖ్య షుమారు 2,200 మాత్రమే ఉండగా ద్వితీయ ప్రణాళికా కాలంలో వీటి సంఖ్య 6,000కు పెరిగింది. ప్రథమ, ద్వితీయ ప్రణాళికల మధ్యకాలంలో

మహిళా సంక్షేమ సంస్థల సంఖ్య 660 నుండి 2,900 కు, శిశు సంక్షేమ సంస్థల సంఖ్య 591 నుంచి 2,400 కు పెరిగింది. ప్రథమ, ద్వితీయ ప్రణాళికా కాలంలోకంటె తృతీయ ప్రణాళికా కాలంలో ఈ రంగంలో శీఘ్ర అభివృద్ధి సాధించబడింది. మహిళా సంక్షేమంతోపాటు శిశుసంక్షేమాభివృద్ధికై తీవ్ర కృషి జరిగింది. పిల్లల పెంపకం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రదర్శన పూర్వకంగా వివరించేందుకు 17 పథకాలు ప్రారంభించారు. తృతీయ ప్రణాళికా కాలంలో ఈ పథకాల అమలు నిమిత్తం దాదాపు రూ. 40 లక్షలు వ్యయం అయ్యింది. బడికివెళ్ళే వయసురాని పిల్లల సంక్షేమాభివృద్ధి నిమిత్తం బాలవాడీలు — బాలల సంక్షేమ కేంద్రాలు అనేకం ఏర్పాటు అయ్యాయి. ఈ కేంద్రాల నిర్వహణకై బాల సేవికలకు 1961–62లో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. పట్టణ, గ్రామ ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాయి. తృతీయ ప్రణాళికా కాలములో పట్టణ ప్రాంతాల నిమిత్తం శిక్షణ నిమిత్తం శిక్షణ పొందిన 1,361 మంది బాల సేవికలలో 1,123 మందికి ఉద్యోగాలు లభించాయి. 1963 డిసెంబరు 31 వరకు 551 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాల నిమిత్తం షుమారు 17 లక్షలు ఖర్చు అయ్యింది.

తృతీయ ప్రణాళికా కాలంలో 296 మంది బాల సేవికలు దీర్ఘ కాలిక శిక్షణ, 189 మంది స్వల్పకాలిక శిక్షణ పూర్తి చేశారు. మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివిధ సంస్థలకు తృతీయ ప్రణాళికా కాలంలో షుమారు రూ. 104.67 లక్షల మొత్తం సహాయంగా ఇవ్వడం జరిగింది. పిల్లల కోసం 610 విశ్రాంతి గృహాలుకూడా నిర్మించారు. అంతేకాక బాలలు నేరాలు చేయ్యకుండా నివారించడానికి అమలు జరిపిన కార్యక్రమాల నిమిత్తం తృతీయ ప్రణాళికా కాలంలో రూ. 148 లక్షలు కేటాయించారు. బాలనేరస్థులను సక్రమమార్గానికి దిద్దేందుకు ప్రత్యేక పాఠశాలలు, హాస్టల్ వసతి గృహాలు ఏర్పాటు చేశారు. శారీరకంగా, మానసికముగా వైకల్యం అలవడిన బాలల విద్యావ్యాప్తికి ప్రభుత్వం మొదటినుంచి గట్టి కృషి చేసింది. తృతీయ ప్రణాళికా కాలంలో వీరికోసం ఉద్దేశించిన కార్యక్రమాల అమలు నిమిత్తం దాదాపు నాలుగు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. వికలాంగులకు ఉపాధి కల్పించడానికి తోడ్పడే కార్యాలయాల ద్వారా 4,000 మందికి ఉద్యోగాలు లభించాయి. అంధబాలలకు చదువు చెప్పేందుకుగాను ఢిల్లీ, బొంబాయి, పశ్చిమబెంగాలులోని నరేంద్రపూర్ లలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలలో, కళాశాలలో సాంకేతిక, వృత్తి విద్యాశిక్షణ కళాశాలలలో చదువుకోడానికి 1,976 మంది అంధ బాలలకు, చెవిటి పిల్లలకు, వికలాంగులకు తృతీయ ప్రణాళికా కాలంలో స్కాలర్ షిప్పులు ఇచ్చారు.

గ్రామ ప్రాంతాలలో మహిళా శిశు సంక్షేమాభివృద్ధి నిమిత్తం చతుర్థ ప్రణాళికా కాలంలో కుటుంబ, శిశు సంక్షేమ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. వెనుకబడిన తరగతులకు చెందినవారి పిల్లల సంక్షేమాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. వీరికోసం ఆశ్రమ పాఠశాలలు హాస్టలు సౌకర్యాలుగల పాఠశాలలు, సమాజ సంక్షేమ కేంద్రాలు. బాలవాడీలు నెలకొల్పడం జరిగింది. తృతీయ ప్రణాళికా కాలంలో 186 ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించారు. 1,13,144 మంది పాఠశాలా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనసౌకర్యం కల్పించారు. 4,64,175 మంది పిల్లలకు పాఠ్య గ్రంథాలు మొదలైనవి ఇవ్వడం జరిగింది. ఈ రంగంలో ఇంతవరకు గట్టి కృషి జరిగినప్పటికి మున్ముందు జరగవలసిన కృషి చాలా ఉన్నది. ఈ కార్యక్రమాలు ఫలప్రదం కావడానికై ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ సహకారం, మద్దతు కావలసి ఉన్నది.

—డాక్టర్ శ్రీమతి ఫూల్ రేణుగుహా

పాఠకుల లేఖలు

ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ గారికి—

ఆర్యా,

ఆంధ్రప్రదేశ్ అవతరణనుండియే ఆంధ్ర ప్రదేశ్ పునర్దర్శనము చేసికొని యావదాంధ్రులు పునీతులగుచున్నారు. ఆగి వెళ్ళిన పత్రికలో అనేక మార్పులు మిగుల ఆకర్షణీయముగా నున్నవి.

విశేషించి "టోక్యో లేఖలు", "చైతన్య మూర్తులు" పేర్కొనదగినవి. చైతన్య మూర్తులలో అనేకులను గూర్చి కొద్దిగా వ్రాయుచున్నారు. దానికి బదులు ఏ ఒక మహనీయునినైన ఎన్నుకొని కూలంకషముగా వ్రాయడము లాభకారిగా నుండును.


ఆ మహనీయుని చిత్రపటము పుట నిండుగావేసిన బాగుండునని నా విశ్వాసము.

సంపాదకీయములో నెల సొంతానికి ఉపకరించు శీర్షిక నెన్నుకొనుటయు యుచితముగా నుండునని నిండు మనసుతో నమ్ముచున్నాను.

ఇట్లు
డి. అంజయ్య
హైదరాబాదు

సంస్కృతి

తోలుబొమ్మలు



ఎం. వి. రమణమూర్తి

పచ్చిచర్మం (Raw Skin) తో తయారుచేసిన బొమ్మలతో రంగులలో ఛాయా నాటకాన్ని చూపడంలో ఆంధ్రులు ప్రసిద్ధి కెక్కారు.

తోలుబొమ్మలాట ఆంధ్రుల అతి ప్రాచీన జానపద కళా సంపద. 'యవ' దీవులు–అనగా ఇప్పటి ఇండోనీషియా దీవులను పల్లవులు, కాకతీయులు తమ స్వాధీనములోనికి తెచ్చుకున్నప్పుడు మన తోలుబొమ్మలాటలను అక్కడకు వారుకూడా తీసుకువెళ్ళినట్లు తెలుగు భాషాసమితివారి 'ఆంధ్రసర్వస్వము' లో వ్రాయబడిఉంది. శ్రీ పాల్కురికి సోమనాథ బసవపురాణ పండితారాధ్య చరిత్రనుబట్టి తోలుబొమ్మలాటలు, కొయ్యబొమ్మలాటలు ఆంధ్ర దేశంలో 12 వ శతాబ్దంలో ఉచ్చదశలో వున్నాయని తెలుస్తోంది.

తోలుబొమ్మలాట సాంప్రదాయ కళాకారులు బర్మా, సయాం, మలయా, ఇండోనీషియా, కంబోడియా, లావోస్, బేంకాక్, చైనా, జపాన్ వగైరా దేశాలకు వెళ్ళి పేరు ప్రఖ్యాతులు, ధనాన్ని సంపాదించారు. భారతీయ ఖ్యాతిని, కళావిశిష్టతను వ్యాపింపజేశారు.

దక్షిణ భారతంలోవున్న తోలుబొమ్మలాట సాంప్రదాయ కళాకారులు మహారాష్ట్రులు. వీరు ఆంధ్రలో తెలుగుజాతివారిలోను, మైసూరులో కన్నడ జాతివారిలోను, తమిళనాడులో అరవ జాతి వారిలోను, కేరళలో మళయాళప్పు జాతిలోను ఐక్యం అయిపోయి వున్నారు. ఆయా దేశాలలో ఆయా భాషలలోనే ప్రదర్శనలిస్తూ వుంటారు. ఏ దేశంలోనైనా, ఏభాషలోనైనా వారు ప్రదర్శించేవి రామాయణ, భారతగాథలు మాత్రమే.



తోలుబొమ్మలను ప్రదర్శిస్తున్న వ్యాసరచయిత

ఆంధ్రలోను, మైసూర్‌లోను బొమ్మలు 5, 6 అడుగుల ఎత్తువరకు వుంటాయి. తమిళనాడు, కేరళలో మాత్రం 2 అడుగులకు మించి వుండవు.

ఒరిస్సాలోకూడా తోలుబొమ్మలాటలున్నాయి. బొమ్మలు 9 అంగుళములు మొదలు 12 అంగుళాల వరకు ఎత్తుంటాయి. వీరు ఒరియా భాషలో ప్రదర్శనలిస్తారు.

ఆంధ్ర, మైసూర్‌లలో బొమ్మలు పెద్దవై యుండటంవలన ఒక్కొక్క బొమ్మను ఒక్కొక్కరు పట్టుకొని ఆడిస్తారు. అదిగాకుండ ఛాయ రంగులలో చూపుతారు కనుక బొమ్మను తెరకు నొక్కిపట్టి ఆడించాలి. లేకపోతే బొమ్మఛాయ నలుపు (తెలుపు) అయిపోతుంది. అందుకు కూడా ఒక బొమ్మను ఒక మనిషే పట్టుకొని ఆడించాలి. అందుచేత ఎవరిబొమ్మను వారే, మాట్లాడుతూ పాడుతూ ఆడిస్తారు. అందువలన బొమ్మ ఆటకు మాటకు, కలుస్తుంది. మగ బొమ్మను మగవారు, ఆడ బొమ్మను ఆడవారు మాట్లాడుతూ ఆడిస్తారు. అందుచేత తోలుబొమ్మలాటను 'ఛాయా చర్మ చిత్ర నాటకము'(Shadow Leather Puppet Drama) అనికూడా పిలుస్తారు.

కాని తమిళనాడులో ఛాయ రంగులలో చూపబడుతున్న బొమ్మలు చిన్నవి అవడంవలన, బొమ్మలన్నింటిని ఒక మనిషే మాట్లాడుతూ ఆడిస్తాడు వెనుకవారు పాట, వాద్యాన్ని తదితర శబ్దాలను సమకూర్చుతారు.

కేరళ, ఒరిస్సాలలో ఛాయ నలుపు తెలుపులో వుంటుంది, రంగులలో వుండదు. ఒక మనిషి మాత్రమే తెరముందు క్రీనీడలో ప్రేక్షకులకు కథాగానం చేస్తాడు. ఇది ఒక రకమైన 'కథాకాలక్షేపం'. కేరళలో వాద్యాలు ఉపయోగించుకుంటారు. ఒరిస్సాలో వాద్యాలు ఉపయోగించరు. వీరు చిన్న బొమ్మలయొక్క నీడలను తెరపై పెద్దవిగా చూపుతారు. ఒరిస్సాలో కేవలం 'రావణుని' చరిత్రకు సంబంధించిన కథలుమాత్రమే ప్రదర్శిస్తారు. అందుచేత ఈ ఆట

లను 'రావణ్ ఛాయ' అని పిలుస్తారు. కేరళలో 'తోల్‌పావకూత్తు' అంటారు. 'పావకూ' అనగా 'బొమ్మ', 'కూత్తు' అనగా ఆట. 'నిళల్‌కాట్చి' అనికూడా పిలుస్తారు. నిళల్ అనగా 'నీడ' 'కాట్చి' అనగా ప్రదర్శన. పై రెండు పేర్లు అరవభాషకు చెందినవి. కారణం యీ కళ తంజావూరు నాయకరాజుల కాలంలో, తమిళ దేశంలో ప్రదర్శనలిచ్చే మహారాష్ట్ర కళాకారులు కేరళకు కూడా వ్యాపింపారు. వీరు తమిళభాషలోపాటి మలయాళభాషలో ప్రేక్షకు లకు అర్థం చెప్పుతారు. ఇప్పటికీ యీ పద్ధతి మారలేదు.

తమిళంలో 'తోల్‌బొమ్మలట్టం' అంటారు తోలుబొమ్మ లాటలను. అట్టం అనగా 'ఆట'. కన్నడభాషలో 'చర్మ్మలగొంబె లాట' లేక 'తొగలు బొమ్మెలాట' అని అంటారు. 'చర్మ్మల'అన్నా 'తొగలు' అన్నా తోలు అని అర్థం., 'గొంబె' అనగా బొమ్మ. అన్ని దేశాలలోను బొమ్మలాడించేవారు వలసవచ్చిన మహారాష్ట్రులు. కాని మహారాష్ట్ర దేశంలో మాత్రం యీ నాడు యీ ఆటలు మచ్చుకు చూద్దామన్నా లేవు. ఆ దేశంలో యీనాటి వారికి యీ ఆటలంటే ఏమిటో తెలియదు. మరాఠీభాషలో తోలుబొమ్మలాటలను 'చర్మనాహూలినాట్య' అంటారు. 'నాహూలినాట్య' అనగా బొమ్మలాట.

కాలప్రాపిరితో మూలుగుతున్న భారతదేశపు అత్యున్నతమైన అతిప్రాచీన సాంప్రదాయ జానపదకళను పునరుద్ధరించాలనే ఆకాంక్షతో సెంట్రల్ లెదర్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్ (మద్రాసు) డైరెక్టరు డా. వై. నాయుడమ్మ, తమ పరిశోధనాలయంలో యీ కళపై పరిశోధన జరిపేటందుకు, ప్రచారం చేసేటందుకు అవ కాశాన్ని 1962లో కల్పించారు.

ఈ కళయొక్క అన్ని శాఖలలోను, అనగా చర్మశాస్త్రం, చర్మ సాంకేతిక పరిజ్ఞానం, చేతిపృత్తికి సంబంధించిన నేర్పరి తనం, చిత్రలేఖనం, సాహిత్యం, సంస్కృత పాండిత్యం, సంగీతం, వాద్యనైపుణ్యం, నాట్యం, నృత్యం, శబ్దానుకరణ, రంగస్థలానుభవం, బొమ్మలాడించడంలో నేర్పరి తనం వగైరాలలో సాంప్రదాయ సిద్ధమైన అతిప్రాతన పద్ధతుల రహస్యంతములను తెలుసుకొని, అవసరమని తోచిన సాంప్రదాయ ములను చెక్కుచెదరనీయకుండా అట్టేవుంచి, మెరుగులు దిద్దడం; మార్పు అవసరమైనవాటికి ఆధునిక శాస్త్రీయ సాంకేతిక సాధన సంపత్తినుపయోగించి అభివృద్ధికరమైన మార్పులు చేయడం, నూతన పరికర సహాయాన్ని పొందడం లక్ష్యాలు. ఇప్పటికి కొన్ని లక్ష్యాలు సాధించడంకూడా జరిగింది. చర్మం తయారుచేయడం లోను, బొమ్మలు తయారుచేయడంలోను, బొమ్మలాడించడంలోను, విద్యుద్దీపకాంతి, గ్రామఫోను, టేప్‌రికార్డరు వంటి శబ్దపరికరాల నుపయోగించుకోవడంలోను, ఈ పరిశోధనాలయంలో అభివృద్ధి పరచిన విధానాలను తెలుసుకోవడం, అందులో శిక్షణ పొందడం, యీ కళను ఇంకా అంటిపెట్టుకొనివున్న సాంప్రదాయ కళాకారు లకు, యీ కళను చేపట్ట కుతూహలపడే ఔత్సాహిక కళాకారులకు కూడా ఎంతైనా అవసరం.

తోలుబొమ్మలు తయారు చేయబడే చర్మ వర్ణానికి, పదిలమైన వాడుక ఇంతవరకూలేదు. అర్ధపారదర్శకము (Translucence) పారదర్శనము (Transparence) లకు సంబంధించి, గృహా లంకరణాలు, దీపపుహిమ్మీలు కాంతులకు అనేక ఇతరవస్తువులను తయారు చేయటంకూడా మొదలు పెట్టారు. తోలుబొమ్మలు తదితర వస్తువులు మనదేశంలో వారిసారిగా వ్యాపారాభివృద్ధికై వీథిలోనికి చేరినాయి. ఈ వ్యాపారాన్ని పరదేశాలలోకూడా ప్రవేశ పెడితే మరికొంత విదేశ ద్రవ్యాన్ని మన దేశానికి సంపాదించి పెట్టగలదని, తద్వారా ఇది ఒకగొప్ప చేతిపృత్తిగా పరిగణించ బడి పదుగురు కళాకారులను పెంచగలదనికూడా ఆశింపబడుతోంది.



తోలు బొమ్మల ప్రదర్శనకు సహాయత్తమౌతున్న కళాకారిణి

అభివృద్ధిని సాధించిన కొన్ని దేశాలలో బొమ్మలాట నిర్బంధ పాఠ్య విద్యగా తీసుకోబడింది. కొన్ని దేశాలలో చిన్న తరగతుల పాఠాలు బొమ్మలాటలద్వారా బోధిస్తున్నారు. మన దేశంలోకూడా పాఠశాలలోని డ్రాయింగు టీచర్లకు శిక్షణనిస్తే వారి ద్వారా యీకళకు పాఠశాలలలో ప్రవేశం కలుగుతుందని, తద్వారా పాఠశాలలలోని బాలబాలికలకు విద్యాబోధనలో గుణపాఠాన్ని సంపా దించి వినోదాన్ని, విజ్ఞానాన్ని పెంపొందిస్తూ శాశ్వతంగా వర్ధిల్ల గలదని విజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

లెదర్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్ (మద్రాసు) లో 1965 డిసెంబరు 27వ తేదీనుండి యీ కళలో సంవత్సరమునకు 6గురు సాంప్రదాయ కళాకారులకు, ఉపాధ్యాయులకు శిక్షణ నివ్వడానికి ఏర్పాటు జరిగింది. ప్రతి విద్యార్థికి నెలకు రు. 75.- చొప్పున ఉచిత వేతనం ఇవ్వబడుతుంది. ★

సీరియల్

తిరస్కృతి

వాసిరెడ్డి సీతాదేవి

జరిగిన కథ

సూర్యం పట్నంలో ఎం.బి.బి.ఎస్. చదువుతున్నాడు. సూర్యం అన్న సత్యనారాయణ చిత్రకారుడు. సరళ, చిన్నతనం నించీ తమ యింట్లోనే పెరిగిన మేనమామ కూతురు. అన్నయ్య సరళను పెళ్ళాడడం సూర్యానికి బాధగావుంది. పెళ్ళికని యింటికి వస్తూ దారిలో గత జీవితమంతా జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు.

సూర్యం మొదట శెలవులు ఆ పల్లెటూరిలో గడపటం ఎలాగా అని భయపడ్డాడు. ఇంతత్వరగా శెలవులు అయిపోయాయే అని ఇప్పుడు బెంగపడుతున్నాడు.

తల్లి ఆదరణలో, సరళ సాంగత్యంలో రోజులు ఇట్టే గడచిపోయాయి. సరళకు చిన్నబావతో కబుర్లుచెప్పటం అంటే ఎంతో ఇష్టం. సూర్యంకూడా ఏవేవో కాలేజీ కబుర్లూ, పట్నం కబుర్లూచెప్పి నవ్విస్తూ ఉంటాడు. సూర్యంసేవల్లో సరళ దాదాపు సత్యాన్ని మర్చిపోయిందనే చెప్పాలి. సూర్యం రాకముందు సత్యంకు ఏంకావాలో అతను అడక్కుండానే గ్రహించి, అన్ని సదుపాయాలూ చేస్తూండేది. అయితే సూర్యంలా సత్యం నవ్వించే కబుర్లు చెప్పేవాడుకాదు. అసలు అతను ఎక్కువ సమయం అధ్యయనంలోనూ, చిత్రలేఖనంలోనూ గడిపేవాడు. రోజుకు ఓ గంట సరళకు ఇంగ్లీషు, తెలుగు చెప్పేవాడు. సరళకోసం పట్నంవెళ్ళినప్పుడల్లా చిన్న ఇంగ్లీషు కథల పుస్తకాలు, మంచి తెలుగు పుస్తకాలూ పట్టుక వస్తుండేవాడు. సరళ, సత్యం మహా యోగిలా చిత్రలేఖనంలో లీనమయి ఉంటే గంటలకొద్దీ చూస్తూ కూర్చుండేది. సరళ తనకు తెలియకుండానే సత్యాన్ని ఆరాధిస్తుంది. సత్యం ముందు సరళకు చిలిపితనం చెయ్యాలనిపించేదికాదు. అందువల్లనే సూర్యం వచ్చినప్పటినుంచీ, ఆ వయస్సులో సహజమైన కబుర్లు చెప్పుకోవటానికీ, అల్లరిచేయటానికీ సరళకు అవకాశం దొరికింది.

సత్యం వ్యక్తిత్వం ఉన్నతంగా, హుందాగా, గంభీరంగా నిల్చొని ఉండే పర్వతం లాంటిది. సూర్యంవ్యక్తిత్వం ఆ పర్వతం మీదనుంచి దూకుడుగా కిందకుపడే సెలయేరులాటిది. సరళ హృదయం సత్యనారాయణలోని ఔన్నత్యాన్ని ఆరాధిస్తుంది. కాని ప్రవాహంలాటి వ్యక్తిత్వంగల సూర్యం సన్నిధిలో ఆమె తననుతను మర్చిపోతుంది. ఆ ప్రవాహవేగంలో ఊపిరి సలపకుండ కొట్టుకు పోతుంది.



సూర్యం, సరళ మరీ అంత చనువుగా ఉండటం ఎందుచేతనో శాంతమ్మకు అంత ఇష్టంగాలేదు. ఆ విషయాన్ని సరళ కూడా లీలగా గ్రహించింది. దానికి కారణంకూడా సరళకు అర్థం కాకపోలేదు. ఆమె వివాహం సత్యంతో ఏనాడో నిర్ణయం అయిపోయింది. కాని సత్యం హృదయంలో ఏముందో ఎవరికీ తెలియదు. కాని మరోనాలుగు సంవత్సరాల వరకూ తనకు వివాహం చేసుకొనే ఉద్దేశం లేదని తల్లితో సత్యం స్పష్టంగా చెప్పాడు. ఆమాటే చంద్రయ్య చెవిలో రహస్యంగా ఊదింది శాంతమ్మ.

"తొందరేమిటి? మనకు సంబంధాలు వెతకాలన్న దిగులు లేదుగా? చిన్న పిల్లల్ని ఇప్పటినుంచే సంసార లంపటంలో పడేయకపోవటం మంచిదేగా" అన్నాడు చంద్రయ్య.

శాంతమ్మ ముభావంగా ఊరుకుంది. ఆమెకు మాత్రం పెద్ద కొడుకు పెండ్లి చాలా త్వరగా చేసెయ్యాలని వుంది.

సూర్యం వచ్చాక సరళలోని ఉత్సాహాన్ని చూసిన శాంతమ్మకు ఏదో భయం పట్టుకుంది. అందుకే ఆమెకు సరళ సూర్యంతో మరీ అంత చనువుగా ఉండటం ఇష్టంలేదు. కాని ఏమీ అనలేక పోయింది.

చిన్నబావ వచ్చినప్పటినుంచి తను చదువు మానేసింది. పెద్దబావ దగ్గరకి వెళ్ళి కూర్చోవటం మానేసింది. తను చిన్నబావతో నవ్వుతూ కబుర్లు చెప్పటం, అప్పుడప్పుడు చిన్నబావ తన జడపట్టుకొని లాగటం పెద్దబావ చూశాడు. ఆ క్షణంలో పెద్దబావ ఏమనుకున్నాడో అని భయపడింది. కాని పెద్దబావ ప్రవర్తనలో ఎలాంటిమార్పూ కనిపించకపోవటం చూసి 'ఇలా చిన్న విషయాలకు పెద్దబావ ఏమీ అనుకోడు. పెద్దబావ చాలా మంచి వాడు' అనుకుంటూ ఉండేది సరళ.

సూర్యానికి కలకత్తా యూనివర్సిటీలో ఎం. బి. బి. యస్. సీటు వచ్చింది. ఆంధ్రా యూనివర్సిటీలో మార్కులు చాలనందున సీటు రాలేదు. చంద్రయ్య అంతదూరం పంపించి, అంత పెద్ద చదువు చదివించే తాహతు తనకులేదంటూ మళ్ళీ పేచీ పెట్టాడు. దిగాలుపడి కూర్చున్న సూర్యానికి సత్యం ధైర్యంచెప్పాడు. సూర్యం కలకత్తా కు మరో నాలుగురోజుల్లో బయలుదేరి వెళ్ళాలి. ఇంకా డబ్బు ఏర్పాటు జరగలేదు. సూర్యానికి భయం పట్టుకున్నది.

ఆరోజు మధ్యాహ్నం సరళ, శాంతమ్మ ఫలహారాలు చేస్తుంటే సాయం చేస్తున్నది. సూర్యానికి ఏమీ తోచక అన్నగదిలోకివెళ్ళాడు. ఆరోజు సత్యం ఉదయమే కాఫీతాగి బయటకు వెళ్ళినవాడు ఇంకా తిరిగి రాలేదు. నియమబద్ధంగా అన్ని పనులూ చేసుకుపోయే సత్యం ఆరోజు వంటిగంటదాకారాకపోవడం సూర్యానికి ఆశ్చర్యం కలిగించింది.

గదంతా చక్కగా సర్దివుంది. గోడకు ఆనించి ఉంచిన స్టాండుమీద అసంపూర్ణంగా ఉన్న చిత్రం ఉంది. అదేమిటో అర్థం చేసుకోవాలని ప్రయత్నించాడు. కాని సూర్యానికి బోధపడలేదు. మోడర్న్ ఆర్టు తనకు అర్థంకాదు. తనకేమిటి, చాలామందికి అర్థంకాదు. ఆ మాటకొస్తే ఒక కళాకారుడు గీచే చిత్రం మరో కళాకారుడికే అర్థంకాదు. ఇక, తనకేం అర్థమవుతుంది?

సూర్యందృష్టి పుస్తకాల బీరువావైపుకు మళ్ళింది. వెళ్ళి చూశాడు. ఈ రెండు సంవత్సరాలలో అన్నయ్య చాలా పుస్తకాలు కొన్నట్లున్నాడనుకొన్నాడు సూర్యం. మొదటి అరలో అన్నీ చిత్రలేఖనానికి సంబంధించిన పుస్తకాలే. రెండో అరలో చూశాడు. అన్నీ బెంగాలీ పుస్తకాలు ఉన్నాయి. మూడో అరలో ఉన్న ఇంగ్లీషు పుస్తకాలలో "పిక్చర్ ఆఫ్ డోరియన్‌గ్రే" బయటకు తీశాడు సూర్యం. సూర్యం ఆ పుస్తకాన్ని గురించి విన్నాడు కాని చదవలేదు. బయటకు వస్తూ మరోసారి అన్నయ్య వేసిన ఆ అసంపూర్ణ చిత్రం వైపు దీక్షగాచూశాడు. ఈ సారి కూడా అది అర్థంకాలేదు. కాని మనస్సును ఆకట్టుకోగల గుణం ఏదో అందులో ఉన్నట్లనిపించింది. ఆ రంగుల మిశ్రమంలో కళ్ళకు హాయిని గొలిపే ఏదో అరూప రూపం కనిపించినట్లయింది.

సత్యం జీవిత విధానాన్ని గురించి ఆలోచిస్తూ బయటకు వచ్చాడు సూర్యం.

సూర్యంకోసం ఫలహారం తీసుకొస్తూ ఎదురయింది సరళ.

"పెద్దబావ వచ్చాడా? చూడనే లేదు. బావ పొద్దుటినుంచీ భోజనం చెయ్యలేదు. ఎక్కడకు వెళ్ళాడో ఏమో!" అంది సరళ.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. అన్నయ్య ఈ సమయంలో ఎక్కడకూ వెళ్ళడే?" అన్నాడు సూర్యం.

"ఇదుగో ఫలహారం తెచ్చాను. ముందుతిను." అని సూర్యం గదిలోకి వెళ్ళింది సరళ. వెనకే సూర్యం వెళ్ళికూర్చు పుస్తకం తెరిచి చూడసాగాడు.

"ముందు ఫలహారం చెయ్యి. ఆ తరువాత చూకొచ్చు పుస్తకం" అంది సూర్యం చేతుల్లోని పుస్తకం లాక్కుంటూ. పుస్తకం లాక్కుందికాని సరళ సూర్యం చేతుల్లో చిక్కుకు పోయింది.

"వదులు. అత్తయ్యా!"

సూర్యం గాబరాగా సరళను వదిలేశాడు. సరళ వంటింట్లోకి సూర్యంకోసం కాఫీ తీసుకురావటానికి వెళ్ళింది.

కాఫీ, ఫలహారం ముగించి సూర్యం పుస్తకం తెరిచాడు.

"ఏమిటి బావా? నీకూ పెద్దబావకు పట్టిన పిచ్చేపట్టిందా!" అంది. పుస్తకంలో లీనమయివున్న సూర్యాన్ని వారగాచూస్తూ.

సూర్యం తలఎత్తలేదు. అది చూసిన సరళకు ఉడుకుబోతుతనం వచ్చింది. సూర్యం చేతిలో పుస్తకం లాక్కోబోయింది.

"ఉండు సరళా! ప్లీజ్! ఈ పుస్తకం బలేబావుంది. చదవనియ్యి"

"ఊహూ! వీల్లేదు, అసలు అంతబాగావున్న ఆ పుస్తకం ఏమిటో?"

"నీకు తెలియదులే చెప్పినా!"

"అబ్బో అలాగేం! బావ నాకు తను చదివిన ప్రతిమంచి పుస్తకంలో కథ చెప్పాడు తెలుసా?"

"ఊఁ" సూర్యం అంతకంటే ఏమీ అనలేదు.

"ఎల్లుండివెళ్ళేప్పుడు ట్రైన్‌లో చదువుకుందువుగానిలే."

"వెళ్ళినట్లేఉంది!" నిరుత్సాహంగా ఉంది సూర్యం స్వరం.

"తప్పకవెళతావు బావా! నువ్వుతప్పక డాక్టరువు అవుతావు. పెద్దబావమాట ఇచ్చాక తప్పక సాధిస్తాడు. తెలుసా?" ఆమె స్వరంలో విశ్వాసం పలికింది.

"ఏమండోయ్ డాక్టరుగారూ! ఏమిటా ఆలోచన? నాతో ఒక ఆట ఆడతావా బావా!"

"ఆటా! నీకు చీట్లపేక ఆడడంకూడా నేర్పిస్తున్నాడా మీ పెద్దబావ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సూర్యం.

"ఇది పల్లెటూరండీ అబ్బాయిగారూ. ఆడపిల్లలు చీట్లపేకలు ఆడకూడదు తెలుసా? పైగా పెద్దబావ లాటివాడు చీట్లు కూడా

ఆడతాడా !" మళ్ళీ ప్రశ్నించే అవకాశంకూడా ఇవ్వకుండా లోపలకు వెళ్ళింది సరళ. అలావెళ్ళుతున్న సరళనే చూస్తూ ఆలోచనలో పడ్డాడు సూర్యం.

ఒకచేత్తో చింతపిక్కలతో నిండుగావున్న పింగాణి గిన్నె, మరోచేత్తో వామన గుంటలు చెక్కపెట్టును వచ్చిన సరళవైపు విస్మయంగా చూశాడు సూర్యం.

"ఏమిటలా నోరు తెరుచుకొని చూస్తున్నావు. వామన గుంటలంటారు ఈ ఆటను." అంది సరళ, చింతపిక్కలను లెక్కపెట్టి వామన గుంటల్లో వేస్తూ.

"అంటే...అక్కడ...ఆనేలమీద, మోకాలు మీద గడ్డం ఆనించి కూర్చొని వామనగుంటలు ఆడమంటావా ?"

"ఏమో మహాగొప్ప ! విశాఖపట్నం వెళ్ళక ముందంతా ఆడపిల్లల ఆటలే ఆడేవాడివిగా ?" అంది సరళ తను చేస్తున్న పనిమీదనుంచి తలఎత్తకుండానే.

"పోనియ్ లే రక్షించావు. ఏతొక్కుడుబిళ్లో, చెమ్మచెక్కో ఆడమనలేదు." వస్తున్ననవ్వును ఆపుకో ప్రయత్నిస్తూ. సరళకు నిజంగానే కోపం వచ్చింది. చింతగింజలన్నీ చిమ్మేసి గోడకాను కుని మూతిసున్నా చుట్టి కూర్చుంది.

"కోపంలో ఇంకా అందంగా ఉన్నావు సరళా ! ఆఁ నవ్వకు ఆమూతిని అలాగే ఉంచు" అన్నాడు సూర్యం.

సరళ పెదవులపై చిరునవ్వు రేఖ మెరిసింది.

"మాలెక్చరర్ చెప్పిన మాట నిజమే ?"

"ఏమిటో అది ?"

"మనస్తత్వ శాస్త్రం చెప్పే లెక్చెరర్ ఒకసారి ఏమన్నా డంటే" ఆడవాళ్ళకు కోపం వచ్చినప్పుడు బ్రతిమాలడం వల్ల లాభంలేదు. కోపంలో ఎంత అందంగా కనిపిస్తున్నావు అంటే చాలు, ఆడదాని మనస్సు ఇట్టే కరిగిపోయి నవ్వేస్తుంది అని అన్నాడు"

"ఊహూఁ సంతోషించాంలేం ?"

సూర్యం సరళను రెప్పవేయకుండా చూశాడు.

"ఏమిటలా చూస్తున్నావు ? అదిసరేగాని బావా ! మీక్లాసులో ఆడపిల్లలుకూడా చదువుతున్నారా ?" కుతూహలంగా అడిగింది సరళ.

"ఏం ! ఎందుకు ?"

"చెప్పమంటుంటేనూ !"

"ఆ, నలుగురు ఆడపిల్లలున్నారు !"

"వాళ్ళంతా చాలా ఫ్యాషన్‌గా ఉంటారుగదూ !"

"ఓ, బలే ఫ్యాషన్‌గా ఉంటారు!"

"రెండు జడలు వేసుకుంటారా ?"

"రెండేంఖర్మ మూడు కూడా వేసుకుంటారు."

"ఛో ! బావా ! మరీను. చెప్పమంటుంటేనూ !"

"ఏం, నీకు కూడా రెండు జడలు వేసుకోవాలని ఉందా ?" వచ్చే నవ్వును ఆపుకుంటూ ప్రశ్నించాడు సూర్యం.

"అత్తయ్య ఊరుకోదుగా! అయినా ఈ ఊళ్ళో ఎవరూ వేసుకోరు. నేను ఒకసారి గుంటూరు సినిమా చూట్టానికి వెళ్ళినప్పుడు చూశాను. ఎంత ముచ్చటగున్నారు ! అందరూ రెండు జడలే వేసుకున్నారు."

సరళను చూస్తుంటే జాలివేసింది సూర్యానికి.

"వద్దులే. కుక్కతోకల్లా రెండు భుజాలమీదా వేళ్ళాడే ఆ జడలకంటే నీ జడే నాకు బాగుంది. పొడవుగా జడగంటలతో వీపుమీద అల్లల్లాడుతూ ఉండే నీ జడ కోడె త్రాచులాగే సవాలు చేస్తున్నట్లుంటుంది."

"ఛీ! నా జడ పాములా అసహ్యంగా ఉందా?"

సూర్యం ఏమనాలో తెలియక తెల్లముఖం వేశాడు.

"బావా! మీ క్లాసులో చదివే అమ్మాయిలంతా చాలా ఫ్యాషనుగా ఉంటారా?"

"ఫ్యాషన్లకేం కొదవ! ఇప్పుడు రెండు జడలు ఫ్యాషన్ కాదు నడినెత్తిన ముడులు వేసుకోవటం ఫ్యాషన్."

"ముడివేసుకోవటం ఫ్యాషనా?" ఆశ్చర్యంగా అడిగింది సరళ.

"అవును! ముడి అంటే అత్తయ్యా, మన ఊళ్లో ఆడవాళ్లు వేసుకొనేలాటి ముళ్లు కాదు."

"మరి?"

"ఆ ముడి ఎలా ఉంటుందంటే, ఎలా చెప్పటం అబ్బా! నువ్వు ఇన్ని ప్రశ్నలు వేస్తావని తెలిస్తేఎవరిదైనా ఒక ఫొటో అయినా తెచ్చేవాణ్ణి."

"పోనిద్దూలే చెప్పక్కర్లేదు."

"అరేఁ వెళ్ళిపోతున్నావా? ఆ ముడి బలే తమాషాగా ఉంటుందిలే. నేను చిన్నప్పుడు కోటిరత్నం అనే ఆవిడ నారదుడి వేషం వెయ్యగా చూశాను. ఆ ముళ్లు వేసుకున్న వాళ్ళను చూస్తే ఆవిడ గుర్తొస్తుంది."

సరళ పక పక నవ్వింది. "బలేవాడివే బావా? ఆడవాళ్ళకు నారదునిలా కన్పించటం ఇష్టమంటావా ఏమిటి?"

"అదేమో నాకేం తెలుసు? ఆఁ అలాంటి ముళ్లు వేసుకున్న ఆడవాళ్ళు జుట్టును ముఖం మీద బాగా అణిచి దువ్వి చెవుల మీదగా వేసుకుంటారు. వాళ్ళ ముఖాలు చూస్తుంటే తాటికాయలు గుర్తొస్తాయి. గుడి గోపురాలు గుర్తొస్తాయి. ఇంకా ఏవేవో గుర్తొస్తాయి" అంటూ పకపక నవ్వాడు సూర్యం.

"అన్నీ అబద్దాలే" అందిసరళ. [సశేషం]



పబ్లిక్ గార్డెన్స్‌లో యాత్రా వారోత్సవానికి
ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి

యాత్రా వారోత్సవం

రాష్ట్ర జనసంబంధ శాఖ 1967 అంతర్జాతీయ పర్యాటక సంవత్సరం సందర్భంగా నిర్వహించిన 'యాత్రా వారోత్స' వానికి డిసెంబరు 26వ తేదీన పబ్లిక్ గార్డెన్స్‌లో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. నగరంలోని పర్యాటకుల ఏజన్సీలు, యాత్రికులకై ఉద్దేశించిన హోటళ్ళు, తదితరుల సహకారంతో ఈ శాఖ నిర్వహించిన యాత్రా వారోత్సవానికి అమిత జనాదరణ లభించింది. జిల్లాస్థాయి, సమితిస్థాయిలో కూడా జనసంబంధశాఖ అధికార్లు యీ సందర్భంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. పర్యాటకులకు ఈ సందర్భంలో అనేక సౌకర్యాలను అందజేశారు. రాష్ట్రంలో పర్యటిస్తున్న వివిధ పర్యాటకులను హైదరాబాదు తదితర ముఖ్య ప్రాంతాలకు తీసుకునివచ్చే ప్రయత్నం కూడా జరిగింది. కరీంనగర్ నుండి పర్యాటకులు హైదరాబాదులో జరిగిన యాత్రా వారోత్సవంలో కడపటి ఉత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ వారోత్సవానికి ప్రారంభోత్సవంచేస్తూ ముఖ్యమంత్రి దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య, ప్రపంచంలోని వివిధ దేశాల ప్రజలమధ్య, చక్కటి అవగాహనను, స్నేహ వాతావరణాన్ని కలిగించేందుకు దేశంలోనూ, దేశం వెలుపలా పర్యటనలను ప్రోత్సహించవలసిన అవసరాన్ని గూర్చి ప్రస్తావించారు.

ఎక్కడైనా ప్రశాంత జీవితానికి అడ్డం ఏర్పడిందంటే అందుకు ప్రధాన కారణం సరైన అవగాహన లేకపోవడమేననీ పర్యటనలను అభివృద్ధి చేయడంవల్ల వివిధ గ శాల ప్రజలమధ్య సదవగాహన వాతావరణం పెల్లివిరియడానికి ఆస్కారమేర్పడుతుందనీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా దేశంలో ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి పర్యటనలను ప్రోత్సహించడం కూడా ఆయా ప్రాంతాల ప్రజలమధ్య సన్నిహిత స్నేహ వాతావరణాన్ని కలిగించడానికి తోడ్పడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు యితర ప్రాంతాలలో పర్యటించి అక్కడ విషయాలను, ప్రజలను అవగాహన చేసుకోవడం చాలా అవసరం – అని ముఖ్యమంత్రి చెప్పారు.


ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జనసంబంధశాఖ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ దేశంలోని ప్రాంతాలనుంచే క విదేశాలనుంచి కూడా పర్యాటకులను ఆకర్షించ నికి తీవ్రంగా కృషి చేయడం జరుగుతున్నదని పేర్కొన్నారు.

జనసంబంధశాఖ సంచాలకుడు శ్రీ బి. ఎన్. రామన్ సభికులకు స్వాగతం పలుకుతూ ఈ అంతర్జాతీయ పర్యాటక సంవత్సరాన్ని ఒక నూరు వంద దేశాలు జరుపుకుంటున్నాయని తెలియజేశారు. సాంస్కృతిక ప్రదర్శనతో ఆరోజు కార్యక్రమం ముగిసింది.

అదేరోజున జూబ్లీహాలులో టూరిస్టు ఎగ్జిబిషన్‌కు కూడా ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. జనసంబంధశాఖ డిసెంబరు 28వ తేదీన కళాశాలల విద్యార్థులకు 'పర్యటనలు శాంతికి సోపానాలు' అన్న అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించింది. 'ప్రపంచ పర్యటనానందం ఏకొద్ది మంది హక్కూ కాదు, అది అందరిదీని'' అన్న అంశంపై వక్తృత్వపోటీనికూడా కళాశాల విద్యార్థులకు నిర్వహించింది వ్యాసరచనలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన శ్రీ బి. ప్రమోద్‌కు ప్రథమస్థానము, నిజాం కళాశాలకు చెందిన కుమారి మల్లికా అనంతనారాయణన్‌కు ద్వితీయస్థానము లభించాయి. వక్తృత్వపోటీలో ఉస్మానియా వైద్య కళాశాలకు చెందిన శ్రీ శ్రీనాథ రెడ్డి ప్రథముడుగాను, నిజాం కళాశాలకు చెందిన శ్రీ బి. జె ప్రశాంతం ద్వితీయుడుగాను వచ్చారు.

యాత్రా వారోత్సవ సందర్భంగా యీ వారం రోజులూ నగరంలో దర్శనీయ స్థలాలకు పర్యటనలను ఏర్పాటు చేశారు. మనోరమలో పర్యటించే పర్యాటకులకు లక్కీ డ్రా ఒకదానిని నిర్వహించారు. నాగార్జునసాగర్‌కు వినోద పర్యటనలను ఏర్పాటు చేశారు విమానంలో నగరంచుట్టూ ట్రిప్పులను ఏర్పాటుచేశారు. పెద్దపెద్ద హోటళ్ళలో సాంస్కృతిక ప్రదర్శనలను జరిపించారు. డాక్యుమెంటరీ ఫిల్ములను ప్రదర్శించారు. ★

పావురాయి కథ



వాకాటి పాండురంగరావు

నిజం లాగున వెలుగుతున్నాడు సూర్యుడు.

ప్రాణంలాగున వెచ్చగా వుంది భూమి.

ఆ భూమ్మీద ఒక వూరు.

ఆ వూరిలో ఒక మేడ.

ఆ పెద్దమేడలోని చిన్న అబ్బాయి బడినుండి వచ్చాడు. వాళ్ళ నాన్న నడిగాడు_ "నాన్నా! నాన్నా! మరేం...మనింటో వుండే ఆ పావురాయిని విడిచి పెట్టేద్దాం నాన్నా!" అని అడిగాడు.

నాన్న ఆశ్చర్యపోయాడు. మరీ ఈ రోజుల్లో బడికి వెళ్ళొచ్చిన వాళ్ళంతా ఇట్లా అయిపోతున్నారేమో_అనుకున్నాడు. అబ్బాయి మోహం చూశాడు. అంగీకరించాడు. ఆ పని చేశాడు. అబ్బాయి సంతోషించాడు. బళ్ళో మేష్టారు చెప్పినట్లు తాను ఆపూట ఒక మంచిపని చేశానని రాత్రి దేవుడితో చెప్పుకున్నాడు_అబ్బాయి.

పావురాయి ఎగిరింది.

పాలసముద్రంలో మునిగొచ్చిన దానిలా ఎగిరింది.

మేడల నీడల విడిచి, దూలాల సందులు విడిచి, యజమానుల కత్తెర విడిచి ఎగిరింది.

మేఘాల్లో మేఘమై ఎగిరింది.
యవ్వనంలో మనసులా ఎగిరింది.

ఎంత పావురమయినా! ఎంత యవ్వనమయినా ఎగురుతూనేవుండలేదు కదా.

దిగివచ్చింది పావురం ఆకుపచ్చటి అడవిలోకి.
జాతివారిని చూచింది.
మరిచిపోయిన మాట మళ్ళీ వచ్చినట్లయింది.
తన స్వేచ్ఛకు అర్థం తెలిసినట్లయింది.

ఒక ఇల్లు కట్టుకోవాలనుకున్నది. పెళ్ళి చేసుకోవాలనుకున్నది. పిల్లల్ని పెంచి వాళ్ళకు పంజరాలు లేకుండా చేయాలనుకున్నది.

శక్తులుడిగిన సింహాలూ, యుక్తులునిండిన ఎలుగుబంట్లూ వున్న ఆ అడవిలో_ఒక పెద్ద మర్రిచెట్టు మీద మూడుకొమ్మలు కలిసిన చోట వున్న తొర్రలోకి చూసింది. ఖాళీగా వుంటే అక్కడ దిగి రెక్కలార్చుకుంది. ఆ పూటకిన్ని రాలిన ఈతపళ్ళు ఏరుకున్నది. కొన్ని తిన్నది. కొన్ని దాచుకొన్నది.

అటుపిమ్మట నిద్రపోయింది_మంచిపని చేసిన అబ్బాయిలా.

మరుసటి రోజునుంచి పావురాయి పనిప్రారంభించింది. మెత్త మెత్తటి ఆకులు, దూదిపింజెలు తీసుకొచ్చి చక్కటి ఇల్లు కట్టసాగింది.

ఎవరబ్బా ఈ క్రొత్తావిడ_అని జాతి వారొస్తే పావురమ్మ చల్లగా నవ్వి చక్కగా పలకరించింది. అందరినీ కూర్చోమంది. తలకొక ఈతపండూ ఇచ్చింది. మర్యాదకు మనసులుపొంగగా సాటి వారందరూ సెలవు తీసుకున్నారు.

నలుగురిలో తానొక్కతైనందుకు పావురమ్మ గుండె వెచ్చగా వెలిగింది.

ఆ వెలుతురింకా ఆరిపోకముందే కావు కావుమంది ఒక కాకి. పావురమ్మ తలపైకెత్తి చూస్తే పైన కన్పించింది.

"మా ఇంటికోసారి రారేం?" అంది పావురమ్మ. మూతి ముడుచుకుని ఇంట్లోకి పోయింది కాకి. ఒక చెట్టునున్న వాళ్ళంకదా, నన్ను వదిలేసి ఊళ్ళోవాళ్ళను పిలిచి మర్యాద చేస్తుందా ఈ కుర్రకుంక!_దీని పొగరణచక పోతే నా... అని మండి పోయింది కాకి.

'అయ్యో! నేనేమి తప్పుచేశానో ఏమిటో, ఆవిడ అలా కోపగించుకున్నారు_' అని బాధపడింది పావురమ్మ...

... రోజులు ఎగిరి పోతున్నాయి.

ఒకానొక మధ్యాహ్నపువేళ, భోజనం ముగించి, తాంబూలంలాటిది వేసుకుంటూ సుతారంగా కొమ్మమీద పావురమ్మ కూచున్నవేళ___

క్రింద బుస్సుమనివినిపించింది. వంగిచూడగా రెండు తలల పామొక్కటి సరసర తిరుగుతున్నది.

"బాగున్నారా?" అని పలకరించింది పావురమ్మ.

తలఎత్తి పాము అంది ఎంతో ఆప్యాయంగా_"ఓహో మీరు ఈమధ్య కొత్తగా వచ్చిన వాళ్ళుకదూ... మిమ్మల్నిచూడాలని

చాలకాలం నుండి అనుకుంటున్నాను. సరే... దాపున్నాను. మీలాటి మిత్రుల ప్రేమకన్న ఏంకావాలి చెప్పండి..."

పావురమ్మ సిగ్గుపడింది ఇంకేమీతోచక – "ఈతపళ్ళు రెండు తినండి" అని తన ఇంట్లోంచి తీసి రెండు పడేసింది పాముముందర.

" అబ్బే...ఇవాళ నాకు ఏకాదశి...అందుచేత ఉత్త గాలి తప్ప మరోటి తినను...అయినా మీరింత ప్రేమతో ఇచ్చిన వాటిని ఎలా వద్దనను? మన స్నేహానికి గుర్తుగా ఇవి దాచుకుంటాను!" అంది పాము.

పావురమ్మ బోలెడు సంతోష పడిపోయింది. ఏదో చెప్పబోయింది, కాని క్షణంలో తుస్సుమని పాము కాస్తా పుట్టలోకి జారిపోయింది. దిగ్భ్రమపడ్డది పావురమ్మ. వెంటనే అక్కడ పడ్డది పెద్ద నీడ. వెయ్యి అడుగుల ఎత్తునుండి అవలీలగ దిగాడు గ్రద్దయ్య... నిప్పుల్లా వెలుగుతున్న కళ్ళతో పుట్టచుట్టూ తిరగసాగాడు.

పావురమ్మకు ఒక నిముషం ఏమీ తోచలేదు. నెమ్మదిగా సంబాళించుకుంది. " అన్నయ్యా! " అని తియ్యగా పిలిచింది. గ్రద్దయ్య చూచాడు.

" ఆకలిగా వుందా అన్నయ్యా! మా ఇంట్లోకిరావూ" అని పిలిచింది పావురమ్మ. గ్రద్దయ్య ఆశ్చర్య పోయాడు. ఆప్యాయతను కాదన లేక అతిథి అయ్యాడు. ఆతిథ్యం పందిరిక్రింద అన్నాచెల్లెలూ బోలెడు కబుర్లు చెప్పు కున్నారు. వెళ్ళి పోయేముందు అన్నయ్య చెప్పాడు—"చెల్లాయ్! నేనిందాక క్రిందకు వచ్చింది ఆకలివల్ల కాదమ్మా,—శత్రువుని చీల్చి చెండాడుదామని—"వణికింది పావురమ్మ.

"అవునమ్మా! ఈ దుష్ట సర్పాల వల్ల మా అమ్మ ఎంత బాధ పడిందనీ—"!! వీళ్ళ జాతినంతా నాశనంచేస్తే గాని నేన్నిద్రపోను" అని పళ్ళు కొరికాడు గ్రద్దయ్య.

" పోన్లే అన్నయ్యా!... ఈ పాము మాత్రం నా నేస్తం కదా... అందుకనీ—" అంది పావురమ్మ...

" సరే అయితే...కాని వాళ్ళతో జాగ్రత్తగా వుండాలి సుమీ...వస్తామరి... " అని ఎగిరి పోయాడు గ్రద్దయ్య.

ఎంతెత్తున ఎగురుతాడో అన్నయ్య–అనుకుంది పావురమ్మ.
ఆపూటకు పాము బయటకు రాలేదు.
వానాకాలం వచ్చింది. పోయింది.

పావురమ్మకు పెళ్ళి అయింది. కొన్ని రోజులకు తల్లి అయింది...నాలుగుగ్రుడ్లు పెట్టింది పావురమ్మ.

...పావురమ్మ వాళ్ళాయన దూరంగా వున్న ఊరికి వెళ్ళాడు...

మరురోజు పొద్దున పావురమ్మ చిన్నచిన్న పుల్ల లేరుకుంటూ నేలమీదే ఎగురుకుంటూ పోతుంటె "బర్రుర్ర్." మని చప్పుడయింది. ఉలిక్కిపడి ఓ కొమ్మమీద కెగిరి కూచుంది పావురమ్మ.

కళ్ళకడ్డంగా అరచేతిని పెట్టుకు చూస్తూంది తన గుహముందు కూచుని వున్న ఎలుగుబంటి.

మొదట భయం పోగానే ఎలుగుబంటిని పలకరించింది పావురమ్మ "నమస్కారమండీ...కులాసానా ?" అని అడిగింది.

మళ్ళీ బర్ర్రుమంది ఎలుగుబంటి. అంటే లోపలికి రమ్మని కాబోలు అనుకుంది ఎలుగుబంటి భాష తెలియని పావురమ్మ.

—అనుకుని ఎలుగుబంటి గారింట్లోకి అడుగు వేయబోయింది. ఇంతలో గాలి వీచింది. గుప్పుమని వాసన వేసింది. పావురమ్మ సందేహపు కళ్ళకు ఏవో ఎముకల ప్రోగులు కనిపిస్తే... అమ్మయ్యో అనుకుంది. అజ్ఞానం నుండి ఒక్కడుగు బయటికి వేసింది. "ఇంకోసారి వస్తా ...పనివుంది..."అని చెప్పి ఎగిరిపోయింది.

"గట్టి పిల్లే—" అనుకుంది ఎలుగుబంటి.

పావురమ్మ ఇంటికొచ్చింది. ఇంకొకటి రెండు రోజులలో ఇంటినిండా పిల్లలు గలగల లాడుతుంటారు. వాళ్ళకు ఆహారం పెట్టాలి. ఎగరడం అవీ నేర్పాలి. యజమానుల్లూ, ఎలుగుబంట్లూ జాగ్రత్త అని చెప్పాలి...అనుకుంటూ వచ్చింది.

నోటిలోని పుల్లలను పక్కకుంచింది. ఉయ్యాలలోకి తొంగి చూసింది. అయ్యో ! ఇదేమిటి...నాలుగు గ్రుడ్లలో రెండే వున్నాయేమిటి !!

ఆకాశంనుండి అధః పాతాళానికి విసిరేసినట్లయింది.

పావురమ్మ గుండెల్లో వెయ్యి కొర్రచ్చులు పెట్టినట్లయింది.
ఏమిటి ఈ ఘాతుకం ?
ఎవరిది ఈ క్రౌర్యం ?
ఆయనకూడా తోడులేరే—
భోరుమని ఏడిచింది పావురమ్మ.
పాడుకుంటూ ఎగిరిపోయింది కాకి.

ఒకరు కుమిలిపోతుంటే ఇంకొకరికి పాటలెట్లావస్తాయో— పావురమ్మకు అర్థంకాలేదు.

కన్నీటి తడి ఆరకుండానే పావురమ్మకు ఒక నిజం తెలియసాగింది – "మనం మంచిగా వున్నంత మాత్రాన మనకు అందరూ మంచినే చెయ్యరు –"

కళ్ళు తుడుచుకుంది పావురమ్మ. ఎవరితోనయినా చెప్పుకుంటే బాగుండుననిపించింది. క్రిందకు ఎగిరింది. కాని అవేమిటి ? ఆ పుట్టమీద ఆ తెల్ల పెంకులు ఏమిటి ? తన గ్రుడ్లవికావూ... అయ్యో ! ఎంత మోసం !

తాను నమ్మిన నేస్తం తన గ్రుడ్లను తిన్నదా ?

ఇంక స్నేహానికి విలువేమిటి ? ఆత్మీయతకు అర్థమేవిటి?
హత్యకు మోసం కలిసింది. గుండె మంటతో తుఫాను కలిసింది.

పాపురమ్మ తన ఇంట్లోకి వచ్చింది. రెండు రోజులపాటు ఆలోచించింది. మోసాన్ని మోసంతో ఎదుర్కోవాలని నిర్ణయించుకుంది. మంచితనం అంటే బలహీనత కాదని చెప్పాలనిపించింది.

మూడోరోజు పొద్దున్న ఇల్లువిడిచి బయటికి వచ్చింది. ప్రక్కవూరిదాక ఎగిరివెళ్ళింది. తిరగ్గా తిరగ్గా తనకు కావలసిన యిల్లు కనపడింది. ఉత్సాహంతో వెనక్కొచ్చింది పాపురమ్మ. తన ఇల్లు చేరింది. క్రిందకు దిగింది.

"నేస్తం!" అని తియ్యగా పిలిచింది.

నాలుగయిదుసార్లు పిలిచినాక బయటికి వచ్చింది నేస్తం.

"మరే, ఇవ్వాళేమో నేనో చోటు చూశాను. అక్కడ ఎన్నోరకాల ఆహారాలున్నాయి. వసతులు బోలెడున్నాయి. అంచేతేమో అక్కడికి వెళ్ళిపోతే ఏ ఇబ్బందీ లేక హాయిగా వుండొచ్చు మీరుకూడ వస్తారా — అని అడిగింది పాపురమ్మ.

"ఊహు...నేను రానమ్మా...ఇక్కడే పుట్టి పెరిగిందాన్ని కద, ఈ చోటు విడిచి ఎట్లారానూ—" అని జవాబు వచ్చింది.

"మనిద్దరం ఇంత ప్రాణస్నేహితులంకదా కలిసి వుందామనుకున్నా...పోనీలెండి పెద్దలుకద నేను వెళ్ళబోయే చోటుని వచ్చి చూడండి కనీసం—" అంది పాపురమ్మ.

"సరే!" అంది నేస్తం.

పాపురమ్మ ముందెగురగా వెనుక నడిచింది నేస్తం.

పొద్దున చూచివచ్చిన వూరు చేరింది పాపురమ్మ.

ఆ ఇల్లుకూడా సమీపించింది. "ఇక్కడే అన్నీదొరికేవి—" అంది పాపురమ్మ. నేస్తం కళ్లు మిలమిల మెరిశాయి.

ఈ లోపుగానే ఆ ఇంట్లోని అబ్బాయి చూశాడు మిలమిల లాడుతున్న నేస్తాన్ని ... "నాన్నోయ్...రెండు తలల పామేవ్!" అని అరిచాడు.

నాన్న వచ్చాడు నాగస్వరంతో. నాగస్వరం పాడిన పాటకు నేస్తం నాట్యం చేసింది. పదినిమిషాల తర్వాత హఠాత్తుగా చీకటి చుట్టుముట్టినట్లయింది నేస్తానికి. రెండుతలలపాము పట్టుబడడం పెద్ద పండగలావుంది పాములవాడికి.

వెనక్కు ఎగిరింది పాపురమ్మ.

ఇంటికొచ్చేసరికి, ఆశ్చర్యం! గ్రద్దన్నయ్య వున్నాడు. ఇంకా ఆశ్చర్యం: అన్నయ్య కాలిగోళ్ళమధ్య ఇరుక్కుని వుంది కాకి.

కళ్ళతో అడిగింది పాపురమ్మ.

త్రుళ్లుతూ చెప్పాడు గ్రద్దయ్య. తాను చెల్లాయిని చూద్దామని వచ్చేసరికి ఆ కాకి కాస్తా పాపురమ్మ గ్రుడ్డుని తీసి క్రిందవున్న పుట్టముందు వేయబోతున్నదట!

సంభ్రమించిపోయింది పాపురమ్మ. "నే చెప్పానుకదమ్మా, ప్రపంచంలో దుర్మార్గులెక్కువనీ.." అన్నాడు గ్రద్దయ్య వేళ్ళని వదిలిస్తూ.

కాకి క్రింద రాలింది.

"అవునన్నయ్యా! చెడ్డవాళ్ళున్నారు. కాని నీలాటి మంచి వాళ్ళూ వున్నారు. అంతేకాదు — నెమ్మదిగా, చాలా నెమ్మదిగా మంచే జయిస్తుంది. అదొక్కటే కలకాలం నిలుస్తుంది." అంది పాపురమ్మ

—నిజంలాగున వెలిగాడు సూర్యుడు.

ప్రాణంలాగున వెచ్చగావుంది భూమి. ★

ఉత్సవాలు

'రాష్ట్ర జన వారోత్సవాలు'

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామంలోనూ ఆంధ్ర సంస్కృతీ పునరుద్ధరణ ప్రధాన లక్ష్యంగా రాష్ట్రజన వారోత్సవాలు అనే కార్యక్రమాన్నొకదానిని జనసంబంధశాఖ యోజించింది.

వారంరోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ప్రతి యేడాదీ జనవరి 8 వ తేదీ నుంచి జనవరి 14 వ తేదీ వరకు జరుగుతాయి. 1968 జనవరి 8 వ తేదీతో ఈఉత్సవాలకు ప్రారంభం జరుగుతుంది. జనసంబంధశాఖ, విజ్ఞులనేకులతో సంప్రదించి గ్రామస్థాయిలో, బ్లాకుస్థాయిలో, జిల్లా స్థాయిలో, మండలస్థాయిలో, రాష్ట్రస్థాయిలో వివిధ సాంఘిక-ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన వాటిలో పోటీలను జరిపించే విషయమై ఒక జాబితాను తయారుచేసింది.


ప్రజలలో ఒక రకమైన సమిష్టి సాంఘిక దృక్పథాన్ని కలిగించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశం. మన దేశంవంటి సువిశాల ప్రజాస్వామిక దేశంలో ప్రజలు వారి వారి బాధ్యతలను, హక్కులను, వారి గుణగణాలను, అభిరుచులను తెలుసుకొనేట్టు చేయడం చాలా అవసరం. ప్రజల జీవనరంగంలోని అన్ని కోణాలలోనూ వారి వారి ప్రతిభలను గుర్తించి, వారి అభిరుచులకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు, వారిని ప్రోత్సహించేందుకు ప్రజలకు అవకాశాలను కలిగించడం చాలా అవసరం. ఈ విషయాన్ని గుర్తించి జనవరి రెండవ వారంలో ఒక వారం రోజులపాటు ఉత్సవాన్నొకదానిని నిర్వహించాలని ప్రభుత్వం ఉద్దేశించింది. ఎందుకంటే జనవరి రెండవవారం అన్ని విధాలు గ్రామీణ ప్రజానీకానికి ఆనంద దాయకమైన కాలం.

ఈ ఉత్సవాన్ని ప్రతియేటా జరిపి ... ప్రభుత్వం భావిస్తున్నది. దీనిలో అన్ని స్థాయిలలోనూ ప్రజలందరూ పాల్గొని తద్వారా ... జీవన సౌభాగ్య... స్వాములు కాగలిగేట్టు చూడాలన్నది ప్రభుత్వోద్దేశం. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే అన్ని ప్రభుత్వశాఖల సహకారం, స్థానిక సంస్థలు పంచాయతీరాజ్ సంస్థల సహకారం, సాంఘిక కార్యకర్తల సహకారం అవసరం.

పౌరసంస్థల ప్రతినిధులతో ఏర్పాటైన సామాజిక కేంద్రం గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. సామాజిక కేంద్రం లేనిచోట్ల ఒక ఉత్సవ నిర్వహణ సంఘం ఏర్పాటై అడ్‌హాక్ సామాజిక కేంద్రంగా పనిచేస్తుంది.

ఈ జనవారోత్సవాలను జరపడానికి రాష్ట్రాన్ని ఆరు మండలాలుగా విభాగించడం జరిగింది. హైదరాబాదు నగరం మండలంగానూ, జిల్లాగానూ వ్యవహరించ బడుతుంది. ప్రతి మునిసిపల్ వార్డూ ఒక సామాజిక బ్లాకుగా వ్యవహరించ బడుతుంది.

జనవారోత్సవాలలో ఒక్కొక్క రోజును ఒక్కొక్క ప్రత్యేక వర్గ కార్యక్రమాలకు ప్రత్యేకించారు. ఉత్సవం తొలిరోజు జనవరి 8 వ తేదీన వ్యవసాయ, నేత పని, గొర్రెల పెంపకం, చేపలవేట, వడ్రంగం, ఫొటోగ్రఫీ, వాణిజ్యం వంటి వృత్తిపనులలో పోటీలను నిర్వహిస్తారు. మరునాటిరోజున, పాడిపరిశ్రమ, కోళ్ళపెంపకం వంటి అనుబంధ వృత్తులకు కేటాయించారు. మూడవరోజు పశువులదినం. నాలుగవ రోజు ఆటలు క్రీడలు, వ్యాయామ దినం. ఈ రోజు కార్యక్రమంలో 26 రకాల అంశాలువున్నాయి. వీటిలో పోటీలు జరుపుతారు. అయిదవరోజు సాంస్కృతిక కార్యక్రమాలకు, ఆరవరోజు సాంఘిక సేవకు కేటాయించారు. కడపటి దినం అంటే జనవరి 14 వ తేదీ ఆనందోత్సవ దినం. ఆరోజు అలంకరణలో పోటీ జరుగుతుంది. ఇళ్ళను, పరిసరాలను అలంకరించి, జీవితాలను ఆనందమయం చేసుకోవడానికి యిది తోడ్పడుతుంది. ★



ఆంధ్రప్రదేశ్ గవర్నరు డిసెంబరు 8 వ తేదీన విశాఖపట్టణం నావల్ బేస్ వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

[illegible]

అట్లూరి వెంకటేశ్వర రావు

సాంఘిక జీవనము

టోకియో,

20-10-1963

చిరంజీవులయిన పెద్దబాబు చిన్నబాబులను మీనాన్న దీవించి వ్రాయునది ఏమనగా —


ఇక్కడి సాంఘిక పరిస్థితులు, ప్రజల ఆచార వ్యవహారాలు భోజన పదార్థాలు మొదలయిన వాటిని గూర్చి వ్రాయలేదనికదా వ్రాసారు? అవును—ఇంతవరకు చిన్నపిల్లలను గూర్చి లేఖలు వ్రాసియుంటిని. ఇప్పుడు వారి తల్లిదండ్రులను గూర్చి కూడ కొన్ని విషయాలు వ్రాస్తాను.

టోకియో అంత పెద్దపట్టణం ఇంకోటి లేదు

టోకియో ప్రపంచంలో కల్లా పెద్ద పట్టణము. ఈ పట్టణంలో షుమారు ఒక కోటి మంది ప్రజలు నివసిస్తారు. అనగా మన ఆంధ్రప్రదేశ్‌లో నివసించు జనాభాలో మూడోవంతు ఒక్క టోకియో మహాపట్టణంలోనే ఉన్నారు. అందువలన జన సమ్మర్దం ఎక్కువగా ఉండును.

భూకంపాలకు పుట్టినిల్లు

స్థలము చాలతక్కువగా ఉండుట వలన చిన్న ఇళ్లు కట్టుకొంటారు. ఇక్కడ భూకంపాలు ఎక్కువ. అందువలన ఇండ్లను కొయ్యతో కట్టుకొంటారు. ఇక్కడ భూకంపాలవలన కొయ్యతో నిర్మించిన గృహాలు భూమి కంపించినను పెద్దగా పాడుకావు. ఈ ఇండ్లలో కుర్చీలుగాని, బల్లలు గాని, మంచములుగాని ఉండవు. వీరు నేలమీదనే కూర్చుంటారు, పడుకొంటారు. వీరి ఇండ్లలో నేల కొయ్యతో చేయబడినదానిపై చక్కటి చాప మెత్తతో బిగించబడి ఉండును. ఇంటిలోనికి వచ్చునప్పుడు కాలిజోళ్ళను బయట విడచి ఇంటిలో ఉపయోగించు జోళ్ళను తొడుగుకొని లోపలికి రావలెను. అందువలన బయట దుమ్ము లోపలికిరాదు. ఇళ్ళన్నియు శుభ్రముగా వుండును.



నిర్మాణంలోవున్న గృహం

ఇంటిలోని వస్తువులన్నియు చక్కగా సర్ది అందముగా ఉంచుతారు. ఇక్కడ దొంగల భయములేనందున తలుపులకు తాళములు వేయవలసిన అవసరం లేదు. ఇక్కడి ప్రజలు ఇంకొకరి వస్తువులను ఆశించరు. అసలు బిచ్చము ఎత్తుకొనువారు లేరు. వీరి ఇండ్లు సన్నని చెక్కలతో చేయబడి అతి నాజూకుగా నుండును. ఈ పై ఛాయాచిత్రంలో నిర్మాణంలోనున్న ఒక ఇంటిని చూడవచ్చును.

పని మనుషులు అవసరంలేదు

ప్రతి ఇంటిలోను టెలివిజను, రేడియో, బట్టలఉతుకు మిషను, శీతల యంత్రము, వంటలకుపయోగించు పరికరములు మొదలైన అనేక వస్తువులుండును. వీటి సాయముతో పని మనుష్యుల అవసరం లేకయే ఇంటిలోని వారే ఇంటి పనులన్నియు చేసికొంటారు. అందువలన ఇంటిలోని ప్రతివ్యక్తికి కొన్ని నిర్ణీత బాధ్యతలు ఉంటాయి. వీరు వంట గ్యాస్ సహాయముతో గానీ, విద్యుత్ సహాయముతో గానీ చేయుదురు. అందువలన వంట ఇల్లు చాల శుభ్రముగా నుండును.

జలచరాలే జపాను ఆహారం

ఇక్కడి ప్రజలందరూ అన్నం తింటారు. అన్నము మన మాదిరిగా వండక ముద్దవలె వండుతారు. వీరు అన్నంలో ఏమీ కలుపుకొనితినరు. ముద్దగానున్న అన్నము పుల్లల సాయంతో తీసుకొని

నోటిలో పెట్టుకొని ఏదయిన కూరను నంజుకొందురు. వీరు చేతులతో అన్నం తినరు. అందువలనే పుల్లలు వాడుతారు. వీరందరూ మాంసాహారులే. ఎక్కువగా చేపలు, నత్తలు, పీతలు, రొయ్యలు మొదలైన జలచరములను భుజిస్తారు. ఈ దేశంచుట్టు సముద్రము ఉండుటవలన సముద్రంలో దొరకు వస్తువులనే ఎక్కువ భుజిస్తారు. కూరగాయలు ఎక్కువగా ఉన్నప్పటికి వాటిని వండకుండానే భుజిస్తారు. అసలు వీరికి పులుసుల వంటివి వండుట చేతకాదు. దాదాపు అన్నివస్తువులను ఉడికించిగాని, వేయించి గాని భుజిస్తారు. దాదాపు అందరూ మూడుసార్లు భోజనంచేస్తారు. సామాన్యంగా ఉదయము అందరూ ఏడున్నర గంటలకే వేడి అన్నము తిని పనులలోనికి వెళ్లతారు. పనిలోనికి వెళ్లునప్పుడే మధ్యాహ్నము భోజనముకూడ తీసుకొని వెళ్లతారు. మరల రాత్రి ఎనిమిది గంటలకు భోజనముచేస్తారు. వీరు చాల పుష్టికరమయిన భోజనము చేయుట వలన అందరూ ఆరోగ్యముగా నుందురు. అన్నము మూడుసార్లు తిన్నప్పటికి ప్రతి తడవ చాలకొద్దిగానే తీసుకొంటారు. పాలు పండ్లు గుడ్లు ఎక్కువగా వాడుతారు. వీరికి భోజనము రుచికరముగా నుండనక్కరలేదు. వీరికి వంటలో మనము వాడు చింతపండు, కారము, మసాలాదినుసులు మొదలయిన వాని ఉపయోగాలు తెలియవు. అందువలన వీరివంట చాల సులువు. వీరికి కావలసినది బలము నిచ్చు పుష్టికరమయిన పెరుగు, మజ్జిగ తెలియనే తెలియదు. నెయ్యి అసలే లేదు. అందువలననే వీరు వంటచేయుటకు గాని తినుటకుగాని ఎక్కువ సమయము వృథా చేయరు. ఇక్కడ స్త్రీలకు వంట సులువయిన పని.

ఇంగ్లీషు మోజు

ఇక్కడ జపానుభాష రానిదే బయట ఎవరితోను మాట్లాడ డానికి వీలుండదు. ఇక్కడ అందరూ ఆంగ్లభాషను ఉన్నత పాఠశాలలో అభ్యసించినప్పటికి, దానిని మాట్లాడుటకు సిగ్గుపడతారు. దాదాపు ఎనిమిది సంవత్సరములు ఆంగ్లభాషను అభ్యసించినప్పటికిని కళాశాల విద్యార్థులుకూడా ఆ భాష మాట్లాడుటకు సిగ్గుపడతారు. ఆంగ్లభాష మాట్లాడుటకు వారు చాల ప్రయత్నిస్తారు. కాని అది వారికి సాధ్యపడదు. అందరు ఆ భాషను చదివి అర్థము చేసికొందురు గాని మాట్లాడలేరు. ఇందువలన ఆ దేశభాష రానిదే అక్కడి ప్రజలతో సంభాషించుట చాల కష్టం.

తిట్లులేని భాష - పోరులేని ప్రజలు

ఈ దేశంలోని ప్రజలు చాలా మర్యాదస్థులు. వారిలో వారు పోట్లాడుకొనుటగాని, గట్టిగా అర్చుకొనుటగాని నేను చూడలేదు. రోజులా నవ్వుతూ ఉంటారు. వారి భాషలో తిట్లులేవట. రైల్లో ప్రయాణముచేయునపుడు ఒకరితో నొకరు మాట్లాడుకొనరు. ప్రతి ఒక్కరు ఏదో పుస్తకం చదువుకొంటారు. అందువలన రైల్లో జనసమ్మర్దం ఎంత ఎక్కువగా నున్నను నిశ్శబ్దంగా నుండును. రైళ్లు అలస్యంగా వచ్చుట అనునది ఇక్కడ ప్రజలు ఎరుగరు. రోడ్లపై గూడ ఎంతజనసమ్మర్దంగా నున్నను నిశ్శబ్దంగా నుండును. కార్లు కూడ హారన్ వేయకుండా నడుపుతారు. అసలు కార్లకు హారన్లు ఉన్నవా అను సందేహము వచ్చి కొందరిని అడిగినాను. కార్లకు హారన్ ఉన్నప్పటికి వాటిని వాడరని వారు నాకు చెప్పిరి. ఎవరూ రోడ్లపై చెత్త మొదలయిన వాటిని పారవేయరు. రోడ్లన్నియు పరిశుభ్రముగా నుండును.

భూగర్భంలో రైలుమార్గాలు

ఇక్కడి రైళ్ళలో తలుపులు దానంతట అవే తెరచుకొని వాటంతటవే మూసుకొంటాయి. దీనిమీద గార్డుపట్టుంటుంది. అందువలన ఎవరూ ప్రక్కల వ్రేలాడుటకు వీలులేదు. జనసమ్మర్దం ఎక్కువగా నున్నను అందరు వరసలో నిలబడి క్రమపద్ధతిలో నడచుకొంటారు. ఒకరితో ఒకరు పోట్లాడి ఎక్కరు. ముందు దిగువారికి సమయము ఇచ్చి అందరూ దిగినతరువాత వరుసగా ఎక్కుతారు. భూమి అడుగునకూడ రైలు మార్గములున్నవి. ఈ రైళ్లు సొరంగ మార్గముండ పోతాయి. భూమిపై స్థలము లేకపోవుట వలన ఈ విధంగా ఏర్పాట్లు చేసారు. రైళ్ళలో ఎక్కిన పిదప భూమి అడుగున ప్రయాణం చేస్తున్నట్లు తెలియదు. రైలు దిగిన పిదప పైకి వచ్చునప్పుడు మాత్రం అడుగునుండి వచ్చుచున్నట్లు తెలియును.

ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ కాదు

ఇక్కడ మనుష్యు లనేకులు. వీరికి వేరే రకమైన నాణెములు ఉన్నవి. వీరి నాణెములను యెన్నులు అందురు. వీరి డెబ్బదియైదు యెన్నులు మన రూపాయికి సమానము. ఇక్కడ దాదాపు అందరికి అనగా కాయకష్టము చేయువారికి, ఆఫీసులో పనిచేయువారికి_ఒకే జీతం. ఉద్యోగాలను బట్టిగాని, బట్టలను బట్టి గాని వ్యక్తుల విలువను నిర్ణయించరు. ప్రతి వ్యక్తి సమానము. అందరూ గౌరవింపదగినవారేనని వారి ఉద్దేశ్యము. అందువలన ఈ పనిచేసిన గౌరవం తక్కువ, ఆ పని చేసిన గౌరవం ఎక్కువ అనెడి భావం వారిలో లేదు. ఎవరిపనులు వారే వీలైనంతవరకు చేసికొంటారు. ఒకరిపై ఆధారపడుటను నీచంగా భావిస్తారు.

వేడినీటి స్నానాలు

ఇక్కడ చలి ఎక్కువగా ఉండుటవలన వీరు స్నానం చేయుటకు చాల వేడినీరు కావలెను. దీనికి ప్రతిఇంటిలో ప్రత్యేక ఏర్పాట్లు ఉండవు. అందువలన కొన్ని ఇండ్లకు కలిపి ఒకచోట స్నానవాటిక ఉండును. అక్కడ స్నానానికి ఒక పావలా పుచ్చుకొంటారు. అక్కడ పెద్ద తొట్టిలాంటి దానిలో వేడినీరు ఉండును. ఈ నీటిలో దిగి 20 లేక 30 మంది ఒకేసారి స్నానం చేయవచ్చును. ఈ తొట్టిలో దిగుటకు ముందు శరీరమంతయు ప్రక్కనే ఉన్న కొళాయిలవద్ద కడుక్కొనవలెను. మన శరీరంలోని మలినపదార్థం ఆ తొట్టిలోని నీటిలో కలువగూడదు. ఆ తొట్టిలో ఎంతసేపయినను ఉండవచ్చును. ఇక్కడ అందరూ రాత్రిభోజనాలు అయిన పిదప, పనులన్నియు పూర్తి చేసుకొని సుమారు 9 గంటలకు స్నానాలకు వెళతారు. అక్కడ గంటసేపు స్నానముచేసి ఇంటికివచ్చి బాగుగా నిద్రపోతారు. ఇది యీ దేశపు ఆచారము. స్నానాలకు వెళ్ల



దేవాలయంలో

నప్పుడు కుటుంబంలోని సభ్యులందరు కలిసివెళ్లి కలసివస్తారు చిన్నపిల్లలు, ఆడపిల్లలు, తల్లి కలిసి ఆడవారు స్నానాలు చేయు చోటుకు వెళతారు. ఎక్కడో కొద్దిమంది తప్ప అందరు ఇటువంటి స్థలములకే వెళ్లి స్నానాలు చేస్తారు.

సముద్రంలోని భూమిమీద

అత్యద్భుతమైన పట్టణం—

19 ర్వ సంవత్సరంలో టోకియో పట్టణం దాదాపు నేల మట్టమైపోయింది. రెండవ ప్రపంచసంగ్రామంలో టోకియోలోని ముఖ్యమైన ప్రదేశాలన్నీ శత్రు విమానదాడులకు గురియైనవి. దానికి తార్కాణంగా ఇప్పుడు టోకియోలో పాత కట్టడములు లేనేలేవు. ఈ పద్దెనిమిది సంవత్సరాల కాలంలో అనగా రెండవ ప్రపంచ యుద్ధానంతరము క్రొత్తగా నిర్మించిన టోకియో పట్టణం ప్రపంచంలోకెల్ల పెద్ద పట్టణంగా రూపొందినది. దీనికంతకు ఆ దేశస్థుల నిర్విరామ కృషియే కారణము. ఇప్పుడు ఏ ప్రక్కకు పోయినను బ్రహ్మాండమయిన యంత్రశాలలు ప్రపంచములోని అన్ని దేశాలకు కావలసిన యంత్రపరికరాలను తయారు చేయుచున్నవి. జపాను ప్రజలనుండి మనం నేర్చుకోవలసినది ఏమిటంటే — వీరికి స్వభావ సిద్ధముగాఉన్న భూమి చాలనందున సముద్రాన్ని పూడ్చి నూతనంగా భూమిని సృష్టించుకొనుచున్నారు. టోకియో పట్టణమునకు మూడు వైపుల సముద్రముండుటచే ఆ పట్టణ అభివృద్ధికి సముద్రమును పూడ్చి భూమిక్రింద మార్చవలసిన అవసరము ఏర్పడినది. ఇప్పుడు దాదాపు అన్ని పెద్ద కర్మాగారములూ అట్లు క్రొత్తగా సృష్టించిన భూమిమీదనే నిర్మించబడినవి. అందువల్ల వీరు శిథిలమయిన పట్టణమునేగాక నూతనంగా భూమినికూడ సృష్టించి ఈ పద్దెనిమిది సంవత్సరములలో ప్రపంచంలోకెల్ల పెద్ద పట్టణమును నిర్మించగలిగిరి. ప్రజలందరూ దీక్షాకంకణులయి కృషి చేస్తే సాధించలేని పని ఏదీ ఉండదు.



దేవాలయంలోని భక్తులతో రచయిత

దేవునిమీద భక్తి

ఇక్కడి ప్రజలందరునూ నూతన సంవత్సర ఆరంభంలో జాతీయ దుస్తులు ధరించి దేవాలయాలకు వెళ్లి ప్రార్థనలు జరుపుతారు. వీరికి మతము యందు పెద్ద పట్టింపులేనప్పటికి దేవుని యందు భక్తియున్నది. ఈ పైన ప్రచురించిన రెండు ఛాయా చిత్రములు ఇక్కడ ఉన్న పెద్ద దేవాలయములో తీసినవి. ఇక్కడ దేవాలయములు చాల శుభ్రముగాను, అందముగాను ఉండును. మామూలుగా వీరు పాశ్చాత్య దుస్తులను ధరించినప్పటికి నూతన సంవత్సరారంభములో తప్పక జాతీయ దుస్తులను ధరింతురు. ముఖ్యంగా స్త్రీలు జాతీయదుస్తులను ధరించి వారు ఉద్యోగముచేయు కార్యాలయములకు వెళ్లి అందరికి శుభాకాంక్షలు తెలియపర్చెదరు.

ఈ దేశంలోని కార్మికులలో సగం మంది స్త్రీలే. స్త్రీలు చేయలేని పనులు ఈ దేశములో లేనేలేవు. అతిసున్నితమయిన పనినుండి ట్రాక్టరు నడుపు పనివరకు అన్ని పనులను స్త్రీలే నిర్వహించుచున్నారు. సామాన్యముగా స్త్రీలే బాగా పనిచేస్తారని ఇక్కడి యజమానుల అభిప్రాయము. అందువల్లనే వీలయినంత ఎక్కువ మంది స్త్రీలను ఉద్యోగాలలో చేర్చుకొందురు. ఇక్కడి జీవన వ్యయము చాల ఎక్కువగా ఉండుటవలన భార్యాభర్తలు కలిసి సంపాదించనిదే కుటుంబ ఖర్చులు భరించుట కష్టము. స్త్రీలు ఉద్యోగము చేసివచ్చిన పిదప గృహకృత్యాలను తామే స్వయంగా చేసికొనవలెను. మొత్తముమీద పురుషులకంటె స్త్రీలే ఎక్కువ పని చేస్తారు.

ఇట్లు


మీ ప్రియమయిన నాన్న

క్రీడారంగం

—జై రాజ్

హైదరాబాదులోని లాల్‌బహదూర్ స్టేడియంలో డిసెంబరు 16, 17 తేదీల్లో జరిగిన ఆరవ జాతీయ బహిరంగ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో సర్వీసెస్ జట్టు ఘన విజయం సాధించింది. పురుషులకు ఉద్దేశించిన 24 పోటీలలోనూ పధ్నాలుగింటిలో సర్వీసెస్ క్రీడాకారులు గెలుపొందారు.


సర్వీసెస్‌కు చెందిన జోరాసింగ్‌కు ఉన్నత గౌరవం లభించింది. ఆయన 26 మైళ్ళ దూరాన్ని 2 గంటల 23 నిమిషాల 32.8 సెకన్ల సమయంలో పరుగెత్తి జాతీయ, ఆసియా ప్రమాణాలను అధిగమించాడు.



పురుషుల సైకిలు పందాలు

జోరాసింగ్ ఆసాంతం చక్కగా పరుగెత్తాడు. సగందూరం వరకూ సర్వీసెస్‌కే చెందిన హకీమ్‌సింగ్, గుర్నాయబ్‌సింగ్‌లు కూడా ఆయనతో కలిసి పరుగెత్తారు. జోరాసింగ్, మార్గమధ్యంలో అందజేసిన రెఫ్రెష్మెంట్లనుకూడా నిరాకరిస్తూ అగ్రగామిగా పరుగెత్తాడు. ఆయన స్టేడియంకు చేరుకున్నప్పుడు ఆయనకు ఘన స్వాగతం లభించింది. హకీమ్‌సింగ్ ద్వితీయుడుగా వచ్చాడు, ఆయనకూడా జాతీయ, ఆసియా ప్రమాణాలను అధిగమించాడు. ఆయన జోరాకంటే ఒక నిమిషం 15.8 సెకన్లు ఆలస్యంగా వచ్చాడు.

అదే రోజు ఉదయం స్టేడియంలో ప్రేక్షకులను ఆకర్షించిన మరో పోటీ 20 కిలోమీటర్ల నడక పందెం. యు. ఎస్. ఎస్. ఆర్. క్రీడా కారుడు గొలుబ్‌నిచీ నెలకొల్పిన ప్రపంచ రికార్డు (ఒక గంట 27 నిమిషాల 6 సెకన్లు)కు సర్వీసెస్‌కు చెందిన బచన్‌సింగ్ చేరుకోనలేక పోయాడంటూ చేసిన ప్రకటన ప్రేక్షకులకు నిరాశ, సంతోషంకూడా కలిగించింది. కేవలం 52.6 సెకన్ల తేడా వల్లనే



ఆటంకాల పరుగు (హర్డిల్స్) పోటీలు

ఆయనకు అపూర్వ గౌరవం అందకుండా పోయినందుకు నిరాశ కలుగగా, బచన్‌సింగ్ అంతటి సామర్థ్యం ప్రదర్శించ గలిగినందుకు సంతోషం కలిగింది. అయితే బచన్‌సింగ్ లోగడ పదమ్‌సింగ్ నెలకొల్పిన మీట్ రికార్డునూ, జోరాసింగ్ సాధించిన జాతీయ రికార్డునూ దాటాడు.

మైసూరు అథ్లెటు కె.ఎల్. పొవెల్ నుంచి చాలా ఆశించడం జరిగింది. ఆయన బాగానే పరుగెత్తి నప్పటికీ 100 మీటర్ల పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెంలోకూడా ద్వితీయుడుగానే వచ్చాడు. 100 మీటర్ల పందెంలో రైల్వేలకు చెందిన రాజశేఖరన్ 10.7 సెకన్లతో ప్రథముడుగా వచ్చారు. పొవెల్ 0.1 సెకను వెనుక బడ్డాడు. 200 మీటర్ల పందెంలో గెలుపొందడానికి ఆయనా విశ్వ ప్రయత్నం చేశాడు. విజేత ఏ. ఎస్. వి. ప్రసాద్ (పశ్చిమ బెంగాల్) పరుగెత్తినంత సమయంలోనే ఆయనకూడా ఆ దూరాన్ని పరుగెత్తాడు. కాని ప్రసాద్ కొద్దిగా ముందు వుండడంవల్ల ఆయనకు ప్రథమ స్థానం ఇచ్చారు.

సర్వీసెస్ క్రీడాకారుడు కృపాల్‌సింగ్ జంట బిరుదాలను సాధించాడు. 5,000 మీటర్ల పందెం, 10,000 మీటర్ల పందెంలో కూడా ఆయన విజయం సాధించాడు. 5,000 మీటర్ల పందెంలో ఆయన తమ జట్టుకే చెందిన అత్మాసింగ్‌ను అధిగమించాడు. 10,000 మీటర్ల పందెంలో తన సహచరుడు మొహిందర్‌సింగ్ కంటే మిన్నగా వచ్చాడు. మొహిందర్‌సింగ్ రెండవస్థానం పొందాడు. ఈ రెండు పోటీలలోనూ బచ్చూరామ్ తృతీయుడుగా వచ్చాడు. ఇతను రక్షణశాఖ ఉద్యోగి కాబట్టి ఆంధ్రప్రదేశ్‌కు

ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అన్ని స్థానాలూ సర్వీసెస్ వారే గెలుచుకున్నట్లుగా పరిగణించవచ్చు.

ఆసియా ప్రమాణం సృష్టించిన ప్రవీణ్ కుమార్, ఛాంపియన్ షిప్ పోటీలు జరిగిన రెండు రోజులలోనూ అందరి దృష్టిని ఆకర్షించాడు. పోలీసు స్పోర్ట్స్ కంట్రోలు బోర్డుకు చెందిన పొడగరి, దృఢకాయుడు అయిన ఈ క్రీడాకారుడు డిస్కస్, హామర్ త్రో పోటీలలో విజయం సాధించాడు. ఈ రెంటింటిలోనూ ఆయన కొత్త ప్రమాణాలు నెలకొల్పాడు. డిస్కస్ త్రో లో క్రిందటేడు తాను సృష్టించిన 51.70 మీటర్ల ప్రమాణాన్ని మించి 52.06 మీటర్ల కొత్త ప్రమాణాన్ని నెలకొల్పాడు. ఆయన యిదే స్థాయిలో పురోగతి సాధించే పక్షంలో, 1968 లో మెక్సికోలో జరిగే ఒలంపిక్ పోటీలలో గణ్యతలోకి రావడం తథ్యం. హామర్ త్రో లో కూడ ఆయన క్రిందటిసారి తాను ఏర్పరిచిన ప్రమాణం కంటే పాయింటు 81 మీటర్ల మేరకు అభివృద్ధిని సాధించాడు.



ఆసియా రికార్డ్ హోల్డర్ ప్రవీణ్ కుమార్


షాట్ పుట్ లో, జోగిందర్ సింగ్ 16.13 మీటర్లతో కొత్త ప్రమాణం స్థాపించాడు. లాంగ్ జంప్ లో, రైల్వేస్ క్రీడాకారుడు కె. ఎస్. ఆల్వారామ్ మెహార్ (సర్వీసెస్) పేరిట వున్న పూర్వపు ప్రమాణాన్ని అధిగమించాడు.

పోల్ వాల్ట్ లో పోటీదారెవ్వరూ మీట్ రికార్డు పరిధాపులకు చేరకపోయినప్పటికీ మొదటి మూడు స్థానాలు పొందినవారు గట్టి పోటీ ప్రదర్శించారు. వీళ్ళందరూ 3.89 మీటర్లను సాధించగలిగారు కాని 3.90 మీటర్లను సాధించలేక పోయారు. ఫౌల్స్ తక్కువ చేయడంవల్ల రైల్వేస్ క్రీడాకారుడు ఎ. రామచంద్రన్ కు ప్రథమ స్థానం ఇచ్చారు. యిదే కారణంవల్ల సర్వీ (బీహారు) ద్వితీయ స్థానం పొందాడు. ఆతరువాతి శ్రేణి దివాన్ సింగ్ ది.

హాప్ స్టెప్ జంప్ నిపుణుడు లాబ్ సింగ్ (సర్వీసెస్) అభిమానులను నిరాశపరిచాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయాల ట్రిపిల్ జంపర్ ఎస్. పి. పిళ్ళైకే మొదటి స్థానం లభించగా ఆయనకు రెండవ స్థానం లభించింది.

మహిళల పోటీలు

మహిళల కొరకు ఆరు పోటీలు మాత్రమే జరిగాయి. స్త్రీల నిమిత్తం పోటీలు తక్కువ సంఖ్యలో జరగడంవల్ల క్రీడారంగంలో ప్రఖ్యాతులైన కొందరు యితర మహిళలను చూచే అవకాశం రాజధాని ప్రేక్షకులకు కలుగలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికు చెందిన మజిత్ హాలియా 100 మీటర్ల, 200 మీటర్ల పందేలలో అద్భుత సామర్థ్యం ప్రదర్శించి గెలుపొందింది. 100 మీటర్ల పందెంలో మెచ్. హాఫన్ (రైల్వేస్) హలియాకు గట్టి ప్రత్యర్థిగా నిలిచింది.



స్త్రీల సైకిలు పందాలు

మహిళల పోటీలలో రెండు కొత్త మీట్ రికార్డులను స్థాపించారు. లాంగ్ జంప్ లో రాజేనంది (రైల్వేస్) 5.38 మీటర్లలో కొత్త రికార్డు నెలకొల్పింది. 400 మీటర్ల పందెంలో హార్వెల్ బ్రార్ 59.8 సెకన్ల రికార్డు సమయంలో గెలుపు సాధించింది.

క్రీడా కారుల ప్రతిభాసామర్థ్యాల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేక పోయినప్పటికీ, అథ్లెట్లు ఎనిమిది మీట్ రికార్డులను అధిగమించడాన్ని ప్రేక్షకులు ఆసక్తితో తిలకించారు. వీటిలో ఒకటి ఆసియా రికార్డును, నాలుగు జాతీయ రికార్డులను సైతం మించాయి. హైదరాబాదులో జాతీయ బహిరంగ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్స్ జరగడం యిదే ప్రథమం. ఈ అంశం దృష్ట్యా యిది చాలావిజయవంతంగా ముగిసిందనవచ్చు. రాష్ట్ర గవర్నరు శ్రీ పట్టం ఎ. థానుపిళ్లై ఛాంపియన్ షిప్స్ ను ప్రారంభోత్సవం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ కౌన్సిలు అధ్యక్షుడు శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి సమాప్తి పరిచారు.

క్రికెట్

మొయినుద్దౌలా గోల్డ్ కప్ యిన్విటేషన్ క్రికెట్ టోర్నమెంటులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జట్టు దురాపూర్ జట్టును ఓడించి గోల్డ్ కప్ ను నిలబెట్టుకున్నది. ఈ టోర్నమెంటు గత సంవత్సరమంత రక్తికట్టలేదు.

నజీర్ సుల్తాన్ కాల్స్ హైద్రాబాదు ఎలెవన్, హైద్రాబాదు బ్లూస్ జట్టును ఓడించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జట్టుతో ఓడిపోయారు. బ్యాంకు జట్టుతో జరిగిన మ్యాచ్ డ్రా అయింది. కాని మొదటి ఇన్నింగ్సు ఆధిక్యాన్ని కోల్పోవడం వల్ల కాల్స్ ఓడిపోవలసి వచ్చింది. స్కిప్పర్ అంబర్ రాయ్ 65 పరుగులు చేశాడు. ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ ఎ.ఎ.ఎస్. రావు వ్యక్తిగతంగా 60 పరుగులు సాధించాడు. గత సీజనులో యితను ఇంగ్లాండులో పర్యటించాడు. ఎస్.బి.ఐ. కెప్టెన్ హన్మంత్ సింగ్, రాబిన్ ముఖర్జీలు సెంచరీలు కొట్టడంతో బ్యాంకు జట్టు ఐదు వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. హన్మంత్ 162 పరుగులతో ఔట్ కాకుండా వున్నాడు. ముఖర్జీ 183 పరుగులకు ఔట్ అయ్యాడు. వీరుభయులు వరుసగా 16, 23 బౌండరీలు కొట్టారు. వీరిద్దరు కలిసి మూడవ వికెట్టు జంటగా 233 పరుగులు చేశారు. ప్రారంభంలో ముఖర్జీ, సుందరన్‌లు (39 పరుగులు) కలిసి 102 పరుగులు చేశారు. అంబర్‌రాయ్ మళ్ళీ తన బ్యాటింగ్ సామర్థ్యం కనబరిచాడు. ఆయన వ్యక్తిగతంగా 79 పరుగులు చేయడమేగాక సంతోష్‌రెడ్డి, ఆయన కలిసి నాలుగవ వికెటు జంటగా 117 పరుగులు చేశారు. కాల్స్ మొత్తం 241 పరుగులు చేశారు. బ్యాంకు జట్టు కేవలం ఒక పరుగులో స్పష్టమైన విజయాన్ని కోల్పోయింది.

మరో మ్యాచ్‌లో దుర్గాపూర్ జట్టు ఇండియన్ స్టార్లెట్సు జట్టును ఇన్నింగ్సు 67 పరుగుల ఆధిక్యంతో సునాయాసంగా ఓడించింది. మొదటి యిన్నింగ్సులో మహేందర్ 72 నాటౌట్. సురేందర్ మొదటి యిన్నింగ్సులో 26 పరుగులు చేయగా రెండవ యిన్నింగ్సులో 75 పరుగులు చేశాడు. పార్థసారధి శర్మ 127 పరుగులు, ఉమ్రీగర్ 90 పరుగులు చేసి దుర్గాపూర్ జట్టు తమ ఏకైక యిన్నింగ్‌లో 391 పరుగులు చేయడానికి ప్రధానంగా తోడ్పడ్డారు. తరువాతి మ్యాచ్‌లో దుర్గాపూర్ జట్టు సింహళం ట్రాన్స్‌పోర్టు బోర్డు జట్టును ఏడు వికెట్ల తేడాతో ఓడించింది.

ఫైనల్సులో ఎస్. బి. ఐ. కెప్టెన్ దుర్గాపూర్ జట్టును బ్యాట్ చేయనిచ్చాడు. కాని ఆయన ఈ నిర్ణయం సరిఅయినది కాదని ప్రతిపక్షం 320 పరుగులు చేయడంతో నిరూపితమైంది. అరవింద్ ఆప్టే 84 పరుగులు, సిద్ధాయె 49 పరుగులు, లీలె 38 పరుగులు చేశారు. వి. ఆర్. బోంద్రే 61 పరుగులు చేసి టాప్స్ మన్‌గా పరిగణనలోనికి వచ్చాడు. ఆరు వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసిన బ్యాంక్ జట్టు కడపటికి 278 పరుగులు చేయగలిగింది.

స్టేట్ బ్యాంక్ జట్టుకు ఆట కడపటిరోజున లంచ్ విరామం అనంతరం ఒక గంట తరువాత ఏడు వికెట్ల ఆధిక్యంలో గెలుపు లభించింది. మూడవ వికెటు జంటగా హన్మంత్ సింగ్, రాబిన్ ముఖర్జీలు కలిసి 99 పరుగులు చేశారు. ఎ.జి. మిల్కా సింగ్ ఔటుకాకుండా 39 పరుగులు చేశాడు.


ఆస్ట్రేలియాలో భారతజట్టు

ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న భారత క్రికెట్ జట్టు, ఈ వ్యాసం వ్రాసిన నాటివరకు కూడా మనం ఆశించినంతగా ప్రతిభావంతమైన ఆట ప్రదర్శించలేకపోయింది. ఆ మధ్యన వెస్టిండీస్ క్రికెట్ జట్టు మనదేశంలో పర్యటించినప్పుడు మన [illegible] ఎంతో ప్రశంసనీయమైన ప్రతిభ చూపించడమే కాకుండా [illegible] గలిగారు. కాని ఆస్ట్రేలియాలో మాత్రం అంతగా తమ సహజ స్థాయి చూపించి ధాటీ కూడా మనవాళ్లు పట్టుకొనలేకపోతున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగులో కూడా హైదరాబాదు ఆటగాడు [illegible]

టేబిల్ టెన్నిస్

దక్షిణమధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషను ఆధ్వర్యంలో సికింద్రాబాదులో జరిగిన సెంట్రల్ ఇండియా టేబిల్ టెన్నిస్ టోర్నమెంటులో డాక్టర్ ఛాంపియన్ ఫరూక్ ఖాదాయిజీ స్థానిక ఛాంపియన్ మీర్ ఖాసిమ్ అలీని ఓడించాడు. మీర్ ఖాసిమ్ అలీ, బెంగుళూరులో జరిగిన దక్షిణ భారత ఛాంపియన్‌షిప్‌లో ఖాదాయిజీని ఓడించాడు. కాబట్టి ఈ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడగలడని అభిమానులు ఆశించారు. కాని అయన వారిని పూర్తిగా నిరాశపరిచాడు.

మైసూరుకు చెందిన ఉష్ణసుందరరాజ్, ఏకైక ప్రాతినిధ్యవహిస్తున్న సునంద కలెండికర్‌ను ఓడించి మహిళల టైటిల్ గెలుచుకున్నది. హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ జూనియర్ ఆటగాడు ఏస్.వి. అశోక్, నాలుగవ మ్యాచ్‌లో తమ జట్టులోని దిలీప్‌రాజ్ సక్సేనాను ఓడించాడు. ★



జాతీయ ఛాంపియన్‌షిప్ వివిధ పోటీలలో గెలిచిన బృందాలను రెవెన్యూ మంత్రి శ్రీ వి. బి. రాజు డిసెంబరు 9న అభినందిస్తున్న దృశ్యం

సీరియల్

భాగ్యచక్రం

ఆరికెపూడి కౌసల్యాదేవి



జరిగిన కథ

శ్రీలక్ష్మి క్రమంగా జ్వరం నించి కోలుకుంది. తిరిగి వెళ్ళిపోయే రోజున శ్రీధర్ ఆమెను వదల లేదు. అబ్బాయిని తను తీసుకు వెళ్తానని, రెండు రోజులుంచి పంపేస్తానని శ్రీలక్ష్మి అన్నది. కాదుకూడదంటే శ్రీనగేష్‌నుకూడా తనతోపాటు రావలసిందని మరీ మరీ బలవంతంచేసి బయలుదేర దీసింది.

ఆదిత్య తాపాన్ని త్రోసిరాజంటూన్న తమ ఛాయలలో ఆశీనులైన పరిసరాలు ప్రతిధ్వనించునట్లు అల్లరిచేస్తూ ఆడుతూన్న పిల్లలను చూస్తూ కూర్చున్నది శ్రీ లక్ష్మి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు ?" తానూ వచ్చి ఆమెకు దగ్గఱలోనే కూర్చున్నాడు శ్రీ నగేష్.

నవ్వింది శ్రీలక్ష్మి. "నిజానికి ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తూనే వుంటాం. కాని స్పష్టీకరించడం మాత్రం కష్టం !"

"నిజమే!"

సంభాషణ సాగడం లేదు.

ఇసుకలో బొమ్మరిళ్లు కడ్తూన్న పిల్లలను చూస్తూ అన్నాడు శ్రీ నగేష్: "శ్రీధర్ యింతగా మీతో కలసిపోయాదేమిటి ? చాలా చిత్రంగా వున్నదినాకు !"

"అనుబంధ మున్నచోట అనుకోని విధంగానే అంత రంగాలు కలసి పోతాయి !"

"నిజమే నేమో !"

"అయితే.... యింతగా కలసిపోయిన అతడిని అంతగా ప్రయత్నించి విడదీసి తీసుకుపోక పోతేనేం ? ఇక్కడ మాత్రం మీ అబ్బాయికి ఏం లోటు ?"

బాధ స్పష్టంగా కన్పించింది శ్రీనగేష్ వదనంలో. "మీరు అంతే ఆలోచిస్తున్నారు లక్ష్మి. కాని నేను యోచించేది మీ భవిష్యత్తు! నేనెక్కడ? మీరెక్కడ? మన మెవరం ? నా బిడ్డ మీదగ్గర పెరగడ మేమిటి ? విద్యావంతులైన స్త్రీలను గురించి నిష్కారణంగానే పలు పెడార్థాలు తీసే ఈ లోకంలో మీరింత అమాయకంగా వుంటే చాలా అనర్థాలు సంభవిస్తాయి, అంచేత మీరు మరేమి అభ్యంతర పెట్టకండి. ఇంతకంటే వివరించ నవసరంలేదను కుంటాను. మన మధ్య అభిమానాల కెప్పుడూ లోటుండదు."

శ్రీలక్ష్మినుండి ఒక్క కళాహీనమైన చిరునవ్వు మాత్రమే సమాధానమైంది.

భారమైన ఆ వాతావరణాన్ని తేలిక చేయడానికి శ్రీ నగేష్ పురో సందర్భంలోనికి వెళ్ళిపోయాడు. "ఆ రోజున

మీరు చాలా బాధ పడ్డారనుకుంటాను పాపం! అందుకు ముఖ్యకారకుణ్ణి నేను.''

"ఫర్వాలేదు, ఆయనకు మతి వచ్చింది. అంతేచాలు... ఆరోజున ఏమిటి, ఈ రోజున ఏమిటి? జయశ్రీ ప్రవర్తనా, విరసనా నాకెప్పుడూ బాధాకరంగానే వుంటున్నాయి."

"మీది చాలా సహృదయం. వారితో సంబంధం పెట్టుకోవలసిన అవసరం లేకపోయినాకకూడ మీరు వారిని చూడ్డానికొచ్చారని తెలిసిన నాడే నిజంగా ఆశ్చర్యపోయాను"

"సంబంధం లేకపోయినా, వారి కుటుంబానికి సంభవించిన కష్టంచూచి బాధగానే వుంటుంది. కాని జయశ్రీ ప్రవర్తనతో ఆ సానుభూతి అంతా ఎగిరిపోతుంది."

"మీరు బాధపడకండి. వారి బాధ కొద్దీ వారేమో అనడం సహజం. ఆయనకు పిచ్చెక్కింది; జయశ్రీకి ఎక్క లేదు. అంతే తేడా! కాని యిద్దరూ కూడ మానసిక బాధలోనే వున్నారు. కొంత శాంతించాక వారే తమ పొరపాటును గుర్తిస్తారని నా ఆశాభావం."

కొద్దిసేపు మౌనానంతరం అన్నది శ్రీలక్ష్మి. "ఏమండీ? నా కోసం వచ్చినవారు-నాతో వివాహం జరగవలసినవారు-అది చెడిపోయి చనిపోయారంటే అందులో ఎంతో కొంత నా జాతక ప్రభావం లేదంటారా, నిష్పాక్షికంగా ఆలోచించి చూస్తే?''

శ్రీనగేష్ మాట్లాడలేదు.

"మాట్లాడరేం డాక్టర్‌గారు? మీకు జాతక చక్రాలూ-జ్యోతిశ్శాస్త్రాలూ మొదలైన వాటి మీద నమ్మకం లేదా?"

"ఎందుకు లేదూ? పూర్తినమ్మకంవున్నది. ఏశాస్త్రాన్నీ తృణీకరింప వీలులేదు. అన్నీ నిజమే. కాని ఇప్పుడవి నమ్మడానికి వీలులేని సంగతులు మాత్రం అవును.''

"అంటే?"

"పూర్వం ఆ శాస్త్రాలను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకొని జాగ్రత్తగా పరిశీలించగల కవి పండిత వర్యులుండేవారు గనుక ఆయా శాస్త్రాలు సర్వప్రామాణికమై వెలిశాయి; నిలిచాయి. కాని ఇప్పుడు ఆశాస్త్రజ్ఞానం పరిపూర్ణంగా కలవారెవరూ లేరు. మిడి మిడి జ్ఞానాలతో వారు చెప్పేవి ఒకొక్కసారి అవ్వవచ్చు; మరొకసారి తప్పిపోవచ్చు. అందువల్ల యిప్పుడు ఆ నమ్మకాలను పెట్టుకోకపోవడమే మంచిది.''

"ఏమో? జయశ్రీపై కోపంతో మాటకు మాట విసరినా, లోలోపల నాకు అనుక్షణం బాధగానే వున్నది డాక్టర్‌గారూ. వారి మరణాలకు, శ్రీపతిగారి ఉన్మాదానికి నేనే కారణమన్పిస్తున్నది."

"అనిపించడం సహజమే మరి! అయినా కాకపోయినా మానవులం కొన్ని కొన్ని నమ్మకాలతో బ్రతుకుతుంటాం.'' అన్నాడు గంభీరంగా.

"నమ్మకాలు కాదండీ అక్షరాలా నిజమే. చిన్నప్పటి నుంచి మా మేనత్త కుమారునికి నన్ను చేద్దామని అనుకొనేవారు. కాని అతడు బియ్యే చదువుతూ ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి చనిపోయాడు. అప్పటినుంచి మా బంధు వర్గమంతా నన్నొక అదృష్టహీనగా భావించి, మరెవరూ నన్ను వివాహమాడ ముందుకు రావడానికి సాహసించలేదు. అప్పట్లో నా కదంతా ఛాదస్తంగానూ, మూఢ నమ్మకంగానూ అనిపించి లెక్క జేయక వదలివేసినా తిరిగి శ్రీపతిగారి అబ్బాయి విషయంలో అలాగే సంభవించడం చూస్తే నాకూ అదే నమ్మకం కుదురుకుంటున్నది!''

శ్రీనగేష్ మాట్లాడలేదు. గంభీరమౌనంతో శ్రీలక్ష్మిని తిలకిస్తూ కూర్చున్నాడు.

"ఇవన్నీ మీకెందుకు చెప్తున్నాననే అనుమానంగా వున్నాదా మీకు? ఇంతవరకూ ఎవ్వరితోనూ యిలా నేను మనసువిప్పి మాట్లాడలేదు. మీసహృదయత చూచీ, మీరు మనస్తత్వ శాస్త్రజ్ఞులని తెలిసీ మీరు నాకు శాంతి కలిగించే మాట ఏమైనా చెప్తారనే ఆశతో అడుగుతున్నాను.''

దీర్ఘంగా నిట్టూర్చుతూ గంభీరంగా తల పంకించాడు శ్రీనగేష్. అప్పుడే సాయంసమయమై వాతావరణం పూర్వం కంటె ఆహ్లాదకరంగా వున్నది. చలిగాలి కొంచెం అధికమైంది. సూర్యకిరణాలు వదలలేక వదలలేక మెల్లగా ఒక్కొక్క తావునే వీడిపోతున్నాయి. అంబర మార్గాన పక్షుల రాక పోకల రద్దీ అధికమైంది.

సాలోచనగా, తలెత్తి ఆ పక్షులను చూస్తూ అన్నాడు శ్రీనగేష్. "చూడండి లక్ష్మిగారూ! ఆకసాన స్వేచ్ఛగా విహరిస్తూన్న ఆ పక్షులకు ఏ చీకూచింత లేదు. అవునా? కాని వేటగాడి భయం వున్నది. భూమిపై రక్షణవున్న మనకు మరో రకం వేటగాండ్రున్నారు. ఇంకో రకం బాధలున్నాయి. అది సహజం. విచారించి లాభంలేదు. ఇది బాధామయ ప్రపంచం. ఏదో విధంగా సరిపెట్టుకుంటూ సాగిపోవలసిందే. మీరు చదువుకున్నవారు కదా! నేనేం చెప్పాలి ప్రత్యేకంగా?"

"చదువుకున్న దానను కనుకనే నాకీ మామూలు మాటలేమీ నచ్చవు. నా మనస్సుకు శాంతి లేదు. నాన్నగారు తిరిగి వివాహ ప్రయత్నాలు చేస్తూంటే నా గుండె దడ దడ లాడుతున్నది, మరొక నిండుప్రాణిని బలి గొనవలసి వస్తుందేమోనని."

"మీది వ్యక్తిగత సమస్య. నేనేం సలహా యివ్వగలను? కాని ఒక కథ చెప్తాను వినండి."

"ఎవరి కథ?''

"నా ఆప్త మిత్రుడైన ఒకవిధి. వినగలరా ?''

"సంతోషంగా !"

కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ చేతులపై వెనక్కు వాలి, కథనం ప్రారంభించాడు శ్రీ నగేష్—

"అతడు ఒక డాక్టరు. విద్య పూర్తికాగానే ఆర్మీలో పని చేయడానికి వెళ్ళిపోయాడు. అసలు అతడు పల్లెపట్టుననే వుండి ఒక మహత్తర కార్యం చేయాలని చిన్ననాటి నుండి కలలు కన్నాడు. దేవతవంటి అతడి తల్లి మినహా మరెవరూ అతడి ఆదర్శాన్ని ప్రోత్సహించ లేదు. చిన్ననాటి నుండి తన జీవిత భాగస్వామినిగా నిర్ణయమైపోయిన మేనమామ కుమార్తె కూడా అతడి ఆదర్శాన్ని హేళనచేసి, పల్లెవాసాన్ని అల్పంగా తృణీకరించి, అతడితో నిశ్చయమైన వివాహాన్ని త్రోసిపుచ్చింది......ఆ చికాకులో నైతేనేం, దేశ ఆత్యయిక స్థితిని గ్రహించి అయితేనేం ఆ డాక్టరు ఆర్మీలోకి వెళ్ళి పోయాడు.

"సహజంగా అతడిలో చెడుగుణాలేమీ లేవు. చంచల స్వభావం కాదు. కాని ఒక ప్రత్యేక పరిస్థితిలో — ఒక స్త్రీ ప్రాణ రక్షణార్థం తప్పనిసరిగా ఆమెను వివాహమాడ వలసి వచ్చింది."

అర్థం గానట్లు చూచింది శ్రీలక్ష్మి.

వివరించాడు శ్రీనగేష్. "మా ఆర్మీ ఒక ఊరి వెలుపల విడిచివుంది కొన్నాళ్ళపాటు. మా గుడారాల దగ్గరనే ఒక మంచినీటి చెరువుంది. ఆ గ్రామస్థులందరికీ అదే ఆధారం. రోజూ ఉదయ సంధ్యలలో యించుమించుగా గ్రామ స్త్రీలందరూ మంచినీటికై బిందెలతో అక్కడి కొచ్చేవారు...... వారితో ఒకామె జగదేక సుందరి కాకున్నా స్మరించ దగిన సౌందర్యవతి; ఒక రైతు కుమార్తె. మా ఆర్మీ మేజరు కన్ను ఆమెపై పడింది. అతడు యువకుడేమీ కాదు. నడివయస్కుడు. నలుగురు బిడ్డల తండ్రి. ఇటువంటి అల్పగుణాల వల్లనే, వారెంత దేశం కోసం పోరాడి త్యాగం చేస్తున్నా సామాన్య జనావళికి వారంటే అల్పభావం, భయమూను. వివేకవంతురాలైన ఆ కన్య సవ్యంగా అతడి కోర్కెను అంగీకరించదని అతడికి తెలుసు. అందుకే మాయోపాయాలూ, బలవన్మార్గాలూ ఉపయోగించ నిశ్చయించాడు. తన కుట్ర ఎవరికీ తెలియదనుకున్నాడు.

"ఆ సాయంత్రం...... ఉన్నట్లుండి నీలాకాశం కారు మేఘావృతమై ఎల్లెడలా చీకట్లు కమ్ముకున్నాయి. బలమైన గాలి ప్రపంచాన్ని ఊపివేస్తున్నది. ఉరుములు మెరుపులతో ధారాపాతంగా వాన కురియసాగింది. ఆ సమయానికి పాపం, ఆ అమ్మాయి ఒంటరిగా చెరువుగట్టున మిగిలిపోయింది. అవకాశం కోసం చూస్తున్న మేజర్ కు అనువైన సమయం దొరికింది. ఆదరంగా ఆమెకు ఆశ్రయమిస్తున్నట్లుగా తన గుడారానికి ఆహ్వానించాడు.

"వివేకవంతురాలైన ఆమె ఆ ఆహ్వానాన్ని అంగీకరించ లేదు. ఆ భీకర వాతావరణంలోనే గృహోన్ముఖురాలైంది. కాని భల్లూకం లాగా ఆ మేజర్ ఆమెను విడువలేదు. ప్రక్క టెంట్ లో నుండి అంతా గమనించుతున్న నా మిత్రుడు ఆమె రక్షణార్థం వెళ్ళాడు. ఆమె అదివరకే తన ప్రేయసి అని అబద్ధమాడి అతడి బారినుండి రక్షించాడు. ఆ మేజర్ నమ్మకం కోసం, తన శీల రక్షకునిపై మరలుగొన్న ఆమెకోసం— తప్పనిసరిగా ఆమెను వివాహ మాడాడు. సైనిక కట్టుబాట్ల ప్రకారం ఆ వివాహం అతి రహస్యమే అయినా, వారి దాంపత్య జీవితానికి ఏమీ లోటు లేక పోయింది. చాలా ఆనందంగా గడిచింది. కాని విధివశాత్తు ఆమె జబ్బుచేసి మరణించింది, ఒక మగ బిడ్డను మాత్రం తన జ్ఞాపకంగా అతడికి వదలి."

"అయ్యో !" శ్రీలక్ష్మి మనః పూర్వకమైన సానుభూతితో అన్నది. అతి బాధ ప్రతిఫలించుతూన్న అతడి వదనం చూస్తూ ''ఆయన మీకు చాలా ఆత్మీయులనుకుంటాను ? అని ప్రశ్నించింది.

"అవును" భారంగా అన్నాడు శ్రీ నగేష్.

"ఆ తర్వాత ? ఇంతకూ అతడి కేంపని ఆ సైన్యంలో?"

''డాక్టరు! అతడివివాహం సంగతి అతడికే కాని స్వజనుల కెవరికీ తెలియదు. మిత్రులకు కూడా కొందరికి తెలియదు. సైనిక శిబిరాల స్థావరాలు మారాయి. యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ఇరుపక్షాల సైనికులూ అధిక సంఖ్యలోనే హతమౌతున్నారు... ... అటువంటి పరిస్థితులలో ఒక రాత్రి... క్షతగాత్రులైన సైనికులందరికీ తగిన వైద్యం చేస్తున్నాము. కొందరు కోలుకొంటున్నారు. కొందరు బాధతో తీవ్రంగా, హృదయ విదారకంగా అరుస్తున్నారు. మరణోన్ముఖులైన మరి కొందరు నిస్సహాయంగా స్వగ్రామాలలోని తమ వారిని తలచుకుని దుఃఖిస్తున్నారు. స్నేహితులకు అప్పగింతలు పెడుతున్నారు. నిజంగా అక్కడ బ్రతికున్నవారికి అది అగ్ని పరీక్ష. చనిపోతున్నవారు ముందు వెనుకలు యోచించకుండా అనేక అప్పగింతలు పెడుతున్నారు. మాటకు నిలబడే మనుషులకు అది నిజంగా అగ్ని పరీక్షే.......ఆ డాక్టర్, నా మిత్రుడు ఎవరి మాటనూ తేలికగా త్రోసి వేయలేని వాడు. ఇతరుల ఆనందంకోసం తన సుఖ సంతోషాలను విసర్జించగల త్యాగమూర్తి ! చనిపోతూన్న ఒక ఆఫీసర్, తనకు వైద్యం చేస్తూన్న ఆ డాక్టర్ పై పెద్ద బాధ్యతవుంచి మరి చనిపోయాడు !''

"ఏమిటిది ??'' శ్రోత జాప్యం భరించలేక పోయింది. ఆయన ఓ దీర్ఘనిట్టూర్పు విడిచి కొద్దిసేపు మౌనంగా వుండి పోయాడు.

(సశేషం)

షెడ్యూలు కులాలు, ఇతర వెనుకబడిన తరగతులు

పురోభివృద్ధి

స్వాతంత్ర్యం వచ్చిన యిరవై యేళ్ళలోనూ షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులు, యితర వెనుకబడిన తరగతుల పురోభివృద్ధికి ప్రభుత్వం తీవ్రంగా కృషిచేసి యితోధిక ఫలితాలను సాధించింది.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులకు సంబంధించిన సంక్షేమ పథకాల క్రింద తొలి పంచవర్ష ప్రణాళికలో రూ 15 కోట్లు ఖర్చు చేయగా చతుర్థ పంచవర్ష ప్రణాళికలో ఇందుకు రూ 180 కోట్లను కేటాయించారు. ఈ మధ్య కాలంలో ఉపాధి కల్పించబడిన వారి సంఖ్య రెట్టింపు అయ్యింది. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతుల వారికి యిచ్చిన ఆర్థిక సహాయం ఈ మధ్య కాలంలో నాలుగు రెట్లు పెరిగింది.



లంబాడీ వనితలు

గత పదిహేనేళ్ళగా ప్రభుత్వ భూములు పంపిణీ అయిన వాటిలో 45 శాతం ఈ తరగతుల వారికే వెళ్ళాయి.

ప్రభుత్వ సర్వీసులలో 12 1/2 శాతం ఖాళీలను నేరుగా షెడ్యూలు కులాల వారికే యివ్వడం జరుగుతున్నది. కేంద్ర ప్రభుత్వ సర్వీసులలోవున్న యీ కులాల వారి సంఖ్య 1959 నుంచి 1967 నాటికి లక్షకు పైగా పెరిగింది.

తక్కువ ఆదాయ వర్గాలవారి పిల్లలకు యిచ్చే మెరిట్ స్కాలర్ షిప్పులలో 17 1/2 శాతం షెడ్యూలు కులాల వారికి కేటాయించారు. 1965లో మెట్రిక్ స్టేండర్డ్ వరకు మొత్తం 90 లక్షల షెడ్యూలు కులాల విద్యార్థులు స్టయిపెండు పొందుతుండే వారు.


హరిజన సంక్షేమ సలహా మండలి

హరిజనుల సంక్షేమం నిమిత్తం కేంద్ర సాంఘిక సంక్షేమ మంత్రి అధ్యక్షతన 21 మంది సభ్యులతో కేంద్ర సలహా మండలిని ఒక దానిని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మండలి సభ్యులలో పార్లమెంటు సభ్యులు, సాంఘిక కార్యకర్తలు, సాంఘిక శాస్త్ర వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ తీర్మానం ప్రకారం యీ మండలి సభ్యత్వం 25కు మించదు. షెడ్యూలు కులాల సంక్షేమానికి సంబంధించి ఈ మండలి ప్రభుత్వానికి సలహాలను యిస్తుంది. ప్రభుత్వం అమలు జరిపే అభివృద్ధి కార్యక్రమాలను కూడా యిది సమీక్షిస్తుంది. మరింత అభివృద్ధిని సాధించడానికి ఏ ఏ చర్యలు తీసుకోవాలో ప్రభుత్వానికి తెలియ జేస్తుంది. ఈ మండలి ఆరు నెలలకు ఒకసారి సమావేశమవుతుంది. దీని పదవీ కాలం ఒక ఏడాది. అవసరమైతే ప్రభుత్వం ఈ కాలాన్ని పొడిగిస్తుంది కూడా.

తిరుపతిలో హరిజన హాస్టలు

తిరుపతిలోని ఎస్. వి. ఆర్. రూయా హాస్పిటలు వద్ద హరిజన విద్యార్థుల నిమిత్తం డిసెంబరు 6వ తేదీన హాస్టలుకు సాంఘిక సంక్షేమ శాఖామంత్రి శ్రీ అరిగె రామస్వామి శంకుస్థాపన చేశారు. తిరుపతి తిరుమల దేవస్థానం వారు దీనికి రూ 25,000లు విరాళం యిచ్చారు. ఈ హాస్టలును రాష్ట్రానికే ఆదర్శప్రాయమైన హాస్టలుగా నిర్మించాలని ఉద్దేశిస్తున్నారు. ఈ హాస్టలు జిల్లా పరిషత్తు నిర్వహణలో వుంటుంది.

***



స్వామి వివేకానంద

పాశ్చాత్యుల దృష్టిలో భారత దేశానికీ, భారతీయ సంస్కృతికీ ఉన్నత గౌరవ స్థానం ఏర్పరిచిన తొలి భారతీయుడు బహుశః స్వామి వివేకానందుడే. పునరుజ్జీవితమైన హైందవ మతం ప్రతినిధిగా స్వామి వివేకానంద చికాగోలో ప్రపంచ మతాల మహాసభలో గంభీరోపన్యాసం చేసి అమెరికన్ వర్గాలలో సంచలనం కలిగించారు. ఆయన మూర్తీభవించిన వేదాంతం, వేదాలను సృష్టించిన మతపు ఔన్నత్యాన్నీ, ఘనతనూ ఆయన ప్రపంచానికి నిరూపించారు. మనిషిని మానవత్వం కలిగినవానిగా రూపొందించడమే అన్ని మతాల ఆశయమనే సత్యాన్ని చాటారు.

స్వామి వివేకానంద 1863 జనవరి 12వ తేదీన కలకత్తాలో జన్మించారు. ఆయన చిన్ననాటి పేరు నరేంద్రనాథ్. లేత వయస్సులోనే ఆయన తనతల్లి శ్రీమతి భువనేశ్వరీదేవి నుండి జీవిత ఉన్నత ఆదర్శాలను గ్రహించారు. తండ్రి శ్రీ విశ్వనాథదత్ బాగా స్థోమత కలిగినవాడు కాబట్టి కొడుకు విద్యాభ్యాసానికి, ఏలోటు రానీయకుండా ఏర్పాట్లు చేశాడు. కళాశాల విద్య ముగిసిన వెంటనే స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస ఉద్బోధల ప్రభావానికి లోనయ్యారు. ఇది ఆయన జీవిత పథాన్ని మార్చివేసింది. జీవితంలో గొప్ప మలుపు ప్రారంభమైంది. పిమ్మట ఆయన బ్రహ్మసమాజంలో చేరారు. కాని శాంతి లభించలేదు.

స్వామి వివేకానంద 1888వ సంవత్సరంలో తన గురువు ఆదర్శాలను బోధలను ప్రచారం చేయడం ప్రారంభించారు. దివాకరునివలె పాశ్చాత్య జగతిలో ప్రకాశించారు. ప్రపంచమంతటా విస్తృతంగా పర్యటించారు. అంతటా ఆయన శిష్యులు వున్నారు. సోదరి నివేదిత ఆయన ప్రధాన శిష్యురాలు. ఆయన ప్రసంగాలు విన్నవారందరూ ముగ్ధులయ్యేవారు.

మతమూ, జీవితమూ అభిన్నమైనవి. అన్నార్తుల ఆకలి బాధను తీర్చలేని మతం, దీనురాలి బాష్పాలను తుడిచి వేయలేని మతం అసలు ఆపేరుతో వ్యవహరించడానికి అనర్హమైనదనీ ఆధ్యాత్మిక విమోచనానికి స్వాతంత్ర్యం మూలాధారం అనీ ఆయన విశ్వాసం.

స్వామి వివేకానంద్ సన్యాసిగా జీవించారు. వైవాహిక జీవితాన్ని పరిహరించారు. స్వామీజీ గొప్ప దేశభక్తుడు. సంకుచితత్వాన్ని విడనాడి విశాల దృక్పథాన్ని అలవర్చుకోవలసిందిగా ఆయన దేశప్రజలను ఉద్బోధించారు. వసుధైక కుటుంబ దృష్టిని పెంపొందించుకొని సాంఘిక, వైజ్ఞానిక రంగాలలో గొప్ప విప్లవం తేవలసిందిగా హితవు జెప్పారు.

స్వామీజీ 1902 జూలై 5వ తేదీన పరలోక గతులయ్యారు. 39 సంవత్సరాల స్వల్పప్రాయంలోనే దేహయాత్ర చాలించారు. ఆయన రచించిన అమూల్య గ్రంథాలు, రామకృష్ణ మిషన్ ఆయన స్మృతి చిహ్నాలుగా నిలిచి వున్నాయి.

లాలా లజ్‌పత్ రాయ్

లాలాలజ్‌పత్‌రాయ్, లూథియానా జిల్లాలోని ధుడిక అనే గ్రామంలో 1865 జనవరి 28వ తేదీన ఒక బీద కుటుంబంలో జన్మించారు. లాహోరులో 1928 నవంబరు 17వ తేదీన మరణించారు. లజ్‌పత్‌రాయ్ గొప్ప నాయకుడు. భారతదేశ స్వాతంత్ర్యానికై పాటుబడటానికీ, ఆత్మవిశ్వాసంతో తలెత్తుకొని తిరగగలగడానికీ, స్వార్థ ప్రయోజనాన్ని ఆశించకుండా సేవ చేయడానికీ మనలనూ, యువతరంవారినీ ప్రేరేపించిన నాయకాగ్రేసరులు. తిలక్, బిపిన్ చంద్రపాల్, రాస్ బిహారీ ఘోష్, గోఖలే మోతీలాల్‌నెహ్రూ ప్రభృతులకు లజ్‌పత్‌రాయ్ మిత్రుడు; సమకాలీనుడు. ఆయన మరణించినప్పుడు మహాత్మాగాంధీ "భారతదేశ గగనసీమనుంచి ఒక ధృవతార రాలిపోయిందని" ఖేదిల్లారు.


లాలా లజ్‌పత్‌రాయ్ 1921లో లాహోరులో "సర్వెంట్స్ ఆఫ్ ది పీపుల్ సొసైటీ"ని సాపించారు. శ్రీ పురుషోత్తమ్‌దాస్ టాండన్, శ్రీ బల్వంత్‌రాయ్ మెహతా వంటి అనేకమంది ప్రముఖ సాంఘిక, రాజకీయ కార్యకర్తలకు ఈ సంస్థతో సంబంధం వుండేది. ఆయనవద్ద శుశ్రూష చేయడానికి లాహోరు వెళ్ళిన సేవాపరాయణులైన యువకులలో శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి ఒకరు. లజ్‌పత్ రాయ్ లాహోరు నుంచి "ది పీపుల్" "యంగ్ ఇండియా", "వందే మాతరం" అనే పత్రికలను వెలువరించి ప్రజలను చైతన్య వంతులను చేయడానికి దోహదంచేసారు. హిందూమతం, ధర్మంపట్ల ఆయన ఎక్కువ ఆసక్తి చూపారు. అయితే ఆయనకు మత దురభిమానంలేదు.

లాలా లజ్‌పత్‌రాయ్ తాము నమ్మిన సత్యాన్ని నిర్భయంగా వెల్లడించేవారు. తన వాదాన్ని ఎక్కువమంది బలపరచక పోయి నప్పటికీ, యోధాన యోధులు సైతం తనను వ్యతిరేకించి నప్పటికీ ఆయన చలించేవారుకాదు. ఆయన గొప్పవక్త. ఆయన తన స్వంతానికై దేనినీ ఆశించలేదు, పొందలేదు. ఆయన తన ఆదర్శాలకూ సిద్ధాంతాలకే ప్రాధాన్యం ఇచ్చారు. కాని తన సౌకర్యాలకూ, సుఖాలకూకాదు. చౌకబారు ప్రచారాన్ని ఆయన

ఎప్పుడూ కోరలేదు. కోటి మానవుల అభ్యున్నతికై ఆయన నిరాడంబరంగా కృషి చేశారు. మతం, భాష, ప్రాంతీయ దురభిమానాలకు ఆయన అతీతుడు. ఆయన గొప్ప దేశభక్తుడు.

1928 అక్టోబరు 20వ తేదీన సైమన్ కమీషన్ లాహోరు సందర్శించిన సందర్భంలో ఈ కమీషన్ను బహిష్కరించడానికై రైల్వేస్టేషనువద్ద జరిగిన ప్రదర్శనలకు లాలా లజపత్ రాయ్ నాయకత్వం వహించారు. అప్పుడు పోలీసులు అమానుషంగా లాఠీచార్జి చేశారు. లజపత్‌రాయ్‌కి తీవ్రమైన దెబ్బలు తగిలాయి. తరువాత పోలీసుల దుష్ప్రవర్తనను ఖండించడానికి లాహోరులోని బ్రాడ్లాఫ్ హాలులో బ్రహ్మాండమైన బహిరంగసభ జరిగింది. ఈ సభలో ప్రసంగిస్తూ లజపత్‌రాయ్ "నాకు తగిలిన ప్రతి లాఠీదెబ్బా భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పతనానికి శూలంపలె గ్రుచ్చుకుంటుంది". అని ఉద్ఘాటించారు. ఈ అస్వస్థత నుంచి ఆయన మళ్ళీ తేరుకోకుండానే 1928 నవంబరు 17వ తేదీన కన్ను మూశారు. మహారాష్ట్రకు తిలక్ ఎంతటివారో పంజాబుకు లజపత్‌రాయ్ అంతటివారు.

—డా॥ ఎన్. వి. గాడ్గిల్



డా. రాజేంద్ర ప్రసాద్

భారత ప్రజలు డాక్టర్ రాజేంద్రప్రసాదును మహాత్మాగాంధీజీతో సమంగా గౌరవిస్తారు. 1946 డిసెంబరు 11వ తేదీన స్వేచ్ఛా భారత రాజ్యాంగాన్ని రూపొందించవలసిన రాజ్యాంగసభ ఒక శాశ్వత అధ్యక్షుని ఎన్నుకోవలసి వుంది. ఆసందర్భంలో విజ్ఞానమూర్తి, సహనశీలి, చక్కని గుణగణాలు మూర్తీభవించిన వ్యక్తి, సునిశిత బుద్ధిశీలి, సార్వజనీన గౌరవ యోగ్యుడు అయిన వ్యక్తిని ఎన్నుకోవలసివచ్చినప్పుడు యావత్తు సభా మరో ఆలోచన లేకుండా ముక్తకంఠంతో డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేరుచెప్పింది. ఆ తర్వాత సుమారు మూడేళ్ళకు రాజేంద్రప్రసాద్ భారత నూతన రాజ్యాంగంపై సంతకం చేయడం ఆయన జీవితంలో అదొక అపూర్వమైన ఘట్టం.

'గాంధీజీతో ఆయన చేరకపోయివుంటే బ్రిటిష్ ఇండియాలో ఒక భారతీయుడు అధిష్ఠించగల అత్యున్నతస్థానమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగానో, ప్రాంతీయ గవర్నరుగానో తప్పక అయి వుండేవారు. అయితే ఆయన గాంధీజీతో కలిసి, ఆయనకు సన్నిహితంగావెళ్ళి, స్వేచ్ఛా భారతంలో అత్యున్నత పీఠాన్ని అధిరోహించారు.' అని జాన్ గంథర్ అనే అమెరికన్ జర్నలిస్టు పేర్కొన్నారు.

విజ్ఞానం మూర్తీభవించినవ్యక్తి ఆయన. గొప్ప న్యాయమూర్తి. ఆయన అభిరుచులు విస్తృతం. తొలిజాతీయ ప్రభుత్వంలో భారతదేశ ఆహార సభ్యుడుగా ఆయన ఉన్నతమైన ప్రమాణాలను నెలకొల్పారు. జాతీయ నిర్మాణ కృషిలో ఆయన అభిరుచి యింతా అంతాకాదు.

ఆయనలో యితరులను నొప్పించేగుణం యిసుమంతైనా లేదు. రాజకీయ విషయాలు ఆయనను ఏమాత్రం సోకలేదు. ఆయన పెద్దమనిషి తరహా, స్వభావికమైన మంచిగుణం, ఆయన నిరాడంబరత, ఆప్యాయత, ఆయన చిత్తశుద్ధి, లక్ష్యసాధనలో నిజాయితీ, నిస్వార్థత ఆయనకు ఒకగొప్ప విశిష్టతను కల్పించాయి. భారత ప్రజల హృదయ కుహరాలలో ప్రతిష్ఠించాయి.

రాజేంద్రప్రసాద్‌ను గూర్చి ఆశ్చర్యకరమైన విషయాలేమీ లేవు. ఆయన అతిసామాన్యవ్యక్తి. నెహ్రూలాగ అశేష సమూహాన్ని కదిలించగల అపూర్వవ్యక్తికాదు ఆయన. సర్దార్‌పటేల్ లాగ ప్రజల్ని ఆశ్చర్యచకితుల్ని చేసేవ్యక్తికాదు. అపారమైన త్యాగశీలి ఆయన. అందుకే ఆయన ప్రజల హృదయాలలో విశ్వాసాన్ని కలిగించి, వారి గౌరవాన్ని పొందగలిగారు.

ఆదిభట్ల నారాయణదాసు

తెలుగు సాహిత్యంలో, సంస్కృతిలో హరికథను ప్రతిష్ఠించిన ఘనత ఆదిభట్ల నారాయణదాసు గారిది. సంస్కృతాంధ్రాంగ్ల పార్సీ భాషలలో ఆయన పండితుడు. వాటిని విడిగా అధ్యయనంచేసి ప్రజ్ఞ గడించారు. షేక్స్పియర్ రచనలను అనేకం ఆయన తెలుగులోకి అనువదించారు. స్వయంగా తెలుగులోను, సంస్కృతంలోను అనేక రచనలు చేశారు. ప్రపంచ ప్రసిద్ధమైన ఉమర్ ఖయ్యాంకు వీరు చేసిన ఆంధ్రానువాదము వీరి ప్రతిభా వైశిష్ట్యానికి తార్కాణము. పండితుడిగా, రచయితగాకన్న ఆయన ఆంధ్ర దేశమంతటా హరికథా పితామహుడిగానే సుప్రసిద్ధులు.

సంగీత, నృత్యాలద్వారా సాహిత్యాభివ్యక్తీకరణకు అనువయిన ఒకానొక కథాత్మక ధోరణి హరికథ, అందులో ఒక యితివృత్తం వుంటుంది. అది పురాణ కాలందైనా కావచ్చు, ఆధునికమైనదైనా కావచ్చు. కథని పద్యాలద్వారా అభినయ పూర్వకంగా అడుగులువేస్తూ, రసమయంగా పలుకుతూ, మధ్య మధ్య పిట్టకథలు సచెప్పి ఆకట్టుకుంటూ, కించిత్ హాస్యాన్ని మేళవించి నవ్విస్తూ



ఎక్కడికక్కడ నీతిబోధచేస్తూ, వ్యాఖ్యానాలనుచేస్తూ చెప్పేకథే హరికథ. హరిదాసు బహుముఖ ప్రతిభావంతుడై వుండాలి. మంచి విద్వత్తు కలిగి వుండాలి. సంగీత పరిజ్ఞానమూ, పాడగల కంఠమూ వుండాలి. నృత్యంలో కొంత అనుభవమూ, అభినయ ప్రావీణ్యమూ వుండాలి. అంతేకాదు కథను ఆసక్తితో చెప్పే నేర్పూ, నటనలో సామర్థ్యమూ వుండాలి. అన్నిటినీమించి అతను మంచి వ్యక్తి కావాలి. ఆదిభట్ల నారాయణదాసుగారు వీటన్నిటి లోను నిస్సంశయంగా ప్రజ్ఞానిధి. ఇన్ని కళలనూ అవుపోశన పట్టిన వ్యక్తి. ఆయన కంఠం చక్కటిలయ పలుకుతుంది. గాత్ర సంగీతంలో దేశమంతటా ఆయన పేరు ప్రతిష్ఠలు సంపాదించు కున్నారు. అంతేగాదు స్వయంగా వీణ వాయించి రసజ్ఞుల మనస్సులను రంజింప జేయగల ప్రతిభామయులు. సంగీత ప్రపంచంలో ఆ రోజుల్లో ఆయనకు దీటైనవారు మరొకరు లేరనడం అతిశయోక్తి కాదు.

ఆదిభట్ల నారాయణదాసుగారు శ్రీకాకుళం జిల్లాలోని సువర్ణ ముఖి నది ఒడ్డునగల అజ్జాడ అనే గ్రామంలో క్రీ. శ. 1864లో జన్మించారు. స్వయం కృషితో ప్రతిభను సంతరించుకున్నారు. దేశమంతటా అన్ని వర్గాల ప్రజలు ఆయనను గౌరవించేవారు. వేలకొలది హరికథ ప్రదర్శనలు యిచ్చారు. ఆంధ్ర దేశంలో ఆరు దశాబ్దాలపాటు అవిరళంగా శ్రమించి ప్రాచీన సంస్కృతి విభవాన్ని పరిపోషించారు. 1945 జనవరి 2వ తేదీన ఆదిభట్ల నారాయణదాసుగారు స్వర్గస్థులయ్యారు.

బసవరాజు వెంకట అప్పారావు

స్వర్గీయ బసవరాజు వెంకట అప్పారావు గారు సుప్రసిద్ధ తెలుగు గేయ కవులలో ఒకరు. వీరి గేయాలు భావ పుష్టికి పెట్టింది పేరు. వీరు వ్రాసిన ప్రతి గేయంలోను వీరి హృదయస్పందన వినిపిస్తుంది. కృష్ణాతరంగిణీ డోలికల తూగు, ప్రవాహగమన రమ్య మంజుల నిస్వనము వీరి గేయాల ప్రత్యేకత. దానికి తోడు మార్మికమైన ఆచ్ఛాదన ఈయన కవితకు జలతారు మేలి ముసుగులా భాసించి మరింత రమణీయంగా వుంటుంది. పద చిత్రాలను బోలిన వర్ణన, ఆడంబరంలేని శైలి వీరి కవితకు నిండు దనాన్నిస్తాయి. నిస్సందేహంగా బసవరాజు అప్పారావు గారు ప్రతిభావంతుడైన కవి. ఆంధ్ర సాహితీ లోకంలో ఆయన సమున్నతమైన పీఠాన్ని అధిష్ఠించారు.


బసవరాజు అప్పారావు గారు 1894 డిసెంబరు 13వ తేదీన జన్మించారు. 'ఆంధ్ర పత్రిక'కు 'భారతి'కి కొంత కాలం పాటు ఉప సంపాదకులుగా పని చేశారు. ఆ తర్వాత 1926లో న్యాయశాస్త్రంలో పట్టా పొంది విజయవాడలో ప్రాక్టీసు పెట్టారు. 1933 జూన్ 10వ తేదీన వీరు కాలధర్మం చెందారు.

బసవరాజు అప్పారావు గారు గొప్ప దేశ భక్తుడు. జాతీయోద్యమ కాలంలో తమ గేయాలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. మహాత్మాగాంధీ గారిమీద ఆయనకు అపారమైన భక్తి శ్రద్ధలు. ఆయనపై అనేకమైన గేయాలను వ్రాశారు. ఆంధ్ర దేశమంతటా యివి బహుళ ప్రచారమంది ప్రసిద్ధి కెక్కాయి. అప్పారావుగారు పండితుడు కూడా. ఆయన రచనలే అందుకు నిదర్శనాలు. సంస్కృతంనించి ఆయన కొన్ని కాళిదాసు కవి శ్లోకాలూ, శంకరాచార్యుల వారి శ్లోకాలనూ తెలుగులోకి అనువదించారు.

తన భర్త గౌతమ బుద్ధుడు తనను శాశ్వతంగా విడిచి వెళ్ళి పోగా యశోధర అనుభవించిన హృదయ శోకాన్ని వర్ణిస్తూ అప్పారావు గారు వ్రాసిన గేయం నిజంగా హృదయాన్ని కదలించి వేస్తుంది.

బసవరాజు అప్పారావు గారు దేశమంతటా పర్యటించారు. ఎన్నో నగరాలను దర్శించారు. ఆయన చూడని దేవాలయం లేదు. కుతుబ్ మినార్, తాజ్‌మహల్‌లను దర్శించి వాటిపై తన కవితా స్రవంతిని ప్రవహింప జేశారు. ★

చిత్రసీమ



చలనచిత్ర సదస్సుకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు

చలనచిత్ర సదస్సు

జనసంబంధశాఖ ఏర్పాటుచేసిన చలనచిత్ర సదస్సుకు ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి డిసెంబరు 26వ తేదీన రవీంద్రభారతిలో ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పిల్లల చలన చిత్రాలను ఎక్కువగా నిర్మించవలసిన అవసరాన్నిగూర్చి పేర్కొన్నారు. మన భవిష్యత్తు తరంవారి వ్యక్తిత్వాలను, ప్రవర్తనను రూపొందించవలసిన గురుతర బాధ్యత మనమీద వున్నదని ముఖ్యమంత్రి అన్నారు. చలనచిత్రాలు విజ్ఞానవికాసాలకు మార్గాలని ఈనాడు అంగీకరిస్తున్నదృష్ట్యా ఈ లక్ష్యాన్ని సాధించే చిత్రాలను నిర్మించేఅవసరం ఎంతయినావున్నదని ఆయన వ్యక్తంచేశారు. చలనచిత్ర పరిశ్రమతో సంబంధంవున్న వారందరికీ ప్రభుత్వం అన్నివిధాలా తోడ్పడగలదని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు. ముడిఫిల్మ్, పరికరాల దిగుమతి విషయంలో కేంద్రప్రభుత్వ సహాయాన్నికూడా లభింపజేసే ప్రయత్నం జరుగుతుందని అన్నారు.

ఈ సమావేశాన్ని ఎందుకు ఏర్పాటుచేయడం జరిగిందో జన సంబంధ, శ్రామిక శాఖామంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలియజేస్తూ ఈ సమావేశంవల్ల చలనచిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలకు పరిష్కారం లభించగలదనే ఆశాభావాన్ని ప్రకటించారు.

మూడు రోజులపాటు జరిగిన యీ సమావేశానికి ప్రముఖ చలనచిత్ర నిర్మాతలు, కళాకారులు, డిస్ట్రిబ్యూటర్లు, ఫిల్మ్‌ఛాంబర్ల ప్రతినిధులు హాజరయ్యారు.

డిసెంబరు 27న జరిగిన సమావేశంలో కేంద్ర రేడియో సమాచారశాఖామంత్రి ప్రసంగించారు. భారతీయ చలనచిత్రాలకు ప్రమాణాలను రూపొందించే విషయమై కేంద్రప్రభుత్వం త్వరలోనే ఒకసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. విదేశీ చలనచిత్రాలతో పోటీ పడాలంటే, అంగీకృత సాంస్కృతిక విలువల ప్రాతిపదికమీద ఆధారపడిన విజ్ఞాన వినోదాలను లభింప చేయాలంటే చక్కటి ప్రమాణాలను నైతికవిలువలను, కళాత్మక విలువలను మన చిత్రాలు పాటించవలసివుందని ఆయన అన్నారు.

మరో రెండేళ్ళల్లో దేశానికి కావలసిన రంగుముడిఫిల్మ్ మనదేశంలోనే ఉత్పత్తి అవుతుందనీ, ఆంధ్రప్రదేశ్‌లో దినదిన ప్రవర్ధమానమౌతున్న చలనచిత్ర పరిశ్రమకు తను అన్నివిధాలా తోడ్పడగలననీ, ముఖ్యంగా ముడిఫిల్ము, పరికరాల దిగుమతి విష

యంలో తమ తోడ్పాటు తప్పక లభించగలదనీ ముఖ్యమంత్రి హామీ యిచ్చారు.

సెన్సార్ బోర్డు తదితర సంఘాలలో ఆంధ్రప్రదేశ్‌కు తగు విధంగా ప్రాతినిధ్యంకూడా యివ్వగలమని తెలియజేశారు.

కేంద్రమంత్రికి స్వాగతం చెప్తూ రాష్ట్ర జనసంబంధ, శ్రామికశాఖామంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హైదరాబాదులో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలనుగూర్చి, అది ఎదుర్కొంటున్న సమస్యలనుగూర్చి విపులీకరించారు. మూడురోజులపాటు జరిగిన ఈ సదస్సు డిసెంబరు 28వ తేదీతో ముగిసింది. ఆర్థిక సహాయసంస్థలు ఋణాలను మంజూరు చేసే విషయంలో చలనచిత్ర పరిశ్రమనుకూడా యితర పరిశ్రమలతో సమానంగానే పరిగణించాలని ఈ సదస్సులో అభిప్రాయపడ్డారు. ప్రస్తుత చలనచిత్ర పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సినిమాటోగ్రఫీ చట్టాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని ఈ సదస్సు కోరింది. ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు పిల్లల చిత్రాల్ని నిర్మించాలనికూడా ఈ సదస్సులో అంగీకరించారు. నగరంలో నిర్మించే చిత్రానికి ప్రస్తుతం గ్రాంటుగా యిస్తున్న 50,000 రూపాయలు గాక అదనంగా 75,000 రూపాయలు సబ్సిడీని ప్రభుత్వం యివ్వాలని వీరు కోరారు.

ఈ పరిశ్రమకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయపడగలదని జనసంబంధశాఖామంత్రి హామీ యిచ్చారు.

1968లో ఆంధ్ర, హైదరాబాదు ఫిల్మ్‌ఛాంబర్లను రెంటినీ విలీనంచేయాలని యీ సదస్సు అంగీకరించింది.


ఆదర్శఘట్టాలు

జాతీయ పొదుపుఉద్యమంలో ఆంధ్రప్రదేశ్‌కు తృతీయస్థానం

జాతీయ పొదుపు కార్యక్రమానికి సంబంధించిన పేరోల్ సేవింగ్స్ పథకంలో ఆంధ్రప్రదేశ్ రూ 75 లక్షలు సేకరించి మొత్తం దేశంలోనే తృతీయస్థానం సంపాదించింది. 1961_62లో సేకరణమొత్తం కేవలం రూ 6 లక్షలు మాత్రమే వుంది.

ఆర్. టి. సి. కండక్టరు చూపిన నిజాయితీ

చార్‌మినార్ డిపోకు చెందిన ఆర్. టి. సి. కండక్టరు శ్రీ రామానుజులు చూపిన నిజాయితీకి, ప్రదర్శించిన ఉద్యోగ ధర్మానికి తగు పారితోషికం ఆయనకు లభించింది. అక్టోబరు 30వ తేదీన 8వ నెంబరు బస్సురూటులో ఆయన ఉద్యోగవిధిని నిర్వర్తిస్తుండగా ఆయనకు బంగారు ఆభరణాలుగల ఒక పర్సు దొరికింది. దానిని ఆయన డిపో అధికారులకు అప్పగించాడు. తదనంతరం ఆ వస్తువులు పోగొట్టుకున్న వ్యక్తి వచ్చి వాటిని తిరిగి పొందారు. శ్రీ రామానుజులు చూపిన నిజాయితీకి ఆ తరువాత తగు విధంగా పారితోషికం లభించింది.



హైదరాబాదు పబ్లిక్‌స్కూలు విద్యార్థులచే వ్యవసాయ కృషిలో స్వచ్ఛందసేవ

శాంతి గీతం

ప్రపంచంమీద పడగెత్తిన
భీషణ సంగ్రామ కాల విష వాయు మేఘాల చేత
నలుమూలలా ఆవరించిన అంధకార వలయాల మధ్య
దూరదూరాల జాలిజాలిగా వినిపించే
మానవత్వపు విలాపాల నడుమ
పగులబోయే గుండెల్ని గుప్పిట్లో పట్టుకుని
రోదసి అగాధాలలో ఆత్మహత్యకై పరుగులు పెడుతున్నాను

ఈనాడు నన్నెవ్వరూ ఆపకండి!
నన్ను నిలపడానికి వృథా యత్నాలు చెయ్యకండి!

నిన్న – నా శిరస్సుమీది పావురాన్ని నిమిరిన చేతుల్లో
నేడు – ప్రళయానల కీలల భయంకర నాట్యాలు!

నిన్న నా శరీరాన సవదరించిన తెలి చీర మీద
నేడు అమానుషత్వం కక్కించిన నెత్తురు మరకలు!

నిన్న గుండెతో గుండెనల్లిన నా మధుర స్వర సూత్రం పైన
నేడు కరాళ నియంతృత్వ కఠినాట్టహాసాల ఖడ్గ విఘాతాలు!

నిన్న మానవత్వంమీద విశ్వాసంతో
సమస్త జాతుల కూడలిలో నిలబడి
ఒడలంతా పులకించేటట్లు నవ్వినదాన్ని –

నేడు విశ్వాసం వదలిన నిట్టూర్పుయొక్క చివరి కదలికని –
తల్లిచేత క్రూర మృగాల మధ్య ఒంటరిగా వదలబడిన శిశువుని

నేడు నా గోడు వినే మానవుడు లేడు –
నన్ను రక్షించగల నాయకుడు లేడు –

రణరంగంగా మారి
రక్తగుండాలు తీర్చి

నన్ను హతమార్చే నాగరికత నుండి పారిపోయి
దేశాల సరిహద్దుల్లో ఆకాశాల నంటుతున్న
అగ్ని జ్వాలల్లో దూకి
మానవత్వపు ఆవలి తీరాన ఆహుతియై పోతాను!
కలతపడే కోటానుకోట్ల కవి హృదయాలలో
పొగలు చిమ్ముతూ
ఆక్రోశించే అనంతకోటి ఆశామయ మనస్సీమల్లో
హాహాకారాలు నింపుతూ

నేడే యీ జగత్తును వీడి నిష్క్రమిస్తాను –

ఈనాడు నన్నెవ్వరూ ఆపకండి!
నన్ను నిలపడానికి వృథాయత్నాలు చెయ్యకండి!

అద్దేపల్లి రామమోహనరావు

గ్రంథ సమీక్ష

మానవుడే మా సందేశం

మానవుడే మా సందేశం అనే పేరుతో యిటీవల వెలువడిన వచనకవితా సంకలనంలో 26 మంది కవుల గేయాలు వున్నవి. ప్రచురించినవారు: చైతన్య సంస్కృతి. జడచర్ల-మహబూబ్‌నగర్ జిల్లా. గ్రంథ మూల్యం రెండు రూపాయలు. ఈ సంకలనం నవయుగ కవితా ప్రవక్త శ్రీ శ్రీ కి అంకితం చేయబడింది.

దీనిలో శ్రీయుతులు కె. వి. రమణారెడ్డి, ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర, దాశరథి, సి. నారాయణరెడ్డి, కాళోజీ ప్రభృతులైన సుప్రసిద్ధ కవులేకాక, వేగుంట మోహనప్రసాద్, అద్దేపల్లి రామోహనరావు, వరవరరావు, నిఖిలేశ్వర్, ఇస్మాయిల్, శీలా వీర్రాజు వంటి క్రొత్తకారు కవుల రచనలు కూడా చేర్చబడినవి. 'యుగకర్త' అనే శీర్షికలో శ్రీ శ్రీని గురించి, ఆయన కవితా వైభవాన్ని గురించి రమణారెడ్డిగారు సుదీర్ఘమైన పీఠికరాశారు. ఎలిజీ కాదు ఎపాలజీ అనే శీర్షికలో శ్రీ సోమసుందర్ యిటీవలి కాలంలో వస్తున్న వింత కవిత్వపు ధోరణులను విమర్శిస్తూరాశారు. ''ఇది కవిత్వం కాదు భగవాన్! ఎలా గోషమించు మమ్మల్ని" అని దేవుణ్ణి ప్రార్థించుకున్నాడు. "వేళాపాళా ఎరుగని వేళాకోళపు వికటకవిత్వాలు"గా వాటిని వర్ణించాడు. "నివేదన" అనే గేయంలో శ్రీ రమణారెడ్డి "కవిగావించావేలరా నన్ను చెవి పుచ్చివున్న యీ తెనుగు జనం నడమ" అంటూ నేటి కవులది "కొరగామి" బ్రతుకంటూ చీదరించుకున్నాడు. చాలుగుపాదాలు, దాదాపు సరిసమానమైన పంక్తులూ గలిగి యిందులోని చరణాలు చూపులకు వృత్తాలుగా కనిపిస్తున్నాయి. కాని చదువుతుంటే వచన గేయంలో కొంత క్రమత అలవరచుకున్న కొత్తబాణీగా, చక్కని వ్యవహారికభాషలో, సంభాషణ శైలిలో నడిచిన యీ చరణాలు మనోహరంగా వున్నాయి. వేగుంట మోహన ప్రసాద్ "ఆఖరిఆశ్రమం" అనే గేయంలో "వెలుగు చల్లారిపోతున్న జీవితం" తనదుఃఖానికి హేతువుగా ప్రతిపాదించాడు. యువతరం కవుల్లో అప్పుడే ఒక సొంతశైలిని నిర్మించుకో గలిగిన రచయిత మోహనప్రసాదు. లోగడ అజంతాశైలిలో చూపిన కొన్ని ఛణుకులు యీయనలో పరాకాష్ట పొందినవి. కాని "పర్సనలీశ్వరుడు" "డెస్పరేటశక్తత" వంటి సంకర భాషా సమాసాలు కర్ణకఠోరంగా వుండక తప్పదు. గ్రంథారంభంలో శ్రీశ్రీ మీది గేయం తరువాత వెంటనే ఇస్మాయిల్ గేయం 'మెటమోర్ఫొసిస్' ప్రకటించి అచ్చు వైచిత్రి చూపించారు సంకలనకర్త. ఇటువంటి వింతలకు ఎంతటివారూ లొంగిపోతున్నారనడానికి యిదొక ఉదాహరణ. ఇదొక మంచి కవితా సంకలనం.

చేతనావర్తం

దీనిని వరంగల్లు సాహితీ బంధుబృందంవారు ప్రకటించారు. డా. సుప్రసన్న సంపాదకులు. డా. సుప్రసన్న, పేర్వారం జగన్నాథం. సంపత్కుమార. వే. నరసింహారెడ్డి గారల గేయాలు గల యీ సంకలనం వెలువడింది. వెల మూడు రూపాయలు. గ్రంథాంతంలో డా. సుప్రసన్న ఆధునిక వచన కవితావికాసాన్ని, దాని పరిణామాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ 18 పేజీల "భూమిక" రాశాడు. ఈ విమర్శావ్యాసం యీ సంకలనానికి మకుటాయమానంగా వుంది. "ఆధునిక చేతన ఒక విధంగా నిరంతరాన్వేషణ. అనంత దీర్ఘ ప్రయాణం. స్వప్నలోకంనుండి యథార్థం వైపు, అదర్శనం నుండి ఆత్మానుభవం వైపు యీ ప్రస్థానం" అని భూమికలో నిర్వచించబడింది. ఈ సంకలనంలోని నలుగురు రచయితలూ నాలుగు విశిష్టరీతులు ప్రదర్శించారు. డా. సుప్రసన్నలో వేదాంతభావన, శ్రీ పేర్వారం జగన్నాథంలో వ్యంగ్యాత్మకమైన అభ్యుదయ భావన, శ్రీ నరసింహారెడ్డిలో జాతీయ ప్రబోధము, శ్రీ సంపత్ కుమారాచార్యలో ఆత్మావలోకన ప్రధానమైన అభ్యుదయ భావన కనిపిస్తున్నాయి. శ్రీ నరసింహారెడ్డిగారి "రఫ్ స్కెచ్", సంపత్‌కుమారగారి "గృహప్రవేశం" డా॥ సుప్రసన్నగారి "అన్నా", జగన్నాథంగారి "పట్టాలు తప్పిన బండి" మొదలైనవి మంచి ఖండికలు. డా. సుప్రసన్న, సంపత్‌కుమార రచనల్లో పద్యరచనా స్ఫోరకమైన కావ్య భాషాశైలి అక్కడక్కడ కనిపించి వచనగేయాన్ని కుంటు పరుస్తున్నది.

"ఎంతసేపు చేస్తావీ అలంకృతి పరితఃప్రకీర్ణ వస్తుసమాదృతి?" "పదవే మరి వాంఛీకృత వదనా!", "నిన్నటి దాక నిర్జీవోగ్ర జ్వాలాంబరీషమై మండి, నేడు చిగ్గగనవర్షి చేసిన పయః కుంభ ధారాభిషిక్తమై" వంటివి.

మొత్తంమీద యిటీవల వెలువడిన కవితా సంకలనాల్లో "చేతనావర్తం" ఏవిధాన చూసినా ఉత్తమోత్తమైనదే.

జి. రామకృష్ణ

గ్రంథ స్వీకారం

(1) బహుమతి: వెల: 60 పై

(2) గురుభక్తి: వెల: 1 రూ

(3) శిశు; వెల; 80 పై

పై మూడు పుస్తకాల రచయిత

మండా సూర్యనారాయణ

ప్రతులకు:

నీతి కథాకల్పవల్లి

మహారాణిపేట, విశాఖపట్టణం – 2


పత్రికాప్రపంచం

నవంబరు ఒకటో తేదీ తెలుగు సీమకు పర్వదినం. ఆ తేదీయే, తెలుగు చిత్రసీమకు కూడా పర్వదినం అయింది. ఆంధ్రప్రభుత్వం చలనచిత్ర పరిశ్రమకు చేస్తున్న మహోపకారానికి, సేవకూ ఉదాహరణలు గత నవంబరు ఒకటో తేదీన, హైదరాబాదులో "బ్రహ్మానంద చిత్రపురి" వెలియడం; రెండు అధునాతనమైన సినిమా స్టూడియోలు నెలకొనడం.


ఫిలిం నగరాలను నిర్మించాలని ఎన్నాళ్ళనుంచో కృషి చేస్తున్న తక్కిన రాష్ట్రాలకు ఆంధ్రరాష్ట్రం మార్గదర్శకత్వం వహించింది. దేశంలో పెద్దదయిన బొంబాయి సినిమాపరిశ్రమ ఇంకా సాధించలేకపోయినదీ, మద్రాసు ప్రభుత్వం తలపెట్ట లేకపోయినదీ — ఆంధ్రరాష్ట్రం సాధించింది. ఈ మహత్తర సాధనకు కృషిచేసిన ఆంధ్రప్రభుత్వం, ప్రభుత్వాధినేతలూ చలనచిత్ర కళాకారులూ శ్లాఘనీయులు!

ఈ చిత్రపురిలో చలనచిత్ర కళాకారులు మెసలుతూ వుండడం, మరో రెండు స్టూడియోలు పని చేస్తూవుండడం వూహించుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ ఎలా అభివృద్ధి సాధిస్తున్నదన్న విషయం ఎవరూ చెప్పనవసరంలేదు. చిత్రపరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతగా అవసరమో ఆ విషయం గట్టిగా నిరూపిస్తుంది. "నవంబరు ఒకటి"నాడు హైదరాబాదులో జరిగిన "సినిమాపండుగ" చలనచిత్రసీమకే పండుగ.

—విజయచిత్ర సంపాదకీయం నుండి



అమెరికా పాత్రికేయులు హెచ్. ఎం. టి, కర్మాగారాన్ని నవంబరు 29 న సందర్శించినప్పటి చిత్రం



హైదరాబాదులో

28వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన

కేంద్ర హోంశాఖా మంత్రి శ్రీ వై. బి. చవన్ జనవరి 1వ తేదీన 28వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు ప్రారంభోత్సవంచేశారు. ఈ ప్రదర్శన వ్యవసాయానికి, పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు హోంమంత్రి తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. వ్యవసాయం భారతదేశపు ప్రాతిపదిక పరిశ్రమ అనీ, గడిచిన అయిదేళ్ళలోనూ వ్యవసాయానికి గడ్డుకాలమైనదనీ; ఈ నూతన సంవత్సరం, గత నిరాశకు స్వస్తిచెప్పి ఆశాజనకంగా వుండగలదని తాను నమ్ముతున్నాననీ అన్నారు.

ప్రారంభోత్సవ సభకు ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో అపారమైన ప్రకృతి వనరులువున్నాయనీ, వాటినిపూర్తిగా వినియోగించుకోవడం జరగడం లేదనీ, వాటినిపూర్తిగా వినియోగించుకోవడానికి అవసరమైన ఆర్థికసహాయాన్ని కేంద్రంనుంచి పొందేందుకు రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నదనీ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలలో కేంద్ర సహాయం రాష్ట్రప్రభుత్వానికి లభించగలదన్న తమ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

పారిశ్రామిక ప్రదర్శన సంఘానికి అధ్యక్షులైన వ్యవసాయ శాఖామంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి తమ స్వాగతోపన్యాసంలో, శాస్త్రీయపారిశ్రామిక రంగాలలో సృజనాత్మక శక్తిని ప్రోత్సహించే వుద్దేశంతో ఈ ప్రదర్శన సంఘం పటూ నూతన పరిశోధనకు బహుమతిని యివ్వడం ప్రారంభించిందని తెలియజేశారు.

ఈ ఏడాది ప్రభుత్వ స్టాలులన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం యీ ప్రదర్శనలో ప్రత్యేకత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన షుమారు 80 స్టాలులను ఒక ప్రత్యేకమైన ఆవరణలో ఏర్పాటుచేశారు. జనసంబంధ శ్రామికశాఖ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ సలహాపై యీ ఏర్పాటు చేయబడింది.

గడచిన నెలలో...

ఏ. ఎస్. ప్రైస

ఈ సంవత్సరం ఆఖరు అవుతున్న దశలో రాష్ట్రంలో అన్ని దశలలో ప్రజాకార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అధికారభాష భవితవ్యం, ఫీజు హెచ్చింపు ఫలితంగా విద్యార్థులలో బయలుదేరిన అశాంతి, కరువు బాధితులకు సహాయ కార్యక్రమాలవంటి ముఖ్య సమస్యలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. వాటికి తోడు అఖిల భారత కాంగ్రెసు సంఘం 71వ మహా సభను యిక్కడ జరపడానికి రాష్ట్రం ఆయత్తమవుతున్నది. ఆంధ్ర ప్రదేశ్‌కు, ఆంధ్రులకు యిది గర్వ కారణమైనది.

డిసెంబరు మొదటి వారంలో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భాషా సమస్య ప్రధానంగా చర్చించబడింది. డిసెంబరు 2వ తేదీన ఇంగ్లీషు భాషాబోధనకు సంబంధించిన అఖిల భారత సెమినారు ఇంగ్లీషు భాషా బోధన సంస్థ 4వ వార్షిక సమావేశాల ప్రారంభోత్సవంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు డా॥ డి. ఎస్. రెడ్డి ప్రసంగిస్తూ ఇంగ్లీషు భాష వాడకం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయతత్వం, భాషా దురభిమానాలను అరికట్టకుండానే అనాలోచితంగా ఇంగ్లీషు వాడకాన్ని విడినాడినప్పుడు మన దేశంలోనే మనం అపరిచితుల మవుతామని ఆయన అన్నారు. ఇంగ్లీషుభాషా అధ్యయనానికి అవకాశం కల్పిస్తూనే అండర్ గ్రాడ్యుయేటు స్థాయిలో ప్రాంతీయ భాషను బోధనా భాషగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందుకు డాక్టర్ రెడ్డి హర్షం ప్రకటించారు. అయితే పోస్టుగ్రాడ్యుయేటు స్థాయిలోనే గాక వృత్తి విద్య లన్నిటిలో ఇంగ్లీషు కొనసాగుతుంది. దీనివల్ల విద్యార్థులు, సిబ్బందీలో కలివిడికి అవకాశం ఏర్పడడమేగాక ఉన్నత స్థాయిలో సమైక్యతకు దారి ఏర్పడుతుంది.

కేంద్ర ఇంగ్లీషుభాషా బోధన సంస్థ డైరెక్టరు, ఆచార్య రమేశ్ మోహన్ ప్రసంగిస్తూ భారత దేశంలో ఇంగ్లీషుభాషపై అభిమానం సన్నగిల్లడానికి కారణం, కళాశాలలు, పాఠశాలలలో ఇంగ్లీషు భాషాబోధన ప్రమాణం పడి పోవడమేనని అన్నారు. ఇంగ్లీషు భాషను నేర్వాలనే ఉత్సాహం విద్యార్థులలో లేక పోవడానికి, ఇంగ్లీషు భాష అధ్యాపకులలో విశ్వాసం లేక పోవడమే కారణమని కూడ ఆయన అన్నారు.

రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో కరవు పరిస్థితులు ఏర్పడినాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలు, తూర్పు గోదావరి జిల్లాలోని ఎగువ తాలూకాలు, కృష్ణా జిల్లాలోని నూజివీడు, తాలూకా, పశ్చిమ గోదావరిలో ఏలూరు, చింతలపూడి, తాడేపల్లి గూడెం, తాలూకాలు, గుంటూరు జిల్లాలోని నరసారావు పేట, వినుకొండ, పల్నాడు, బాపట్ల, ఒంగోలు తాలూకాలు, నెల్లూరు జిల్లాలోని కనిగిరి, పొదిలి, దర్శి తాలూకాలు, కర్నూలు జిల్లాలోని మార్కాపురం ఎర్రగొండ పాలెం, అనంతపురం జిల్లాలోని మడకశిర, రాయదుర్గం. హిందూపురం, ధర్మవరం, తాలూకాలు, చిత్తూరు నల్లగొండ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలు కరువుకు గురి అయినాయి. డిసెంబరు 6వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో పరిస్థితి సమీక్షించింది. సహాయక చర్యలను తీసుకోవాలని నిర్ణయించారు.

ఆంధ్ర ప్రదేశ్‌లోని కరువు ఏర్పడిన ప్రాంతాలలో మాగాణీ, మెట్ట పంటలలో రూపాయిలో నాలుగు అణాలు అంతకు తక్కువ పంట దిగుబడి ఉన్న ప్రదేశాలలో పూర్తి రెమిషన్ నాలుగు అణాలు, ఆరణాలమధ్య పంట దిగుబడిగల ప్రదేశాలలో సగం రెమిషన్ మంజూరు చేయాలని నిర్ణయించారు. రెమిషన్ మంజూరు చేసిన ప్రాంతాలలో శిస్తు పసూళ్ళను వాయిదా వేయాలని కూడ నిర్ణయించారు. రైతులకు రు 2 కోట్ల మేరకు రెమిషన్ లభిస్తుంది. బావుల త్రవ్వకానికి భూమి తనఖా బ్యాంకుల ద్వారా రు 2 కోట్ల మేరకు ఋణాలు మంజూరు చేయడం జరుగుతుంది తక్కావీ ఋణాలను యిదివరకే యీ బ్యాంకుల ద్వారా యివ్వడం జరుగుతున్నది. ఋణాలను మంజూరు చేయడానికి సంబంధించిన విధానాలను ఒక నెల రోజులలో రూపొందించడం జరుగుతుంది వాటికి తోడు దిగువ తెల్పిన సహాయక చర్యలను కూడా తీసుకోవాలని మంత్రి వర్గం నిర్ణయించింది. బావుల త్రవ్వకం నిమిత్తం పంచాయతీ రాజ్ శాఖకు కేటాయించిన రు 15 లక్షల మొత్తాన్ని కలెక్టర్లు నిర్ణయించిన పనులకు ఖర్చు చేయడానికి వినియోగిస్తారు చక్కెర ఫ్యాక్టరీ ప్రాంతాలలో పనుల నిమిత్తం చెరకు గల పన్నుల నిధి నుండి రు 8 లక్షలు లభింపచేస్తారు.

రెవిన్యూ బోర్డు అధీనంలో రు 33 లక్షల మొత్తాన్ని ఉంచుతారు. సంబంధిత రెవిన్యూ బోర్డు సభ్యుడు వివిధ ప్రాంతాలలో జరుగుతున్న పనులను సమీక్షించి కొత్త పనులను చేపట్టతారు. సాధారణమైన పనులను త్వరిత గతిని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలను తీసుకుంటారు. శాశ్వతంగా నిలిచే పనలను చేపట్టాలనే లక్ష్యంతోనే యీ పనులను ప్రారంభించారు పి. డబ్ల్యు. డి. లో చిన్న తరహా నీటి పారుదల పద్దు క్రింద మిగిలిన రు 80 లక్షలు, పంచాయతీ రాజ్ శాఖ పద్దులో గల రు 25 లక్షల మొత్తాలను విడుదల చేయాలని కూడ నిర్ణయించారు అయితే ప్రస్తుత ఆర్థిక చిక్కుల దృష్ట్యా వాటి విడుదలపై నిర్బంధాలు విధించడం జరిగింది. రిజర్వు అడవులలో పశువుల మేపడానికి అనుమతి యిస్తారు. ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు అమలు జరపడాన్ని ప్రజలలోని అన్ని వర్గాలవారు హర్షిస్తున్నారు.

తెలంగాణా ప్రాంతంలో పాఠశాల ఫీజులను హెచ్చించిన ఫలితంగా తెలంగాణాలోని కొన్ని ప్రదేశాలలోను, హైదరాబాదు నగరంలోను విద్యార్థులు ఆందోళన ప్రారంభించారు. పలుకుబడి గల ప్రజా ప్రతినిధులు, కొందరు మంత్రులు చేసిన సూచనలను ముఖ్యమంత్రి వెంటనే అంగీకరించారు. 1967 అక్టోబరు 1వ తేదీ నుండి వసూలు చేసే ఫీజు రేటను మరికొంత తగ్గిస్తూ డిసెంబరు 6వ తేదీన ఆయన ప్రకటన జారీ చేశారు. ఉన్నత పాఠశాలలో ఫీజు రేట్లు దిగువ విధంగా ఉంటాయి. 9వ తరగతి : నెలకు రు 3_ ; 10వ తరగతి : రు 3_25; 11వ తరగతి : రు 3_50; హయ్యర్ సెకండరీ బహుళార్థ సాధక పాఠశాలలో_9వ తరగతి రు 4_50; 10వ తరగతి : రు 4_75; 11వ తరగలి : రు 5_00 12వ తరగతి రు 5_50.

రాష్ట్రమంతటా ఒకే విధమైన విద్యానిబంధనలు, విధానాలను అమలు జరిపిన ఫలితంగా ఫీజులను ఎక్కువ చేయడం జరిగింది. ఆంధ్ర ప్రాంతంలో అమలులో ఉన్నస్థాయికి ఫీజు రేట్లను ఎక్కువ చేయడంవల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో ఫీజులను పెంచినట్లు కనిపిస్తుంది. ఈ విధంగా చేయడం సమంజసం కాదనీ, యీ వ్యత్యాసాన్ని ఒకేసారిగా గాక దశల వారీగా పూరించాలని ప్రభుత్వం భావించింది. తత్ఫలితంగా ఫీజు పెంచింపులో మరి కొంత మినహాయింపు చేయడంవల్ల ప్రభుత్వ బొక్కసానికి రు. 20 లక్షలు నష్టం వస్తున్నది. తెలంగాణాలోని మొత్తం 91,000 మంది విద్యార్థులలో మూడింట ఒకవంతు మాత్రమే పూర్తి ఫీజు చెల్లిస్తున్నారు. దాదాపు 58,000 మంది సగం ఫీజు చెల్లింపు రాయితీ పొందుతున్నారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులకు చెందిన 80 లక్షల మంది విద్యార్థులు ఫీజుమాఫీ సౌకర్యాన్ని పొందుతున్నారు. మెరిట్ స్కాలర్‌షిప్పులను మంజూరు చేస్తున్న దృష్ట్యా మరో 5,000 నుండి 6,000 మంది విద్యార్థులకు యీ ఫీజు హెచ్చింపు వర్తించదని అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలను సమీకరించడానికి అవసరమైన చర్యలన్నిటిని తీసుకోవడం జరుగుతున్నదనీ, ఈ సందర్భంలో రెండు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొనే యిబ్బందులను సాధ్యమైనంత వరకు తొలగించడం జరుగుతున్నదనీ ముఖ్యమంత్రి పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర విషయాలలో మాదిరిగానే విద్యా విషయంలో కూడా యిదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. రెండు ప్రాంతాలలో అందరికీ వర్తించే విధంగా ఒకేరీతి విద్యానియమావళిని రూపొందించే దృష్టితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘంచేసిన సిఫార్సులను అనుసరించి సమీకృత నియమావళిని రూపొందించి 1966-67 విద్యా సంవత్సరం నుండి అమలులోకి తెచ్చారు. దానికితోడు ఆంధ్ర ప్రాంతంలో అమలులోఉన్న విద్యావిషయక సౌకర్యాలను తెలంగాణా ప్రాంతంలో కూడ అమలు జరుపుతున్నారు. ప్రభుత్వం ఫీజులలో తగ్గింపును ప్రకటించిన వెంటనే విద్యార్థుల ఆందోళనలో తీవ్రత తగ్గి డిసెంబరునుండి తిరిగి పాఠశాలలను ప్రారంభించే అవకాశం కలిగింది. ఆందోళన సందర్భంలో సంఘవ్యతిరేక శక్తులు యీ ఆందోళన ఆసరాగా ప్రభుత్వం ఆస్తులకు నష్టం కలిగించారనడంలో సందేహంలేదు. ఈ సంఘటనలను ప్రజలు, పత్రికలు, తీవ్రంగా గర్హించారు.


ప్రభుత్వ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు చలన చిత్ర సదస్సు జరగడం గమనార్హమైన విషయం. చలనచిత్ర పరిశ్రమలోని అన్ని వర్గాలవారు ఒకచోటచేరి పరిశ్రమకు సంబంధించిన అన్ని సమస్యలను కూలంకషంగా, నిర్మొహమాటంగా చర్చించడం యిదే ప్రథమం. డిసెంబరు 26న ముఖ్యమంత్రి, రవీంద్ర భారతిలో యీ సదస్సుకు ప్రారంభోత్సవం చేశారు. భవిష్యత్తరాలవారైన బాలలను తీర్చిదిద్దడానికి వీలుగా బాలల చిత్రాలను విరివిగా నిర్మించాలని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. ప్రస్తుత ఆందోళన, అశాంతి ధోరణులను నిరసిస్తూ "మనం చూచే నేటి పరిస్థితులు తాత్కాలికమైనవేనని నేను భావిస్తున్నాను. అయితే ప్రసిద్ధులైన మీవంటి స్నేహితులు (నిర్మాతలు) పౌరులుగా తమ విద్యుక్తధర్మాన్ని నెరవేర్చాలి" అని ఆయన అన్నారు. చలనచిత్ర నిర్మాతలు, పరిశ్రమకు చెందిన ఇతరులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సర్వవిధాల సహాయపడుతుందని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు. ముడిఫిల్ము, యంత్ర పరికరాల దిగుమతులకు సంబంధించి కేంద్రప్రభుత్వ సహాయాన్ని పొందడానికి కృషి జరగాల్సి ఉంది. కొన్ని సంప్రదాయాలు, జీవన విధానాలకు హైదరాబాదు ప్రసిద్ధి చెందిన విషయాన్ని ప్రస్తావించి సమాజ జీవితానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం ఆత్రుత చెందుతున్నదని ముఖ్యమంత్రి అన్నారు.

మూడు రోజులపాటు జరిగిన సదస్సులో వివిధ తీర్మానాలను ఆమోదించారు. అందులో బ్రహ్మానంద చిత్రపురిని త్వరితగతిని అభివృద్ధి పరచడం, చలనచిత్ర నిర్మాణాన్ని, చలనచిత్ర అభివృద్ధి మండలిని,బాలల చిత్రాల నిర్మాణాన్ని మెరుగు పరచడం కూడ ఉన్నాయి.

విశాఖపట్నంలో డిసెంబరు 10వ తేదీన కోరమాండల్ భారీ ఎరువుల ఫ్యాక్టరీకి ఉపప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్ ప్రారంభోత్సవం చేయడం, ప్రైవేటు పరిశ్రమల రంగంలో గమనార్హమైనది. ఆగ్నేయాసియాలో యీతరహాకు చెందిన ఫ్యాక్టరీలలో యిదే పెద్ద ఫ్యాక్టరీ. విశాఖపట్నం రేవులో 500 ఎకరాల విస్తీర్ణంలో దానిని నిర్మించారు. రూపాయి మారకం విలువ తగ్గింపుకు పూర్వం దానిని నిర్మాణానికి రు. 30 కోట్ల ఖర్చు అంచనా వేశారు. వాషింగ్టన్‌లోని ఎగుమతి, దిగుమతుల బ్యాంకు,యు ఎస్ ఐ డి వారు అవసరమైన దీర్ఘకాలిక ఋణాలను మంజూరు చేశారు. అయితే రూపాయి మారకం విలువ తగ్గింపు కారణంగా యీ ఫ్యాక్టరీ నిర్మాణం ఖర్చు రు 48.4 కోట్లకు పెరిగింది. కోరమాండల్‌వారు రైతులకు ఆధునిక విధానాలను గూర్చి 'గ్రోమోరు' ద్వారా కూడ ప్రచారంచేయడం విశేషం.ఈ ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఫలితంగా ఎరువుల దిగుమతుల తగ్గింపు ద్వారా వార్షికంగా రు 16 కోట్ల మేరకు ఆదా అవుతుందని భావిస్తున్నారు. ఈ ఎరువుల వాడకం ఫలితంగా రైతులకు రు. 39 కోట్ల ఆదాయం లభిస్తుంది. అదనపు ఉత్పత్తి ద్వారా అదనంగా లక్షల మందికి ఆహారం లభిస్తుంది.

కోరమాండల్ ఎరువుల ఫ్యాక్టరీ నిర్మించాలని 1959లో నిర్ణయించారు. భారత వ్యవసాయ అవసరాలను పరిశీలించిన ఫోర్డుఫౌండేషన్ సంస్థ, రెండు అమెరికన్ ఎరువుల సంస్థలు, అంతర్జాతీయ ఖనిజ, రసాయనాల కార్పొరేషన్, కాలిఫోర్నియా స్టాండర్డు ఆయిల్ కంపెనీ వారి అనుబంధ సంస్థ, చెవరెన్ రసాయన కంపెనీవారు భారతీయ సంస్థతో కలిసి విశాఖపట్నంలో నిర్మించే యీ ఫ్యాక్టరీ నిర్మాణానికి 1961లో లైసెన్సు లభించింది. "దక్షిణ భారత ధాన్యాగారం"గా ప్రఖ్యాతి గాంచిన ఆంధ్రప్రదేశ్‌లో యిటువంటి ఎరువుల కర్మాగారం నిర్మించడం ఎంతో గర్వకారణమైన విషయంగా పేర్కొనవచ్చు. ★

జిల్లాలనుండి



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీపట్టం ఎ. థానుపిళ్ళై నవంబరు 29వ తేదీన విజయవాడలో స్టేడియం గ్రౌండ్స్‌కు ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం

విజయవాడ స్టేడియంకు గవర్నరు ప్రారంభోత్సవం

ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ పట్టం ఎ. థానుపిళ్లై నవంబరు 29 న విజయవాడలో మునిసిపల్ స్టేడియంకు ప్రారంభోత్సవం చేశారు.

మంచినీటి పథకాలకు మంజూరీ

రాజానగరం పంచాయతీ సమితి నవంబరు 24 వ తేదీ సమావేశంలో రూ. 76,000 లు మంచినీటి సరఫరాకు, రూ. 61,350 లు మందులకు మంజూరుచేసింది. 13 గ్రామాలకు మంచినీటిని లారీలద్వారా, రెండెడ్ల బళ్ళద్వారా సరఫరా చేసేందుకై రూ. 1,00,000 లను కూడా మంజూరు చేసింది.

భూములులేని రైతులకు పట్టాలు

మదనూరు తాలూకాలోని భూములేని రైతులకు నిజామాబాదు జిల్లా కలెక్టరు శ్రీ టి. ఎల్. శంకర్ 250 పట్టాలను పంపిణీ చేశారు. వ్యవసాయోత్పత్తిని అభివృద్ధి పరచడమే ఈ పట్టాల పంపిణీ లక్ష్యమని కలెక్టరు తెలియజేశారు

శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లి తాలూకాలో 1,353 ఎకరాల బంజరుభూమిని బీదవారికి పంపిణీచేశారు.

నవంబరు 24 న చేవెళ్ళ తాలూకాలోని మెడపల్లి, మోకిల గ్రామాలలో బీదలకు హైదరాబాదు జిల్లా కలెక్టరు శ్రీ శ్రావణం కుమార్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంలో జరిగిన సభలో పరిషత్తు అధ్యక్షుడు శ్రీ భోజరెడ్డి మాట్లాడుతూ బీద రైతులకు పట్టాలు పంపిణీచేయడం చాలా సంతోషదాయకమనీ, అయితే యీ భూమిని సారవంతమైన సేద్యపు నేలగా చేసేబాధ్యతంతా గ్రహీతలమీద యిప్పుడు పడినదనీ దానిని వారు సాధించి అధికోత్పత్తికి యధోచితంగా తోడ్పడాలని చెప్పారు. డి. సత్యనారాయణ ఎం. ఎల్. ఎ. కూడా ఈ సందర్భంలో ప్రసంగించారు.

రోడ్లమరమ్మతుకు మంజూరు

భన్స్వాడ పంచాయతీ సమితి డిసెంబరు 18 న జరిగిన సర్వసభ్య సమావేశంలో, సవరణ బడ్జెటును ఆమోదించింది. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, తెలంగాణా ప్రాంతీయ సంఘం నిధినుండి రూ. 80 లక్షలతో, చెరకు పన్నునిధి రూ. 75 లక్షలతో రోడ్ల మరమ్మతు కార్యక్రమాన్ని పరిషత్తు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

మహిళా మండలులకు ప్రారంభోత్సవం

ప్రతిగ్రామంలోనూ మహిళామండలి వుండవలసిన అవసరాన్ని గూర్చి శాసన సభ్యురాలు శ్రీమతి వాణీరమణరావు భద్రాచలంలో మహిళామండలికి ప్రారంభోత్సవం చేస్తూ తెలియజేశారు. గ్రామాలలోని నిరక్షరాస్యులైన మహిళలు సమాజానికి తోడ్పడే విధంగా వారికి చదువు, విజ్ఞాన విషయాలను నేర్పేందుకు విద్యావతి అయిన ప్రతి మహిళా ప్రయత్నించాలని ఆమె అన్నారు.

యాచారంలో నవంబరు 11 వ తేదీన శ్రీ జనాభ్యుదయ శాఖ డైరెక్టరు శ్రీమతి రాజ్యంసిన్హా ఒక మహిళా మండలి భవనానికి ప్రారంభోత్సవం చేశారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎం. భోజరెడ్డి అధ్యక్షత వహించారు.

మార్కెటు ప్రారంభోత్సవం

గుడివాడలో డిసెంబరు 2వ తేదీన కటారి సుబ్బయ్య పురపాలకసంఘ కూరగాయల మార్కెటుకు పురపాలక వ్యవహారాల శాఖా మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

సూపర్ మార్కెటు


నరసీపట్నంలో రూ. 60,000 ల ఖర్చుతో ప్రభుత్వోద్యోగుల సహకార సంఘం నిర్మించిన సూపర్ మార్కెటును నవంబరు 27న కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ. జె. వి. నరసింగరావు ప్రారంభోత్సవం చేశారు.



శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు సబ్-తాలూకాకు చెందిన ఎచ్చెర్లలో బీద రైతులకు జిల్లా కలెక్టరు పట్టాలను పంపిణీచేశారు

పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

హైదరాబాదు సమీపంలోని శివరాంపల్లి గ్రామంలో డిసెంబరు 3వ తేదీన క పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం జర్గింది.



అనంతపురంలో బాలల విన్యాసం

తెలంగాణా ప్రాంతీయ సంఘం నిధినుండి రూ. 26,000 ల వ్యయంతో సంగ్విలోనూ, రూ. 25,000 ల వ్యయంతో దాపిగుడాలోను నిర్మించిన పాఠశాల భవనాలను ఆదిలాబాదుజిల్లా కలెక్టరు శ్రీ కె. రంగారావు ప్రారంభోత్సవం చేశారు.

టెలిఫోను ఎక్స్ఛేంజి

నల్గొండ జిల్లాలోని చిట్యాలలో నవంబరు 16న 25 లైన్ల ఆటొమేటిక్ టెలిఫోను ఎక్స్ఛేంజికి ప్రారంభోత్సవం జరిగింది.

పంచాయతీ ఘర్


అన్నవరం పంచాయతీ సమితికి చెందిన ఎస్. అన్నవరంలో గ్రామ పంచాయతీకి చెందిన ఒక కొత్త కార్యాలయ భవనానికి శాసన సభ్యుడు శ్రీ ఎస్. ఆర్. వి. వి. కృష్ణంరాజు డిసెంబరు 11న ప్రారంభోత్సవం చేశారు.

కొత్త హాలు

సింగనమల్లలో ఇటీవల కొత్తగా నిర్మించిన పంచాయతీ సమితి సమావేశం హాలును అనంతపురం జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ టి. రామచంద్రారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. సబ్సిడీ పొందిన బావులు, విద్యుచ్ఛక్తి విస్తరణ పథకాల విషయంలో ఈ సమితి ఈ జిల్లాలోనే అగ్రస్థానం వహిస్తుంది. ఇక్కడ నిర్మించిన ఈ హాలుకు ఖర్చు రూ. 35,000 అయ్యింది.

రోడ్డు వంతెన

నరసీపట్నం, తాళ్ళపాలెం రోడ్డుమార్గంలోని దిగువ వరాహ నదిమీద రోడ్డు వంతెనను నవంబరు 27న కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు ప్రారంభోత్సవం చేశారు. దీనికి రూ. 8.3 లక్షలు వ్యయమయింది.



న్యాయశాఖా మంత్రి శ్రీ కె. వి. నారాయణరెడ్డి రైతులతో ముచ్చటిస్తున్న దృశ్యం

ప్రపంచ పరిస్థితులు

బి. నాగేశ్వరరావు

శ్రీ మెక్ నమరా - ప్రపంచ బ్యాంకు

యునైటెడ్ స్టేట్స్ రక్షణశాఖ నుంచి శ్రీ రాబర్ట్ ఎస్. మెక్ నమరా నిష్క్రమించడంతో ప్రెసిడెంట్ జాన్సన్ వైఖరి విషయంలో, ముఖ్యంగా వియత్నామ్ యుద్ధానికి సంబంధించి ఆయన దృక్పథం విషయంలో, ప్రపంచ వ్యాప్తంగా ఊహాగానాలు బయలుదేరాయి.

శ్రీ మెక్‌నమరా, వియత్‌నామ్ యుద్ధం పరిష్కారానికి కేవలం సైనిక సంబంధమైన మార్గాన్ని అవలంబించే విషయంలో సేనానులతోనూ, ఆయుధాల ఉత్పత్తిదార్లతోనే గాకుండా ప్రెసిడెంట్‌తో కూడా ఘర్షణ పడినాడని విశ్వసించడానికి ప్రబలమైన ఆధారాలు వున్నాయి. అమెరికా వార్తా పత్రికా సంపాదకుల సంస్థ సమావేశంలో ప్రసంగిస్తూ శ్రీ మెక్ నమరా, ఏదైనా దేశం యొక్క రక్షణ విషయంలో కేవలం సైనిక శక్తి మాత్రమే ప్రధానం కాజాలదనే అభిప్రాయాన్ని వెళ్ళడించడం జరిగింది.

అమెరికా దేశపు అత్యంత ప్రతిభావంతుడైన రక్షణ కార్యదర్శిగా, గొప్ప ప్రభుత్వోద్యోగిగా శ్రీ మెక్ నమరా ఖ్యాతి గాంచారు. 1947 వ సంవత్సరంలో ఈ పదవి ఏర్పరచబడినప్పటి నుంచి ఆయన ఎనిమిదవ రక్షణ కార్యదర్శి.

శ్రీ మెక్ నమరా ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు అధినేతగా వున్నారు. దీనిలో 107 దేశాలకు సభ్యత్వం వుంది. 1954 వ సంవత్సరంలో యిది పని ప్రారంభించిన నాటినుంచి యిప్పటివరకు పన్నెండు బిలియన్ డాలర్లకు పైగా ఋణాలు మంజూరు చేసింది. మొదట యూరపు దేశాలు ఈ బ్యాంకు నుంచి ఎక్కువగా ప్రయోజనాలు పొందాయి. యుద్ధానంతరం సాగిన పునర్నిర్మాణ కృషిలో ఆ దేశాలకు సహాయం అవసరమైంది. యిప్పుడు వెనుకబడిన దేశాలు ఈ బ్యాంకు నుంచి విరివిగా సహాయం పొందుతున్నాయి.

దక్షిణాఫ్రికాకు ఆయుధాల సరఫరా

దక్షిణాఫ్రికాకు ఆయుధాలను సరఫరా చేయడంపై గల ఆంక్షను తొలగించడానికి విల్సన్ ప్రభుత్వం ఉద్దేశిస్తున్నదన్న వార్త బ్రిటిష్ లేబర్ పార్టీలోని అభ్యుదయ వర్గాల నిరసనకు గురైంది. ఈ వార్త ఆఫ్రికా దేశాల వారికీ, దక్షిణాఫ్రికా అలక్ష్యంగా పాటిస్తున్న జాతి విచక్షణా విధానాన్ని అంతమొందించడానికి పూనుకున్నవారికీ విస్మయం, ఆందోళన కలిగించింది. కాని అదృష్టవశాత్తు తరువాత మంత్రివర్గం, దక్షిణాఫ్రికాకు ఆయుధాల సరఫరాపైన ఆంక్షను కొనసాగిస్తున్నట్లు ధృవీకరించింది.

యూరపు ఉమ్మడి మార్కెటు

యూరపు ఉమ్మడి మార్కెటులో బ్రిటన్‌ను ప్రవేశపెట్టడానికి విల్సన్ ప్రభుత్వం నిరంతరాయంగా కృషి చేస్తుండడం వల్ల ఇంగ్లాండు, ఫ్రాన్సులమధ్య ఉద్రిక్తత పెరుగుతున్నది. వెనుకబడివున్న తన పారిశ్రామికరంగాన్ని పునరుద్ధరించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికి బ్రిటన్ కృతనిశ్చయంతో కృషి చేస్తున్నది.

గ్రీకు రాజరికం

గ్రీకు రాజరికాన్ని, గ్రీకు ప్రజాస్వామ్యంతో మేళవించి సాగించడానికి రాజు కాన్‌స్టన్‌టైన్ చేసిన ప్రయత్నం ఈ రెండింటికీ ఉపద్రవంగా పరిణమించింది. రాజు రోమ్‌కు తరలి వెళ్లాడు. తిరుగుబాటును వమ్ముచేసిన సేనానులు ఈ ప్రాచీన దేశంలో కఠిన నిరంకుశ పరిపాలనను ప్రవేశ పెట్టారు. దేశపు రాజకీయ వ్యవస్థను నిర్ణయించడంలో రాజుకు ఎట్టి ప్రమేయం లేకుండా చేస్తూ ఆయనకు సింహాసనాన్ని తిరిగి అప్పగించడానికి సేనానులు ముందుకు వచ్చారు. కాని అది ఫలించలేదు.

పరస్పర సహకారం

వాణిజ్యానికై రూ. 50 కోట్ల మేరకు పరస్పర ప్రాధాన్యతల పట్టికలను రూపొందించుకోడానికి యిటీవల ఇండియా, యుగోస్లావియా, యునైటెడ్ అరబ్ రిపబ్లిక్ దేశాలమధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దీనితో వెనుకబడిన దేశాలు తమతమ ఆర్థిక వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవడంలో పరస్పరం తోడ్పడే వినూత్న మార్గం ఏర్పడింది. ఇటీవలి సంవత్సరాలలో యుగోస్లావియా, భారతదేశపు విద్యుచ్ఛక్తి, భారీ యింజనీరింగు పరిశ్రమల నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించింది. ఇండియా ఇంజనీరింగు వస్తువులను యు. ఏ. ఆర్. బాగా అభిమానిస్తున్నది. ఈ దేశం మనదేశంనుంచి పొగాకును విరివిగా దిగుమతి చేసుకుంటున్నది. కొన్ని రంగాలలో భారత-యు. ఏ. ఆర్. ల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ పథకాలు అమలు జరిగే అవకాశాలు మిక్కుటంగా వున్నాయి. ★

PUBLISHED BY THE DIRECTOR, JANA SAMBANDHA SAKHA, A.P. HYDERABAD. PRINTED BY THE DIRECTOR, OF PRINTING AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.

